

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



హైదరాబాద్–డిండి **12**

గ్రీన్‌ఫీల్డ్ హైవే!

85 కి.మీ... 4 లేన్లు... రూ.1525 కోట్ల వ్యయం

ప్రస్తుత రహదారికి ప్రత్యామ్నాయంగా రెండు కొత్త అలైన్‌మెంట్లు సిద్ధం చేసిన ఎన్‌హెచ్ఏఐ

గురువారం | 9-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 282 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: దశమి మ. 12.23 తదుపరి ఏకాదశి; నక్షత్రం: భరణి మ. 3.07 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా.2.26-3.56; దుర్ముహూర్తం: ఉ.10.31-11.16, మ.2.56-3.40; అమృతఘడియలు: ఉ.10.35-12.05; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.53 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తిరుపతిలో తొక్కిసలాట
ఆరుగురి దుర్మరణం

వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో అపశ్రుతి


టోకెన్ల కేంద్రం వద్ద తోపులాట దృశ్యం


- రాత్రి 8.50కి క్యూలైన్‌లోకి అనుమతి
- ఒక్కసారిగా దూసుకొచ్చిన భక్తులు
- ఒత్తిడి తట్టుకోలేక తెరుచుకున్న గేటు
- ఒక్కసారిగా తోపులాట.. నలిగిన భక్తులు
- పెద్దసంఖ్యలో భక్తులకు గాయాలు
- టీటీడీ చరిత్రలో తొలిసారి ఇలాంటి దుర్ఘటన


తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన భక్తులు

'తిరుమల' చరిత్రలోనే తీవ్ర విషాదం చోటు చేసుకుంది! రద్దీ సమయాల్లో తొక్కిసలాటలు జరగడం సాధారణమే అయినప్పటికీ... తొలిసారిగా, ఆ దశ దాటి భక్తుల మరణాలూ సంభవించాయి. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనుండగా... తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్లే మృత్యు వేదికలయ్యాయి. సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు... తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏకంగా 90 టోకెన్ జారీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఇలా గేట్లు తెరవగానే అలా భక్తులు ఒక్కసారిగా దూసుకురావడంతో... పలుచోట్ల తొక్కిసలాట జరిగింది. అందులో... బైరాగిపట్టెడ కేంద్రం వద్ద పరిస్థితి మరింత విషమించింది. రద్దీలో ఇరుక్కుపోయిన భక్తులు ఊపిరాడక అల్లాడిపోయారు. మహిళలు మరింత విలవిలలాడారు. ఈ విషాదంలో ఆరుగురు మరణించగా... వారిలో ఐదుగురు మహిళలే. తొక్కిసలాటలో పెద్దసంఖ్యలో భక్తులు గాయపడ్డారు. వారికి తిరుపతిలోని స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటల్లో గాయపడటం వంటి ఘటనలు జరిగినప్పటికీ... మరణాలు సంభవించడం ఇదే మొదటిసారి. 14

అంతా కేటీఆరే చేశారు!

ఫార్ములా-ఈ కారు రేసు ఒప్పందాలు, చెల్లింపులన్నీ ఆయన కనుసన్నల్లోనే జరిగాయి


అర్వింద్ కుమార్

- నిబంధనల ఉల్లంఘన గురించి మంత్రికి చెప్పాం
- మళ్లీ మనదే అధికారం.. ప్రొసీడ్ అన్నారు
- ప్రభుత్వ అధికారిగా.. మంత్రి చెప్పినట్లు చేశాను
- ప్రజాధనం దుర్వినియోగాన్ని అడ్డుకోలేకపోయాను
- ఏస్ నెక్ట్స్‌జెన్ కంపెనీ కేటీఆర్ స్నేహితుడిది
- రేసు నిర్వహణలోకి పురపాలక శాఖను లాగారు
- ఏసీబీ విచారణలో అర్వింద్ కుమార్ వెల్లడి!
- ఆరు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన విచారణ

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారమంతా నాటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ కనుసన్నల్లోనే జరిగిందని అప్పట్లో ఆ శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరించిన అర్వింద్ కుమార్.. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. విదేశీ కంపెనీకి పురపాలక శాఖ నేరుగా నిధులు చెల్లిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని కేటీఆర్‌కు చెప్పానని, అయితే అంతా తాను చూసుకుంటానని ఆయన అన్నారని అర్వింద్ కుమార్ వెల్లడించినట్లు సమాచారం. ఒక ప్రభుత్వ అధికారిగా మంత్రి చెప్పినట్లు నడుచుకున్నానని, ఇందులో తన స్వార్థమేమీ లేదని అన్నట్లు, అయితే.. ప్రజాధనం దుర్వినియోగమవుతుంటే కాపాడలేకపోవడం వాస్తవమేనని ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏ2గా ఉన్న అర్వింద్ కుమార్ బుధవారం ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఉదయం 9.40 గంటలకు ఆయన ఏసీబీ కార్యాలయానికి చేరుకోగా.. 10.30 గంటల తర్వాత ఆయనను ఏసీబీ సీఐయూ టీం సభ్యులు పలు అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నించారు. సాయంత్రం 4.30 వరకు దాదాపు ఆరు గంటలపాటు

మిగతా 13వ పేజీలో...

కేటీఆర్ ఇంటికా? జైలుకా?

- నేడు ఏసీబీ విచారణకు..
- అర్వింద్ కుమార్ విచారణ పూర్తవడంతో కేటీఆర్‌కు కీలక ప్రశ్నలు సంధించే అవకాశం!
- పూర్తిస్థాయిలో సన్నద్ధమైన ఏసీబీ
- భారీ బందోబస్తు.. ఏసీబీ కార్యాలయం రోడ్డు మూసివేత


తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ దైరీ ఆవిష్కరణలో హరీశ్‌తో కేటీఆర్

రేవంత్.. నన్నేం పీకలేవ్!

- లొట్టపీసు కేసు.. లొట్టపీసు ముఖ్యమంత్రి 13
- ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు పోరాడాలి: కేటీఆర్

నేను నిమిత్తమాత్రుడినే!

- కేటీఆర్, అర్వింద్ కుమార్ చెప్పినట్లు చేశాను
- ఈడీ విచారణలో బీఎల్ఎన్ రెడ్డి వెల్లడి 13

కేటీఆర్ విచారణ సమయంలో కనుచూపు మేరలో

లాయర్‌ను కూర్చోనివ్వండి: హైకోర్టు

ఔటర్, కైటెక్స్ కాంట్రాక్టుల్లో అక్రమాలు

ఏసీబీకి బీసీ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదు 13



గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో వేణుగోపాల్, రేవంత్, భట్టి, మహేశ్

కార్యకర్తలను
పట్టించుకోండి!

- మంత్రుల పనితీరుపై ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్యేల తీరుపై కార్యకర్తలు హ్యాపీగా లేరు
- అందరూ పనితీరును మెరుగుపరచుకోవాలి.. సంక్షేమ కార్యక్రమాల అమలు బాగుంది
- ప్రచారం ప్రజల్లోకి వెళ్లేలా పీసీసీ చూడాలి.. పీఏసీ భేటీలో కేసీ వేణుగోపాల్ నిర్దేశం
- నెలలో కమిటీల నిర్మాణం.. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి పీఏసీ నిర్ణయం

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): "అధికారం వచ్చి ఏడాది గడిచింది. మీరు పదవులు అనుభవిస్తున్నారు. ఇకనైనా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయండి.. వారిని కాపాడుకోండి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి వారికి అవకాశం కల్పించండి" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్.. టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని, వారి పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని అన్నారు. మంత్రుల పనితీరు పట్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల పనితీరు పట్ల పార్టీ కార్యకర్తలూ సంతోషంగా లేరని తెలిపారు. దీనిని సరిదిద్దుకోవాలని

మిగతా 12వ పేజీలో...

త్వరలో స్థానిక ఎన్నికలు

- సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంత్ పిలుపు
- మన్మోహన్‌సింగ్‌కు పీఏసీ నివాళి 12

పాలమూరు-రంగారెడ్డిలో ప్రతిబంధకాలు తొలగించాలి

- నార్లాపూర్-ఏదుల లింక్ పనులు చేయించాలి
- పుట్టంగండి లీకేజీలు అరికట్టాలి
- రిజర్వాయర్ నుంచి 10 కి.మీ మేర గ్రావిటీ కెనాల్ లైనింగ్ చేపట్టాలి: సీఎం రేవంత్

గేమ్ చేంజర్ సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి 14


విశాఖపట్నంలో జరిగిన రోడ్ షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్

మీ సంకల్పానికి
మా సహకారం

- బాబు 'విజన్ 2047'కు సంపూర్ణ మద్దతు
- దక్షిణ మధ్య రైల్వే జోన్‌తో ఏపీ ప్రగతికి ఊతం
- విశాఖ సభలో ప్రధాని మోదీ భరోసా 3
- రూ.2.08లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- మోదీ మద్దతుతో అమరావతి పూర్తి చేస్తాం: బాబు
- మోదీ, బాబు నుంచి నేర్చుకుని పనిచేస్తున్నా: పవన్

తెలంగాణలో కింగ్‌ఫిషర్ బీర్లు
విక్రయించం!

- బకాయిలు చెల్లించలేదు.. ధరలు పెంచలేదు..
- అమ్మకాలు నిలిపేస్తున్నాం.. ఎక్సైజ్‌కు యూబీ గ్రూప్ లేఖ
- బకాయిలు 658 కోట్లు.. 33.1% ధరలు పెంచాలన్న సంస్థ
- కమిటీ నివేదిక ఇవ్వకముందే ధరలు పెంచమంటే ఎలా?
- ఇలాంటి ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గదు: మంత్రి జూపల్లి



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తమ బ్రాండ్ బీర్ల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్(యూబీ) సంస్థ ప్రకటించింది. బకాయిలు చెల్లించకపోవడం, ధరలు పెంచకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌కు బుధవారం లేఖ రాసింది. తెలంగాణలో బీర్ల అమ్మకాలు నిలిపివేసిన విషయాన్ని

మిగతా 14వ పేజీలో...

గ్రూప్-3 పరీక్ష
ప్రాథమిక కీ విడుదల

- రేపు గ్రూప్-2 కీ.. మే 1నుంచి కొత్త ఉద్యోగ ప్రకటనలు
- ఏటా ఖాళీల భర్తీ.. మార్చి 31 దాకా వివరాల సేకరణ
- ప్రకటన ఇచ్చిన ఏడాది లోపే భర్తీ ప్రక్రియ పూర్తి
- గ్రూప్ పరీక్షల సిలబస్ తగ్గింపుపై ఆలోచిస్తాం
- మీడియాతో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఇష్టాగోష్ఠి



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్ష ఫలితాల ప్రాథమిక కీ విడుదలైంది. 1,388 ఉద్యోగాల భర్తీకి సంబంధించి 2022 డిసెంబరులో నోటిఫికేషన్ రాగా.. 2024 నవంబరులో ఈ పరీక్ష నిర్వహించారు. రెండు నెలల్లోపే ప్రాథమిక కీని విడుదల చేశారు. శుక్రవారం గ్రూప్-2 పరీక్ష ఫలితాల ప్రాథమిక కీ విడుదల చేస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్

మిగతా 12వ పేజీలో...



స్పేస్ డాకింగ్ మిషన్‌లో ఎన్నో కొత్త పరిజ్ఞానాలు..

వేగం తగ్గింపే సవాల్

- రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలను రూపొందించిన అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డా.పావులూరి సుబ్బారావు
- 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ
- నేడు ఇస్రో నిర్వహించతలపెట్టిన డాకింగ్ వాయిదా

అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాల్లో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ అద్భుతమైన పురోగతి సాధిస్తున్న ఇస్రో ఇటీవల చేపట్టిన అత్యంత క్లిష్టమైన ప్రయోగం.. స్పేస్ డాకింగ్ మిషన్! 220 కిలోల బరువుతో.. రోదసిలో కక్ష్యలో పరిభ్రమిస్తున్న రెండు ఉపగ్రహాల వేగాన్ని

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ విస్తరణ కాంక్ష!

- కెనడా, గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను అమెరికాలో విలీనం చేసుకుంటామని ప్రకటన
- మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తానని ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్య 2
- ఐరోపా జోలికొస్తే సహించేది లేదు: ఫ్రాన్స్



లాస్ ఏంజెలెస్‌లో
కార్చిచ్చు

హాలీవుడ్ స్టార్స్ టామ్ హాంక్స్ రీస్ విథర్స్పూన్ ఇళ్లు దగ్ధం

చైనా, పాక్ బలప్రదర్శన..
వాయుసేన చీఫ్ ఆందోళన!

- మన వద్ద నాలుగోతరం విమానాలే
- ఆర్డరిచ్చి 15 ఏళ్లయినా.. 40 తేజస్‌లు రాలే
- ఆరో తరం ఫైటర్ జెట్లను పరీక్షించిన చైనా
- జెట్ల తయారీలో ప్రైవేటుకు అనుమతించాలి
- వాయుసేన అధిపతి ఏపీ సింగ్ 2

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత చికిత్స 2



- వారం పాటు 1.5 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది
- దేశవ్యాప్తంగా పథకం అమలు
- 'హిట్ అండ్ రన్' కేసుల్లో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం
- కేంద్ర రవాణా మంత్రి గడ్కరీ వెల్లడి

సరిహద్దుల్లో చైనా, పాక్ బలప్రదర్శన..
వాయుసేన చీఫ్ ఆందోళన!



న్యూఢిల్లీ, జనవరి 8: యుద్ధ విమానాల విషయంలో మనం వెనకబడి ఉన్నామని.. పరిశోధన, తయారీ విషయంలో జరుగుతున్న ఆలస్యమే ఇందుకు కారణమని భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. తేజస్ విమానాల తయారీ, వాటిని వాయుసేనకు అందించడంలో ఆలస్యాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పారు. చైనా ఇటీవల ఆరో తరానికి చెందిన రెండు యుద్ధ విమానాలను విజయవంతంగా పరీక్షించిన నేపథ్యంలో.. మంగళవారం ఆయన ఢిల్లీలో జరిగిన సుబ్రతోముఖర్జీ 21వ సదస్సులో ఈ వ్యాఖ్యలు చేశారు. "తేజస్ గురించి 1984లో ప్రతిపాదన వస్తే.. 17 ఏళ్ల తర్వాత.. అంటే 2001లో తొలిసారి పరీక్షించారు. మరో 15 ఏళ్ల తర్వాత వాయుసేనకు తేజస్ విమానాలు అందడం మొదలైంది. అయితే.. ఇప్పటికీ తొలి బ్యాచ్ కింద రావాల్సిన 40 తేజస్ జెట్లు అందలేదు" అని వివరించారు. తేజస్ విమానాల తయారీలో ఆలస్యమే ఇందుకు కారణమని కారణమని.. ప్రైవేటుకు తయారీ అవకాశమిస్తే ఈ పరిస్థితి ఉండదని అభిప్రాయపడ్డారు. 2009-10లో ఆర్డర్ చేసిన తేజస్ విమానాలు ఇంకా తమకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "పాక్, చైనా సరిహద్దుల్లో పెరుగుతున్న సైనికీకరణ ఆందోళనకర స్థాయిలో ఉంది. చైనా వాయుసేనపై భారీగా సొమ్ము వెచ్చిస్తోంది. ఇటీవల కాలంలో రెండు స్టెల్త్ ఫైటర్ జెట్‌లను ఆవిష్కరించింది. ఆయుధ సామగ్రి, యుద్ధవిమానాల సంఖ్య విషయంలోనే కాకుండా.. సాంకేతికపరంగానూ చైనా వేగంగా అడుగులు వేస్తోంది" అని గుర్తుచేశారు. భారత్‌లో మాత్రం ఐదో తరం ఫైటర్ ప్రోగ్రామ్-- అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఆమ్‌కా) ప్రస్తుతం డిజైనింగ్ దశలోనే ఉన్నాయని ఏపీ సింగ్ వివరించారు. గత ఏడాదే క్యాబినెట్ వీటికి ఆమోదముద్ర వేయగా.. నమూనా విమానం తయారీకి ఐదేళ్లు పడుతుందని అంచనా. ఈ విమానాల తయారీ పూర్తిస్థాయిలో జరిగేది 2035 తర్వాతేనని తెలుస్తోంది.

వివాదాస్పద నేత బిధూరీపై బీజేపీ వేటు!

న్యూఢిల్లీ, జనవరి 8: ఇద్దరు మహిళా నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి బీజేపీని ఇరకాటంలోకి నెట్టిన ఆ పార్టీకి చెందిన ఢిల్లీ నాయకుడు రమేశ్ బిధూరీపై వేటు వేయాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాల్కాజీ నుంచి ఆయనను బీజేపీ పోటీకి నిలిపింది. అయితే, ఇప్పుడు ఆయనను అక్కడనుంచి తప్పించాలని ఆ పార్టీ భావిస్తున్నట్టు తెలిపింది. రమేశ్ బిధూరీ స్థానంలో ఒక మహిళా అభ్యర్థిని నిలిపే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఢిల్లీ సీఎం, కాల్కాజీలో ఆప్ అభ్యర్థి అతిశీ తన తండ్రినే మార్చేశారని రమేశ్ వ్యాఖ్యానించడం బీజేపీ పెద్దలను సైతం ఆగ్రహానికి గురి చేసింది. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తన నియోజకవర్గాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా వాద్రా బుగ్గల్లా మారుస్తానని ఆయన అనడం ఆ పార్టీ అధిష్ఠానాన్ని మరింత ఇబ్బందిపెట్టింది.

వారం రోజుల్లోనే బట్టతల..మహారాష్ట్రలో కలకలం

- బుల్దానాలో 50 మంది బాధితులు..కలుషిత నీరే కారణం

ముంబై, జనవరి8: మహారాష్ట్ర బుల్దానా జిల్లాలో కలకలం రేగింది. వారం రోజుల్లోనే బట్టతల రావడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలోని బోర్గావ్, కల్వాడ్, హింగ్నా గ్రామాల్లో ప్రజలకు పెద్ద ఎత్తున జుట్టు రాలిపోతోంది. వెంట్రుకల కుదుళ్లు బలహీనంగా మారడంతో దిగాలు పడిపోయారు. విషయం అర్థం కాక తలలు పట్టుకున్నారు. బట్టతలల విషయం దుమారం రేపడంతో జిల్లా వైద్యశాఖాధికారులు ఈ మూడు గ్రామాల్లో పర్యటించారు. 50 మంది బాధితులతో మాట్లాడి వారి నుంచి జుట్టు, స్కిన్ శాంపిల్స్ సేకరించారు. కలుషిత నీటిని కూడా పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపారు. ఎరువుల వల్ల నీరు కలుషితం కావడం జుట్టు విపరీతంగా రాలడానికి కారణమని అధికారులు ప్రాథమికంగా తేల్చారు. ప్రయోగశాల నుంచి వచ్చే రిపోర్టులతో వాస్తవ కారణాలు తెలుస్తాయన్నారు.

ట్రంప్ విస్తరణ కాంక్ష!

కెనడా, గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను అమెరికాలో విలీనం చేసుకుంటామని ప్రకటన

- మెక్సికోపైనా టెంపరితనం..
- మండిపడ్డ ఫ్రాన్స్, పనామా
- కెనడా ఎన్నటికీ విలీనం కాదు: ట్రూడో



అమెరికా, కెనడాను కలుపుతూ అమెరికా జెండాతో ట్రంప్ పోస్టు చేసిన ఫొటో

వాషింగ్టన్, జనవరి 8: అమెరికా అధ్యక్షుడిగా ఈ నెల 20న బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ భూవిస్తరణ కాంక్షతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఆ దేశంపై తమ జెండా ఎగురుతున్న మ్యాపుల ఫొటోలను షేర్ చేయడం, డెన్మార్క్ స్వయం ప్రతిపత్తి ప్రదేశమైన గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను విలీనం చేసుకుంటామని పేర్కొనడం, గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తానని చెబుతూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఆయా దేశాలు తీవ్రస్థాయిలో మండిపడగా.. అగ్రరాజ్యాల మధ్య చిచ్చు మొదలవుతోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. ఎన్నడూ తలపడని అగ్రదేశాల మధ్య ఇప్పుడు మాటల ఉద్రిక్తత మొదలవుతోందని అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు.. నాటోలో భాగస్వామ్య దేశాలే.. ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడడం పరిస్థితుల్లో తీవ్రతకు నిదర్శనమని చెబుతున్నారు. ట్రంప్ మంగళవారం తన మారి-ఎ-లాగో ఎస్టేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కెనడా, మెక్సికో, గ్రీన్‌ల్యాండ్(డెన్మార్క్), పనామాలపై మాట్లాడారు. సైనిక శక్తిని ఉపయోగించి విలీనం చేస్తారా? అని విలేకరులు అడగ్గా.. "లేదు..! ఆర్థిక శక్తిని వాడుతాను" అని స్పష్టం చేస్తూనే.. పనామా కాలువ, గ్రీన్‌ల్యాండ్ విలీనంపై సైనిక, ఆర్థిక శక్తిని వినియోగించనని హామీ ఇవ్వలేనన్నారు. పనామా కాలువను సైనిక అవసరాల కోసం అమెరికా నిర్మించినట్లు వ్యాఖ్యానించారు.

కెనడాపై మరింత కఠినంగా..

ట్రంప్ గతంలో కెనడాతో ఎలాంటి సత్సంబంధాలను కొనసాగించలేదు. 2016 ఎన్నికల సమయంలోనే.. కెనడా-అమెరికా మధ్య గోడ కడతా అని ప్రకటించారు. ఇప్పుడు ఆ దేశంపై ఆర్థిక యుద్ధాన్ని ఇప్పటికే ప్రారంభించారు. కెనడా నుంచి జరిగే దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తానన్నారు. నిజానికి కెనడాకు అమెరికా అతిపెద్ద వినియోగదారు. అమెరికాకు సహజవాయువులు, ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్‌ను కెనడా ఎగుమతి చేస్తుంది. వీటిపై 25% టారిఫ్ విధించడం కెనడాకు శరాఘాతంలాంటిదేనని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన వెలువడిన వెంటనే.. ట్రంప్ విలీనంపై కీలక వ్యాఖ్యల ఉధృతిని పెంచారు. "కెనడాలో మెజారిటీ ప్రజలకు అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండడమే ఇష్టం. అమెరికాలో విలీనమైతే.. సుంకాలు, పన్నులు ఉండవు. పైగా.. నిరంతరం చుట్టూ కాచుక్కూర్చునే రష్యా, చైనా నుంచి అమెరికా మాత్రమే రక్షణ కల్పించగలదు" అన్నారు. అమెరికాలో కెనడా విలీనమైనట్లుగా ఓ మ్యాప్‌ను ఆయన తన పోస్టుకు జత చేశారు. ఇటీవల ట్రూడోను కలిసిన ట్రంప్.. "కెనడా గవర్నర్‌తో భేటీ అయ్యాను" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే..! తాజాగా విలేకరుల సమావేశంలో.. కెనడాను విలీనం చేసుకుంటామని పునరుద్ఘాటించారు.ఈ వ్యాఖ్యలపై ట్రూడో తీవ్రంగా స్పందించారు. అమెరికాలో కెనడా విలీనమయ్యే ప్రసక్తే లేదని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఐరోపా జోలికొస్తే సహించేది లేదు: ఫ్రాన్స్

ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఐరోపా సమాఖ్య అప్రమత్తమైంది. తమ జోలికి ఎవరొచ్చినా సహించబోమని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీ-నోయల్ బారో తేల్చిచెప్పారు. ఫ్రాన్స్ ఇంటర్ రేడియో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని ఎవరు ఉల్లంఘించినా.. ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. గ్రీన్‌ల్యాండ్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందిస్తూ.. "మాది బలమైన ఖండం. డెన్మార్క్‌లో 600 ఏళ్ల నుంచి భాగమైన గ్రీన్‌ల్యాండ్‌ను.. పనామా కాలువను అమెరికా ఆక్రమించుకొంటుందంటే నేను విశ్వసించను" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై పనామా విదేశాంగ మంత్రి జావిర్ మార్టినేజ్ స్పందించారు. పనామా కాల్వను తమ దేశం మాత్రమే నియంత్రించగలదని.. భవిష్యత్‌లో కూడా అదే కొనసాగుతుందని స్పష్టంచేశారు. గ్రీన్‌ల్యాండ్ ప్రధాని మెటే ఫ్రెడెరిక్సన్ మాట్లాడుతూ.. అమెరికా-గ్రీన్‌ల్యాండ్ మధ్య ఆర్థిక యుద్ధాలు తగదని హితవు పలికారు. కాగా.. ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రస్తుతం గ్రీన్‌ల్యాండ్ పర్యటనలో ఉండటం గమనార్హం..!

హమాస్‌కు ట్రంప్ వార్నింగ్

ఇజ్రాయెల్-హమాస్ పోరుపైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించేలోపు.. హమాస్ తన చెరలో ఉన్న బందీలను విడుదల చేయాలని తేల్చిచెప్పారు. లేనిపక్షంలో హమాస్‌కు నరకం చూపిస్తామని, చరిత్రలో ఎన్నడూ చూడని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ప్రపంచ యుద్ధానికి సంకేతమా?

ట్రంప్ వ్యాఖ్యలు, ఆయా దేశాల ప్రతిస్పందనలతో అమెరికా-ఐరోపా మధ్య దూరం పెరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. మరో ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదాలు లేకపోలేదని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో రష్యా నుంచి వలస వచ్చిన గోంబర్గ్ అనే యూదు జాతీయుడు 'ఔట్‌లైన్ ఆఫ్ పోస్ట్‌వార్ న్యూ వరల్డ్ మ్యాప్' పేరుతో 1942 ఫిబ్రవరి 25న ఓ పటాన్ని చిత్రీకరించారు. తర్వాతి కాలంలో ఇది పాపులర్ కావడం విశేషం..! ఈ మ్యాప్‌లో కెనడా, మెక్సికో, గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో ఓ భాగంగా పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు ఈ మ్యాప్‌నకు అనుగుణంగా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది.

గ్రీన్‌ల్యాండ్ ఎందుకు?

డెన్మార్క్‌లో స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికాకు చెందిన భారీ అంతరిక్ష కేంద్రం(తులె ఎయిర్‌బేస్) ఉంది. గ్రీన్‌ల్యాండ్ మీదుగానే ఉత్తర అమెరికా నుంచి ఐరోపాకు వెళ్లడం దగ్గరి దారిగా చెబుతారు. ఈ ద్వీపంలో అత్యధిక స్థాయిలో ఖనిజ సంపద, చమురు నిల్వలున్నాయి. గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా కన్నేయడం ఇది మొదటిసారి కాదు. 1860ల్లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ కూడా గ్రీన్‌ల్యాండ్‌పై పేచీపెట్టారు. ట్రంప్ కూడా 2019లో గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాకు అమ్మేయాలంటూ ఆఫరిచ్చారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో కూడా భారీ ఎత్తున పెట్రోలియం నిక్షేపాలున్నాయి. పెట్రోలియం వనరులున్న జలభాగాల్లో ఇది ప్రపంచంలోనే 9వ అతి పెద్దది.

లోకం తీరు



కెనడా ప్రధాని రేసులో అనితా ఆనంద్!



న్యూఢిల్లీ, జనవరి 8: కెనడా ప్రధాన మంత్రి రేసులో ఆ దేశ రవాణా మంత్రి, భారత సంతతి మహిళా అనితా ఆనంద్ ముందున్నారు. జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన నేపథ్యంలో కెనడా తదుపరి ప్రధాన మంత్రి ఎవరు అవుతారనే చర్చ జరుగుతోంది. అనితాఆనంద్ ఆ బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి. 2025 అక్టోబరులో లేదా అంద కు ముందు కెనడా ఫెడరల్ ఎన్నికలు జరగనున్న క్రమంలో అప్పటి వరకు కొత్త ప్రధాని తాత్కాలిక ప్రధానిగా కొనసాగుతారు. కాగా, అనితా ఆనంద్ 2019లో తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 2019 నుంచి 2021 వరకు మంత్రిగా కూడా పనిచేశారు. అలాగే ట్రెజరీ బోర్డు అధ్యక్షురాలిగా, దేశ రక్షణ మంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారు.


నా కొడుకు మాట పట్టించుకోవద్దు

- అతడో మామూలు మనిషి
- ఎలాన్ మస్క్ తండ్రి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 8: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఇతర దేశాల రాజకీయాల్లో జోక్యం చేసుకోవడంపై తప్పుపడుతూ ఆయన తండ్రి ఎర్రల్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు, ట్వీట్లను పట్టించుకోవద్దని పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. "ఎలాన్ చెప్పిన మాటలను ప్రజలు వినిపించుకోవద్దు. అతడో మామూలు మనిషి. ఎలాన్ మస్క్ వద్ద బాగా డబ్బు ఉంది కాబట్టి అతడు చెప్పిన విషయాలను చాలా మంది రీట్వీట్ చేస్తారు. నేనైతే అలా చేయను" అని ఎర్రల్ పేర్కొన్నారు. ఎలాన్ మస్క్, ఆయన తండ్రి ఎర్రల్ మస్క్ మధ్య తీవ్రమైన అభిప్రాయబేధాలున్నాయి.

వేగం తగ్గింపే సవాల్

(మొదటి పేజీ తరువాయి)



క్రమంగా తగ్గించుకుంటూ వచ్చి.. అవి ఢీకొట్టకుండా ఒకదానికొకటి అనుసంధానం (డాకింగ్) చేయడం సవాల్‌తో కూడుకున్న పని అని.. స్పేడెక్స్ ఉపగ్రహాలను తయారు చేసిన అనంత్ టెక్నాలజీస్ సంస్థ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు తెలిపారు! హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ స్పేడెక్స్ ఉపగ్రహాల కూర్పుతోపాటు, వాటిని ప్రయోగించిన పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ)-సీ60 అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్‌ను కూడా నిర్వహించింది. రోదసిలో భవిష్యత్తులో మన సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించుకోవాలన్నా, ఇతరత్రా మిషన్లలో అత్యంత కీలకమైనది... ఈ డాకింగ్ ప్రక్రియ. దశలవారీగా ఇలా మాడ్యూళ్లను పంపి ఒక పెద్ద నిర్మాణాన్ని చేపట్టవచ్చు. అయితే.. అలా పంపే మాడ్యూళ్లు రోదసిలో అనుసంధానం కావడం మాటల్లో చెప్పినంత తేలిక కాదు. సాంకేతికంగా సంక్లిష్టమైనది. ఏ మాత్రం తేడా వచ్చినా ఉపగ్రహాలు పరస్పరం ఢీకొనే ప్రమాదం ఉంది. ఈ క్రమంలోనే.. ఉపగ్రహాల వేగం అనుకున్నదానికన్నా ఎక్కువగా ఉండడంతో గురువారం జరపాల్సిన డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో.. మిషన్‌కు సంబంధించిన కీలక అంశాల గురించి సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరంగా వెల్లడించారు.

స్పేడెక్స్ ఉపగ్రహాల తయారీలో అనంత్ టెక్నాలజీస్ పాత్ర ఏమిటి?

డాక్టర్ సుబ్బారావు పావులూరి: ఆ రెండు ఉపగ్రహాలూ బెంగళూరులోని అనంత్ శాటిలైట్స్ ఫెసిలిటీ.. "శాటిలైట్ ఏఐటీ (అసెంబ్లీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్)"లో తయారయ్యాయి. వాటిలోని కొన్ని ఉపవ్యవస్థలను కూడా మేం అభివృద్ధి చేశాం. ఈ రెండు శాటిలైట్లనూ ప్రయోగించిన లాంచ్ వెహికిల్ పీఎస్ఎల్‌వీ సీ60ని... అందులోని సబ్ సిస్టమ్స్‌ను కూడా తిరువనంతపురంలో అనంత్ టెక్నాలజీస్ బృందమే తయారుచేసింది. పీఎస్ఎల్‌వీ సీ60ని అసెంబుల్ చేసింది, ఇంటిగ్రేట్ చేసి పరీక్షించింది (ఏఐటీ) ఆ బృందమే.

ఈ రెండు ఉపగ్రహాలనూ డాకింగ్ నిమిత్తం రోదసిలో ఒకే కక్ష్యలో ప్రవేశపెట్టారు కదా.. మిగతా ఉపగ్రహాలకూ వీటికి లాంచింగ్ విధానంలో ఏమైనా తేడా ఉందా?

లాంచింగ్ విధానంలో తేడా ఏమీ లేదు. రెండు ఉపగ్రహాలనూ రెండు నిమిషాల వ్యవధితో కక్ష్యలోకి విడిచిపెట్టారు. ఆ తర్వాత రెండింటి మధ్య వేగం పరంగా కొంత తేడా ఉండేలా చూస్తారు. రెండింటికీ మధ్య దూరం 20 కిలోమీటర్లకు చేరాక.. డ్రిఫ్టింగ్ అరెస్ట్ మెనూవర్ చేపడతారు. అంటే.. రెండింటి మధ్య దూరం పెరగడం ఆగిపోతుంది. వాటి వేగం తగ్గించడం ద్వారా క్రమంగా రెండూ దగ్గరవడం ప్రారంభిస్తాయి. అయితే ఇది సవాల్‌తో కూడుకున్నది. అలా దూరాన్ని తగ్గించుకుంటూ వచ్చి డాకింగ్ చేస్తారు. (ఉపగ్రహాల డ్రిఫ్టింగ్ అనుకున్నదానికన్నా ఎక్కువగా ఉండడం వల్ల గురువారం జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేస్తున్నట్టు ఇస్రో ట్వీట్ చేసింది).

స్పేడెక్స్ ఉపగ్రహాల్లో డాకింగ్ మెకానిజం ఏమిటి?

ఈ ఉపగ్రహాల్లో ఒకదాన్ని చేజర్ (ఎస్‌డీఎక్స్ 01) అని.. రెండోదాన్ని చేజర్ (ఎస్‌డీఎస్ 02) అని అంటారు. చేజర్ ఉపగ్రహం సెకనుకు 10 మిల్లీమీటర్ల సాపేక్ష వేగంతో టార్గెట్ ఉపగ్రహాన్ని చేరి డాక్ అవుతుంది. దీన్ని మెకానిజం ఎంట్రీ వ్యవస్థ గుర్తించి.. రెండు ఉపగ్రహాలనూ లాక్ చేస్తుంది. అయితే.. డాకింగ్‌కి వాటిలో ఒకటి మేల్, ఇంకొకటి ఫిమేల్ తరహా మెకానిజం ఉండదు. రెండింటిలోనూ ఒకే తరహా (క్యాప్చర్, ఎక్స్‌టెన్షన్/రిట్రాక్షన్, రిజిడైజేషన్) మెకానిజం ఉంటుంది. సంక్లిష్టమైన డాకింగ్ ప్రక్రియ మొత్తాన్నీ ఎలాంటి సమస్యా లేకుండా విజయవంతంగా నిర్వహించడానికి ఇస్రో తన 18 గ్రౌండ్ స్టేషన్ల నెట్‌వర్క్‌తో పాటు అంతర్జాతీయ కేంద్రాలను కూడా వినియోగించుకుంటోంది.

ఈ ఉపగ్రహాలతో ఇతర ప్రయోగాలు కూడా చేపడతారా?

డాకింగ్ ప్రక్రియ పూర్తయ్యాక.. ఇస్రో ఈ రెండు ఉపగ్రహాల మధ్య విద్యుత్తు బదిలీ చేస్తారు. అలాగే.. ఈ ప్రయోగం డాకింగ్‌కి మాత్రమే పరిమితం కాదు.. ఒకసారి డాకింగ్ పూర్తయ్యాక వాటిని అన్ డాకింగ్ చేస్తారు. విడిపోయిన అనంతరం రెండు ఉపగ్రహాల్లోని పేలోడ్స్ రెండేళ్లపాటు తమకు నిర్దేశించిన ఆపరేషన్స్ చేపడతాయి.

మిషన్ కోసం రూపొందించిన కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు ఏమిటి?

దేశీయంగా అభివృద్ధి చేసిన అటానమస్ రెండవూస్ అండ్ డాకింగ్ స్ట్రాటజీ, రెండవూస్ అండ్ డాకింగ్ సెన్సర్స్ సూట్, రెండు ఉపగ్రహాలూ ఒకదానితో మరొకటి స్వతంత్రంగా కమ్యూనికేట్ చేసుకోవడానికి వీలుగా.. ఇంటర్-శాటిలైట్ కమ్యూనికేషన్ లింక్ (ఐఎస్ఎల్) టెక్నాలజీ, విద్యుత్తు బదిలీ పరిజ్ఞానం వంటివాటిని ఇందులో ఉపయోగించారు. భవిష్యత్తులో భారతదేశ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, చంద్రుడి నుంచి నమూనాలను భూమికి తీసుకురావాలన్న లక్ష్యాలను సాధించడానికి ఈ ప్రయోగం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలాంటి అద్భుతమైన ప్రయోగంతో ఇస్రో 2024 సంవత్సరాన్ని ముగించడం సంతోషకరం. 2025లో ఇస్రో మరిన్ని అద్భుతమైన ప్రయోగాలు చేపట్టాలని కోరుకుంటున్నాం.

డాకింగ్ మళ్లీ వాయిదా

రోదసిలో స్పేడెక్స్ ఉపగ్రహాల డాకింగ్‌ను మరోసారి వాయిదా వేస్తున్నట్టు ఇస్రో తెలిపింది. ఈ ప్రక్రియను జనవరి 7న నిర్వహించ తలపెట్టిన ఇస్రో.. దాన్ని 9వ తేదీకి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు..ఉపగ్రహాల మధ్య దూరాన్ని 225మీటర్లకు తగ్గించే క్రమంలో.. వాటి వేగం అనుకున్నదానికన్నా ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని, కాబట్టి గురువారం జరపాల్సిన డాకింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. రెండు ఉపగ్రహాలూ సురక్షితంగా ఉన్నాయని వెల్లడించింది.

చంద్రయాన్-4, గగన్‌యాన్‌పై దృష్టి

ఇస్రో కొత్త చైర్మన్ నారాయణన్..14న బాధ్యతలు

సూళ్లూరుపేట, బెంగళూరు (ఆంధ్రజ్యోతి), జనవరి 8: ఇస్రో ప్రస్తుతం విజయపథంలో దూసుకెళ్తోందని ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రోకు నూతన చైర్మన్‌గా ఎంపికైన వి నారాయణన్ అన్నారు. ఇప్పుడు ఇస్రో ముందున్న ప్రధాన మిషన్లలో చంద్రయాన్-4, గగన్‌యాన్ ముఖ్యమైనవని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, ఇస్రో చైర్మన్‌గా తాను చేపట్టనున్న కొత్త బాధ్యతల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పదవీకాలం ఈ నెల 13న ముగియనుంది. ఈ నెల 14న సోమనాథ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. త్వరలో చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి నారాయణన్ మాట్లాడుతూ.. 'ఇస్రో ముందున్న కీలక మిషన్లు గగన్‌యాన్, చంద్రయాన్-4. అలాగే శ్రీహరికోట నుంచి ఈ నెలాఖరులో నావిగేషన్ కోసం ఎన్‌వీఎస్02 ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి' అని తెలిపారు.

భారత భూభాగాన్ని ఎవరూ ఆక్రమించలేదు: బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ, జనవరి 8: అంతర్జాతీయ సరిహద్దు వెంబడి 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని బంగ్లాదేశ్ ఆక్రమించిందన్న వార్తలను భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎస్) కొట్టిపారేసింది. బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) దళాలు 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయంటూ బంగ్లా మీడియాలో వార్తలు వచ్చాయి. అవన్నీ పూర్తిగా బాధ్యతారహిత, నిరాధారమైన కట్టు కథలని బీఎస్ఎఫ్ పేర్కొంది. "ఉత్తర 24 పరగణాల జిల్లా, రాంఘాట్ గ్రామంలోని బాగ్దా బ్లాక్‌లో ఉన్న భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడలియా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి, కంచె వేసి ఉంది. ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎలాంటి మార్పు జరగలేదు" అని బీఎస్ఎఫ్ అధికారిక ప్రకటనలో తెలిపింది. భారత భూభాగాన్ని ఎవరూ ఒక్క అంగుళం కూడా తీసుకోలేదని, తీసుకోలేరని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు కల్పిత కథనాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించింది.

హసీనా వీసా గడువును పొడిగించిన కేంద్రం

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం కోరుతుండగా.. మరోవైపు ఆమె పాస్‌పోర్టును కూడా రద్దు చేసిన వేళ... భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో మరికొంత కాలం ఉండేందుకు వీలుగా హసీనా వీసా గడువును పొడిగించినట్లు తెలుస్తోంది. స్థానిక ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి వచ్చిన అభ్యర్థనను పరిశీలించిన అనంతరం.. కేంద్ర హోంశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మీడియా నివేదికలు వెల్లడించాయి.

రోడ్డు ప్రమాద బాధితులకు
నగదురహిత చికిత్స

- వారం పాటు రూ.1.5 లక్షల వరకు చికిత్స ఖర్చును కేంద్రం భరిస్తుంది
- ఇక దేశవ్యాప్తంగా ఈ పథకం అమలు
- కేంద్ర రవాణా మంత్రి గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స పథకం మార్చి నుంచి దేశమంతా అమలవుతుందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటి వరకు ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన ఈ పథకాన్ని అన్ని రాష్ట్రాలకూ విస్తరించనున్నామని చెప్పారు. ఈ పథకంలో ఏడు రోజుల పాటు లక్షన్నర రూపాయల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఆస్పత్రిలో చేరి, ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు పోలీసులకు సమాచారం అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 'హిట్ అండ్ రన్' (గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్ట పరిహారం ఇస్తామని కూడా గడ్కరీ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా శాఖ మంత్రులు, కార్యదర్శులతో సమావేశం అనంతరం నగదురహిత చికిత్స పథకాన్ని ప్రకటించారు. దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని ఆయన చెప్పారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో లక్షా 80 వేల మంది చనిపోయారని చెప్పారు. ఇందులో 30 వేల మంది హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. 66 శాతం ప్రమాదాల్లో బాధితులు 18 నుంచి 34 ఏళ్లలోపు వయస్కులని వివరించారు. విద్యా సంస్థల లోపలికి వెళ్లే, బయటికొచ్చే ప్రదేశాల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల జరిగిన ప్రమాదాల్లో 10 వేల మంది పిల్లలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ బస్సులు, ఆటోల ప్రమాదాలకు కారణాలను గుర్తించామని, వాటిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డు భద్రత అంశంపై రాష్ట్రాల మంత్రులు, కార్యదర్శులతో చర్చించామన్నారు. భారీ వాహనాలకు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎమర్జెన్సీ బ్రేకింగ్, డ్రైవర్ కునికిపాట్లు పడుతుంటే హెచ్చరించే వ్యవస్థ వంటివాటిని తప్పనిసరి చేస్తామని తెలిపారు. కాగా, రోడ్డు భద్రతను పెంపొందించేందుకు కేంద్రం రూ.4,500 కోట్లతో దేశవ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు, ఆటోమేటెడ్ టెస్టింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది.



లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్, జనవరి 8: అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ నగరంలో కార్చిచ్చు చెలరేగింది. హాలీవుడ్ నటులు, ప్రముఖులు నివాసం ఉండే అత్యంత సంపన్న ప్రాంతం పసిఫిక్ పాలిసేడ్స్ పూర్తిగా మంటల్లో చిక్కుకుపోయింది. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. అగ్ని కీలలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి. దీనికి తోడు గాలులు బలంగా వీస్తుండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. కార్చిచ్చు ఇప్పటికే 3వేల ఎకరాలకు విస్తరించింది. 250 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. 30వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దాదాపు లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. లాస్‌ఏంజెలెస్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వల్ల 13వేల భవనాలకు ముప్పు పొంచి ఉందని ఫైర్ చీఫ్ క్రిస్టిన్ క్రౌలీ చెప్పారు. కాగా, పాలిసేడ్స్ నుంచి బయటపడటానికి ఒక్క రోడ్డు మార్గమే ఉంది. వందల సంఖ్యలో ప్రజలు కార్లల్లో తరలిపోయేందుకు ప్రయత్నించడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో, వారు కార్లను అక్కడే వదిలేసి పారిపోయారు.

ఆడ దోమల అంతానికి..
మగ దోమల్లో విష జన్యువు

- వాటి వీర్యం విషపూరితమయ్యేలా జన్యుమార్పిడి
- వాటితో కలిసిన ఆడదోమల జీవితకాలం 60%
- తగ్గినట్టు గుర్తించామన్న ఆస్ట్రేలియా శాస్త్రజ్ఞులు

సిడ్నీ, జనవరి 8: రాజును చంపడానికి విలన్ విషకన్యని ప్రయోగించే కథ చాలా సినిమాల్లో చూశాం. అదే టెక్నిక్‌తో.. ఆడ దోమలను అంతం చేసేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు 'టాక్సిక్ మేల్ టెక్నిక్' పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. అందులో భాగంగా.. మగ దోమల వీర్యాన్ని విషపూరితం చేసే జన్యువును వాటిలో ప్రవేశపెడుతున్నారు. ఆ విషపూరిత దోమలు ఆడదోమలతో కలిసినప్పుడు.. వాటి వీర్యంలో ఉండే విష ప్రొటీన్లు సదరు ఆడదోమల ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోయేలా చేసి చివరికి వాటిని చంపేస్తుందన్నమాట. ఏటా దోమ కాటు కారణంగా ప్రపంచవ్యాప్తంగా 39 కోట్ల మంది డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ఈ వ్యాధులు ఆడదోమల వల్లే వ్యాపిస్తాయి. దీంతో ఆడ దోమలను చంపేందుకు ఆస్ట్రేలియా శాస్త్రజ్ఞులు ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఇలా జన్యుమార్పిడి చేసిన మగదోమలతో కలిసిన ఆడదోమల జీవితకాలం 60 శాతం మేర తగ్గిపోతున్నట్టు గుర్తించామని వారు వెల్లడించారు. ఆడదోమల జీవితకాలం 60% తగ్గినా.. దోమకాటు బాధితుల సంఖ్య తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మరిన్ని మెట్రో కొత్త కోచ్‌లు

- రద్దీకి తగ్గట్టుగా కొనుగోలు చేస్తాం
- 18 మాసాల తర్వాతే అవి పట్టాల పైకి
- దేశీయంగా తయారీకి 3 కంపెనీలు ఓకే
- 100ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి హబ్స్
- రెండో దశకు ఏప్రిల్ నాటికి టెండర్లు
- మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన అదనపు కోచ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. వాటిని అందు బాటులోకి తీసుకురావడానికి 18 నెలల సమయం పడుతుందని, అప్పటి వరకు ఉన్న రైళ్లతోనే రద్దీగా ఉన్న కారిడార్‌లలో ఫ్రీక్వెన్సీ పెంచి నడుపుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రోజూ 10 లక్షల మంది ప్రయాణించేందుకు అనుగుణమైన సంఖ్యలో కోచ్‌లను కొనుగోలు చేయాలని నిర్ణయిం చామన్నారు. బుధవారం ఎంజీబీఎస్ మెట్రో రైలు ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లో 'నా మెట్రోలో... నా సమయం' ప్రచార కార్యక్రమాన్ని, 3 రోజుల పాటు జరిగే సంక్రాంతి మెట్రో ఫెస్ట్‌లను ఎల్ అండ్ టీ మెట్రో రైలు సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న మెట్రో కోచ్‌లన్నీ సౌత్ కొరియాలోని హ్యూందయ్ రోటెమ్ కంపెనీ తయారు చేసిందని, అయితే వాటిని ఇక నుంచి మన దేశం లోనే తయారు చేసేందుకు మూడు కంపెనీలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

ముందుకొచ్చాయని, వారితో ఇప్పటికే ప్రాథమికంగా చర్చలు జరిగాయని వెల్లడించారు. ప్రస్తుతం రెండు డిపోల్లో ఉన్న మెట్రో రైళ్లతో ప్రతి రోజూ 7 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉందన్నారు. నాగోల్-రాయదుర్గం కారిడార్‌లోనే రద్దీ అత్యధికంగా ఉందని, ప్రస్తుతం రద్దీని తగ్గించేందుకు షార్ట్ లూప్ లో మెట్రో రైళ్లను నడుపుతున్నామని, వాటి సంఖ్యను కూడా పెంచుతామని తెలిపారు. 50-100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి మెట్రో హబ్స్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. మేడ్చల్ మార్గంలో హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్లు, ఎన్‌హెచ్ఏఐ కొన్ని ఫ్లై ఓవర్లను నిర్మిస్తున్నదని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని, సమగ్ర ప్రణాళికతో నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారని చెప్పారు. రెండో దశ మెట్రో కింద ఇప్పటికే 5 మెట్రో కారిడార్‌లకు డీపీఆర్‌లను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, ఈ 5 కారిడార్‌లతో పాటు మరో 3 కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌లను సిద్ధం చేసి కేంద్రం నుంచి అనుమతులు తీసుకుంటే ఏప్రిల్ నాటికి టెండర్‌లు పిలిచేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారని వెల్లడించారు. అలాగే, ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట కారిడార్‌లను కలిపి నిర్మించడం ద్వారా మెగా జంక్షన్‌గా ప్రణాళికలు సిద్ధం చేయాలని కూడా సీఎం సూచించారని తెలిపారు.

ప్రాణం తీసిన అప్పు

- తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది వేధింపులు
- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన


సంతోష్(ఫైల్)

ఆసిఫాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం శివపూర్ గ్రామానికి చెందిన కారం సంతోష్ (35) ఫొటోగ్రా ఫర్. మండల కేంద్రంలోని జిల్లా కోఆపరేటివ్ బ్యాంకులో రూ.40 వేల రుణం తీసుకున్నాడు. వడ్డీతో కలిపి అది ప్రస్తుతం రూ.53,978 అయింది. ఈ నేపథ్యంలో మంగళవారం బ్యాంకు సిబ్బంది సంతోష్ ఇంటికి వెళ్లి రుణం చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో అతను తీవ్ర మనస్తాపానికి గురై రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత పురుగుల మందు తాగి ఇంటికి కొంతదూరంలో పడిపోయాడు. కాలనీవాసులు, కుటుంబీకులు చూసి సంతోష్‌ను వెంటనే సిర్పూర్(టి) ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రుణం చెల్లించాలని బ్యాంకు అధికారులు వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయన మృతికి వారే కారణమని మృతుడి భార్య జ్యోతి సిర్పూర్(టి) పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. కాగా రుణం చెల్లించాలని అడిగామే తప్ప ఎలాంటి వేధింపులకు పాల్ప డలేదని బ్యాంకు మేనేజర్ తబసుం తెలిపారు. అప్పు కట్టలేకనే తమపై ఆరోప ణలు చేస్తున్నారన్నారు.

అధికారుల చుట్టూ భూ ఉచ్చు

- సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్ భూముల అక్రమ పట్టాలపై దర్యాప్తు
- ఆక్రమణదారులతో పాటు అధికారులపై కేసులు నమోదు
- 250 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్ వెల్లడి

సిరిసిల్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్కారు భూములను కబ్జా చేసి అక్రమంగా పట్టాలు పొందిన వారితో పాటు వారికి సహకరించిన అధికా రులకు ఉచ్చు బిగుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగులోకి వస్తున్న భూ కబ్జా సంఘటనల్లో బాధ్యులైన అధికారులపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలుకుబడి ఉన్న నాయ కులు అసైన్డ్ భూములను కబ్జా చేసి అక్రమంగా పట్టాలు పొందడానికి తెరలేపారు. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఒత్తిడి మేరకు అధికారులు ఆక్రమణదారులకు సహకరించారు. 20 రోజులుగా కలెక్టర్ సందీప్‌కు మార్ ఝా నేతృత్వంలో జిల్లాలో భూ కబ్జాలపై విచారణ జరుగుతోంది. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో అధికారులతో కలిపి 17 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో ఐదుగురు బీఆర్ఎస్ నాయకులను ఆరెస్ట్ చేశారు. అధికారులపై కూడా కేసులు నమోదవ్వడంతో రెవెన్యూ శాఖ మంత్రితో పాటు ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ క్షేత్రస్థాయి పరిశీ లనకు ఆదేశాలు ఇచ్చినట్లుగా సమాచారం. 250 ఎకరాలను ఆక్రమణదా రుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

ఏపీలో ఫస్ట్ ఇయర్‌కు బోర్డు ఎగ్జామ్ లేదు!

- వచ్చే ఏడాది నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు
- ఇంటర్మీడియట్ బోర్డు కీలక ప్రతిపాదనలు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పరీక్షల విధానం, సిలబస్-పాఠ్య పుస్తకాల సవరణ, కొత్త సబ్జెక్టుల కాంబినేషన్లు, మార్కుల పరంగా ఏపీలో ఇంటర్మీడియట్ బోర్డు కీలక ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా బుధవారం మీడియాకు ఆ ప్రతిపాదనలను వెల్లడించారు. దేశంలో తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే ఇంటర్ రెండేళ్లకూ బోర్డు పరీక్షలు జరుగుతున్నాయని, ఫలితంగా విద్యా ర్థులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. పిల్లలపై ఒత్తిడి తగ్గించేందుకు ఇంటర్ రెండో సంవత్సరంలో పరీక్షలు మాత్రమే బోర్డు నిర్వహించేలా, ఫస్టియర్ పరీక్షలను కాలేజీలు సొంతగా నిర్వహించుకునేలా, ఫస్ట్ ఇయ ర్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే సెకండియర్‌కు ప్రమోట్ చేసే విధంగా ప్రతిపా దించామని చెప్పారు. ఇంటర్ సెకండియర్‌లో 500 మార్కులతో పరీ క్షలు నిర్వహించాలని ప్రతిపాదించామని వెల్లడించారు.. ప్రతి సబ్జెక్టు లోనూ ప్రాక్టికల్స్/ అంతర్గత మార్కుల విధానం తెస్తామని చెప్పారు. ఆర్ట్స్ గ్రూపుల్లోనూ ఇంటర్నల్స్ ఉంటాయన్నారు. మొత్తంగా థియరీలో 380 మార్కులు, ఇంటర్నల్స్‌కు 120 మార్కులు ఉంటాయని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్‌లో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను ప్రవేశపెడతామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులను వేర్వేరుగా ఉంచుతూనే కలిపి ఎంబైపీసీ కోర్సును ప్రతిపాదిస్తున్నామని, దీన్ని తీసు కున్నవారు ఇంజనీరింగ్, వైద్య వృత్తి రెండువైపులా వెళ్లొచ్చునని చెప్పారు. ప్రస్తుతం గణితం 1ఏ, 1బీ, 2ఏ, 2బీలుగా ఉండగా వాటిని ఒకే సబ్జెక్టుగా మారుస్తామని, బోటనీ, జువాలజీని కలిపి బయాలజీ సబ్జెక్టుగా మారు స్తామని పేర్కొన్నారు. వీటికి ఒక్కటే పేపర్ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే ఈ సంస్కరణలు 2025-26లో ఫస్టియ ర్‌కు, 2026-27లో సెకండియర్‌కు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

కలుషిత ఆహారంతో నలుగురు విద్యార్థినులకు అస్వస్థత

తిమ్మాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని సమీకృత ఎస్సీ బాలికల హాస్టల్‌లో బుధ వారం కలుషిత ఆహారం మూలంగా నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లో 60 మంది విద్యార్థినులు ఉంటూ సమీపంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకుంటున్నారు. హాస్టల్‌లో వి ద్యార్థినులకు ఉదయం కిచిడి, పచ్చిపులుసు (చారు) అల్పాహారంగా ఇచ్చారు. పాఠశాలలోనూ మధ్యాహ్న భోజనంలో కిచిడి, పచ్చిపులుసు పెట్టారు. ఆ తర్వాత విద్యార్థినుల్లో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మీ సంకల్పానికి మా సహకారం

ఆంధ్రుల ఆశయాల సాధనకు అండ.. బాబు 'విజన్ 2047'కు సంపూర్ణ మద్దతు

- దక్షిణ మధ్య రైల్వే జోన్‌తో ఏపీ ప్రగతికి ఊతం
- విశాఖ సభలో ప్రధాని మోదీ భరోసా
- రూ.2.08లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- మోదీ మద్దతుతో అమరావతి పూర్తి చేస్తాం
- ఒకే రోజు 2లక్షల కోట్లకు పైబడిన ప్రాజెక్టులు: బాబు


ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆశయాల సాధనకు కేంద్రంలోని తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. చంద్రబాబు 'విజన్-2047'కు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. వరుసగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తొలిసారి విశాఖపట్నానికి వచ్చిన మోదీ రూ.2.08లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. విభజన హామీల్లో కీలకమైన విశాఖపట్నం రైల్వేజోన్‌తోపాటు గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్‌లకు శంకుస్థాపన చేశారు. పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను విశాఖపట్నం వేదికగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. 'ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి నా కృతజ్ఞతలు. మీపట్ల నాకున్న అభిమానం చూపించే అవకాశం ఇప్పుడు లభించింది. ముందుగా సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామికి నమస్కారం' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత హిందీలో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మా విజన్. ఆంధ్రుల సేవ మా సంకల్పం. 2047నాటికి రాష్ట్రం 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్న విజన్‌తో చంద్రబాబు శ్రమిస్తున్నారు. ఈ ప్రయాణంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి భుజం కలిపి తోడుగా నిలుస్తుంది" అని మోదీ ప్రకటించారు. విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేశామని... ప్రత్యేక జోన్ కావాలన్న ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోందని ప్రధాని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రైల్వేజోన్ ఎంతో కీలకం. వ్యవసాయ, వ్యాపార, పర్యాటక రంగాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఏపీలో వందశాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ జరిగింది. వందే భారత్ రైళ్లతోపాటు అమృత్ భారత్ సర్వీసులు రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మౌలిక సదుపాయాల విప్లవంతోపాటు మెరుగైన కనెక్టివిటీతో ఏపీ ముఖచిత్రం మారబోతోంది. ఇప్పుడు ప్రారంభించిన పనులు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడతాయి" అని ప్రధాని పేర్కొన్నారు. కాగా మహబూబ్‌నగర్ టు డోన్ డబ్లింగ్ పనులకు మోదీ శంకుస్థాపన చేశారు.

పోలవరం ద్వారా నదుల అనుసంధానం

పోలవరం ద్వారా నదులను అనుసంధానం చేస్తామని, మోదీ అండతో అమరావతి పూర్తిచేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. "మంచి చేసే ప్రభుత్వాన్ని కొనసాగించాలి. ప్రజలు అండగా ఉండాలి. మధ్యలో వచ్చే విధ్వంస పాలకులతో లక్ష్యాలను చేరుకోలేం. ప్రజల నిరంతర మద్దతుతో ఎలాంటి సుపరిపాలన ఇవ్వగలమో మోదీ నిరూపించారు. ఎన్డీయే బలంగా ఉంటే భారత్ బలంగా ఉంటుంది. కూటమి బలంగా ఉంటే ఏపీ బలంగా ఉంటుంది" అని అన్నారు. బుధవారం విశాఖపట్నం వేదికగా... ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన అనేక ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. బీజేపీ, టీడీపీ, జనసేన మైత్రి కొనసాగుతుందని చంద్రబాబు ఉద్ఘాటించారు. "గత ఎన్నికల్లో మోదీ, పవన్, నేనూ కలిశాం. నేను 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. ఎప్పుడూ లేనట్లుగా 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించాం. ఈ కాంబినేషన్ ఎప్పటికీ కొనసాగుతుంది. మోదీ దేశ ప్రధానిగా కొనసాగుతారు. దేశం, ప్రపంచం మెచ్చే నాయకుడు మోదీ" అని పేర్కొన్నారు.

వైసీపీ చీకటిపాలన నుంచి వెలుగులోకి..

ఐదేళ్ల అరాచక, చీకటి పాలనను తొలగించుకుని, వెలుగు రేఖల వైపు ఇప్పుడిప్పుడే ఏపీ అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నా రు. వైసీపీ పాలనాకాలంలో అభివృద్ధికి ఏపీలో ఆస్కా రం లేదనే వాతావరణం ఉండేదన్నారు. అలాంటిది అభివృద్ధి అంటేనే ఆంధ్రా అనేలా ఈనాడు ముందుకు వెళుతున్నామని అన్నారు. 'కూటమిపై ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగిస్తున్నాం. అందులో భాగంగానే రాష్ట్రానికి రూ.2.1 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా సుమారు ఏడున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి' అని అన్నారు

నిబంధనలకు విరుద్ధంగా 155 ప్లాట్ల రిజిస్ట్రేషన్

- యాదగిరిగుట్ట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా 155 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన యాదగిరిగుట్ట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గోపీనాయక్‌ను సస్పెండ్ చేసినట్లు నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల రిజిస్ట్రార్ రవి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నంబరు 472/ఈ3/1లో 2.14 ఎకరాలు, 473/ఈ3లో 5.13 ఎకరాల్లోని మొత్తం 7.27 ఎకరాల భూమిని ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో గత నెల 17న రాజేంద్రప్రసాద్ శర్మ అనే వ్యక్తి చల్ల అంజన్‌ప్రసాద్‌కు రిజిస్ట్రేషన్ చేశారు. అంజన్ ప్రసాద్ ఆ భూమిని గత 20వ తేదీన ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో నాలా కన్వర్షన్ చేసుకున్నాడు. నాలా కన్వర్షన్ ఉత్తర్వుల ద్వారా ఆ భూమిని యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత డిసెంబరు 20 నుంచి 23వ తేదీ వరకు సుమారు 155 ప్లాట్లుగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గోపీనాయక్ రిజిస్ట్రేషన్ చేశారు. ఎలాంటి డీటీసీపీ అనుమతి లేకుండా అనధికార లేఅవుట్‌లో యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారని ఈ నెల 7న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ జ్యోతి ప్రకాష్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. అనధికార లేఅవుట్‌లో 155 ప్లాట్లుగా స్థానిక సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసినట్లు విచారణలో తేలింది. దీంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ గోపీనాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రిజిస్ట్రార్ రవి వివరించారు. రిజిస్ట్రేషన్ చేసిన 155 డాక్యుమెంట్లను నిషేధిత జాబితాలో పెట్టామని ఆయన తెలిపారు.

హైడ్రాకు ఫిర్యాదులపై రంగంలోకి రంగనాథ్

- బుధవారం హైదరాబాద్ శివార్లలో పలు చెరువుల పరిశీలన

హైదరాబాద్ సిటీ/హయత్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా రంగంలోకి దిగింది. కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. బుధవారం హైదరాబాద్ శివార్లలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించిన ఆయన తుర్కయాంజల్, రాయన్, జీలవర్కన్ చెరువులను సందర్శించారు. అనంతరం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని దివ్యానగర్ లే అవుట్, సుప్రభాత్ టౌన్‌షిప్, ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీల్లో పర్యటించారు. గేటెడ్ కమ్యూనిటీల పేరుతో ఆయా కాలనీల్లో రోడ్లపై గేట్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బంది అవుతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా కాలనీల వాసులతో మాట్లాడారు. రోడ్లపై ఏర్పాటు చేసిన గేట్లను తెరిపించారు. నల్లమల్లారెడ్డి అభివృద్ధి చేసిన దివ్యానగర్ లేఅవుట్ నుంచి వెళ్లేందుకు రోడ్డు మార్గం ఇవ్వకపోవడంపై రంగనాథ్ స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూములు మూసి.. అలుగు ఎత్తు పెంచడంతో తమ ఇళ్లు, పంట పొలాలు నీట మునుగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం రంగనాథ్ తుర్కయాంజల్ చెరువును రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిపై వ్యవసాయశాఖ, రెవెన్యూ విభాగాల వద్ద ఉన్న వివరాలు పరిశీలిస్తామని, ఇంజనీరింగ్ నిపుణులతో అధ్యయనం చేయిస్తామని రంగనాథ్ చెప్పారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ చిత్రాలు, గ్రామాల మ్యాప్‌లను సరి చూసి రెండు, మూడు నెలల్లో చెరువు వాస్తవ ఎఫ్‌టీఎల్ ఎంతన్నది నిర్ధారిస్తామని పేర్కొన్నారు.


అడుగంటిన శ్రీశైలం జలాశయం

శ్రీశైలం ఖాళీ!

- 105 టీఎంసీలకు పడిపోయిన నీటిమట్టం

హైదరాబాద్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వలు 105.39 టీఎంసీలకు పడిపోయాయి. ఇప్పటికే విద్యుదుత్పత్తి రూపంలో తెలంగాణ 358.94 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199.38 టీఎంసీలను (మొత్తం 558.32 టీఎంసీలు) దిగువ నాగార్జునసాగర్‌కు వదిలేశాయి. రబీ పంటలు చేతికి రావాలంటే ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇరు రాష్ట్రాలు విద్యుదుత్పత్తి పేరిట పోటీ పడి దిగువకు నీటి విడుదల చేస్తుండటంపై పర్యావరణవేత్తలు, సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణుల మనుగడకు అవసరమైన మేరకు జలాశయంలో నిల్వలు ఉండేలా చూడాలంటున్నారు. ఇప్పటికైనా ఉన్న నీటి నిల్వలను జాగ్రత్తగా వాడుకోవాలని.. 90 టీఎంసీలకు తగ్గకుండా నిర్వహించాలని కోరుతున్నారు. ఆ దిశగా కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల అస్వస్థతపై కలెక్టర్‌ను నివేదిక కోరిన బీసీ కమిషన్

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా శర్మనగర్ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటనపై మూడు రోజుల్లో నివేదిక పంపాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఆ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తినడంతో 23 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రిలో చేర్పించినట్టు వచ్చిన వార్తలపై బీసీ కమిషన్ చైర్మన్ తీవ్రంగా స్పందించారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో ఆహారం కలుషితం కావడం, చిన్నారులు అస్వస్థత పాలవడం వంటి ఘటనలను తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఢిల్లీ ఎన్నికలు

దేశ రాజధాని ఢిల్లీలో డెబ్బై అసెంబ్లీస్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరుగుతాయి, మరో మూడురోజుల తరువాత జనం ఎవరికి అధికారం కట్టబెట్టారో తేలిపోతుంది. పోటీ ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ–బీజేపీ మధ్యే ఉందని, గతంలో పదిహేనేళ్ళు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్, షీలాదీక్షిత్ అనంతరం చిక్కిశల్యమైనందున ఇప్పుడు ఉనికికోసం పోరాడుతోందని విశ్లేషకులు అంటున్నారు. కానీ, ఢిల్లీ నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన గత కాంగ్రెస్ పాలనను ప్రజలు మరిచిపోలేదని, ఆప్–బీజేపీ నిత్యకయ్యంతో విసిగివేసారిన జనం ఈ మారు తమకు ఓటేస్తారని ఆ పార్టీ నాయకుల వాదన. ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు కుదరకపోవడం తమకు మేలుచేస్తుందని కూడా వారు నమ్ముతున్నారు. అవినీతి వ్యతిరేక పోరాటం నుంచి పుట్టుకొచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీని పాపాలపుట్టగా ముద్రవేయడం ద్వారా ఈమారు అధికారంలోకి రాగలనని బీజేపీ నమ్ముతోంది. శక్తిమంతుడైన లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేజ్రీవాల్‌ను ఎన్నిరకాలుగా ఇబ్బందిపెట్టవచ్చునో అన్నీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసింది. రెండు పర్యాయాలు ఢిల్లీని గెలుచుకొని, ముచ్చటగా మూడోమారు అధికారంలో కొనసాగడానికి ప్రయత్నిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ అధిక సంఖ్యలో సిట్టింగులను మార్చి, ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రయత్నిస్తోంది. అన్ని పార్టీలూ వాస్తవాలూ వాదనలతోకంటే ఉచితాలతోనే జనాన్ని సులువుగా గెలవవచ్చునన్న నమ్మకంతో వేల కోట్ల రూపాయల వరాలు కురిపిస్తున్నాయి.

ఢిల్లీ ఎన్నికల తేదీల ప్రకటనతో పాటుగానే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్నికల హామీల మీద కొన్ని విమర్శనాత్మకమైన వ్యాఖ్యలు చేశారు. ఉచితం సముచితంకాదు, చాలా రాష్ట్రాలు జీతాలకు కూడా వెతుక్కోవాల్సిన స్థితికి వచ్చేశాయి, ఉచితాల మీద ఓ కన్నేసి ఉంచుతాం అన్నారాయన. తమ హామీల వల్ల రాష్ట్రం మీద పడే ఆర్థిక భారాన్ని ప్రతీ పార్టీ ప్రజలకు తెలియచేయాలని కూడా ఆయన అన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఏమి చెప్పిందో, ఎన్నికల సంఘం ఏమి చేయబోతున్నదో కూడా ఆయన వివరించారు. ఈ సమస్య ఢిల్లీకి మాత్రమే పరిమితం కాదనీ, ఎన్నికలకు పోతున్న ప్రతీ రాష్ట్రమూ వరాల జల్లుల్లో తడుస్తున్నదని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో అధికారంలో ఉన్న పార్టీలు కొత్త పథకాలేమీ ప్రకటించలేకపోవచ్చును గానీ, ఇప్పటికే చేతికి ఎముకలేనట్టుగా అన్ని పార్టీలు ప్రతీ ఓటరుకూ కచ్చితంగా ఎంతోకొంత ముట్టేట్టుగా నగదు బదిలీ పథకాలను ప్రకటించేశాయి. మూడురోజుల క్రితమే కాంగ్రెస్ కూడా 'ప్యారీ దీదీ యోజన' పేరుతో ప్రతీ మహిళకు నెలకు రెండున్నరవేలు ఇస్తానని హామీ ఇచ్చింది. కేజ్రీవాల్ ప్రకటించిన ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన కంటే ఇది నాలుగువందల రూపాయలు ఎక్కువ. రేవడీలను తప్పుబట్టే ప్రధాని మోదీ సైతం ఢిల్లీలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆప్ సంక్షేమ పథకాలేవీ రద్దుచేయబోదని గట్టి హామీ ఇచ్చారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, కరెంటు, ప్రజా సౌకర్యాల గురించి గతంలో ఘనంగా చెప్పుకొనే పార్టీలు ఈ మారు ఉచితాల గురించే ఎక్కువగా మాట్లాడుతున్నాయని మేధావుల బాధ. భయానకమైన కాలుష్యం, నీరు, విద్యుత్ కొరతలు, పాడైన రోడ్లు, పరిమిత ప్రజారవాణా సహా పలు సమస్యలు ఢిల్లీ ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తుంటే, వాటన్నింటినీ వదిలేసి జనానికి ఉపకరించని అంశాల చుట్టూ చౌకబారు విమర్శలతో ఎన్నికల ప్రచారం సాగుతోంది.

ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్నది అటుంచితే, ఏది వచ్చినా, ఢిల్లీ ప్రజలకు ఈ ఎన్నికలు గుర్తుండిపోతాయి. ఎన్నికల ప్రసంగాల్లో విమర్శలు కూడా లక్ష్మణరేఖను దాటేశాయి. ప్రధాని మోదీ సహా బీజేపీ నాయకులంతా తనను అవమానకరంగా విమర్శిస్తున్నారనీ, ప్రజల కోసం ఎటువంటి భాషనైనా భరిస్తానని కేజ్రీవాల్ బాధితుడి మొఖం పెడుతున్నారు. గత ఐదేళ్ళలో ఆయన, పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు తీవ్రమైన అవినీతి ఆరోపణలు, కేసులు ఎదుర్కొన్నారు, జైలుశిక్ష అనుభవించారు. పొరుగు రాష్ట్రాల్లోకి కూడా విస్తరించగలిగిన ఆప్‌కు, తాను పుట్టిపెరిగిన ఢిల్లీని మళ్ళీ గౌరవంగా గెలుచుకోవడం మరింత ముఖ్యం. ఈ మారు కచ్చితంగా అలా జరగకుండా చేయాలన్నది ముప్పయ్యేళ్ళుగా అధికారంకోసం నిరీక్షిస్తున్న బీజేపీ పంతం.

ఆశ కలిగించి, ఆవిరైన 'భగవత్' బోధ!

దేశ మత సామరస్యం, ఆధ్యాత్మిక వైవిధ్యం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ చూడని సంక్షోభాన్ని, దాడిని ఎదుర్కొంటున్న సమయంలో, రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) అధినేత వాటికి ప్రాణం పోసినట్టు మాట్లాడారు. మసీదుల కింద హిందూ ఆలయాలను వెతికి వివాదాలు రేకెత్తించడం మానుకొమ్మని ఆయన తన అనుచర గణాలకు పిలుపు ఇచ్చారు. గత డిసెంబరు 19న పూణేలో ఒక సభలో మాట్లాడుతూ భగవత్ ఈ హితబోధ చేశారు. దీనికి దేశంలోని సెక్యులర్‌వాదులు ఎంతో హర్షించారు. మైనారిటీ మతాల పెద్దలు కూడా సంతృప్తి చెందారు. నవశకం ప్రారంభం కాబోతోందా అనే ఆశాభావ వాతావరణం కనిపించింది.

అయోధ్య వివాదాస్పద స్థలం హిందూ సంస్థలకు, బాలరాముడికి చెందాలంటూ 2019లో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానితో ఆ స్థలంలో బ్రహ్మాండమైన రామ మందిర నిర్మాణం జరిగింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికలకు ముందు దాని మహా ప్రారంభోత్సవం జరిగింది. ఈ చర్యతో లోక్‌సభలో 400 స్థానాలు గెలుచుకుంటామని ఆశించిన బీజేపీకి 240 సీట్లే వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజలు ఎల్లకాలం ఆలయ సెంటిమెంట్లకు, పరమత ద్వేషానికే ప్రాధాన్యం ఇస్తారనే భ్రమలు వదులుకోవాలని, ప్రజల జీవన సమస్యలను పాలకులు పట్టించుకోనప్పుడు కేవలం విగ్రహ పుష్టితో ఓట్ల వృష్టి ఎంతోకాలం సాగదని ఈ ప్రజా తీర్పు హెచ్చరించింది. అయితే ఊతకర్రల మీద ఆధారపడి అధికారంలోకి వచ్చినా హిందుత్వ ఎజెండాను పూర్తిస్థాయిలో అమలు పరచడానికి బీజేపీ పాలకులు వెనుకాడటం లేదు. అయోధ్య విజయంతో బలం పుంజుకున్న పరివార్ శక్తులు ముస్లింలపై ద్వేషాన్ని రగిలించే కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో గల షాహీ జామా మసీదుపై తాజాగా వివాదం లేవదీశారు. అక్కడ అంతకు పూర్వమున్న హరిహర ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి బాబర్ 1526లో ఆ మసీదును నిర్మించాడని స్థానిక కోర్టుకు వెళ్లారు. మసీదు సర్వేకి సంభాల్ కోర్టు గత ఏడాది నవంబర్ 19న ఆదేశించింది. అదే రోజు జిల్లా అధికారుల పర్యవేక్షణలో సర్వే నిర్వహించారు. రెండవసారి సర్వేకి నవంబర్ 24న అధికారులు తమ సిబ్బందితో వెళ్లడంతో మసీదును కూల్చివేయడానికి వచ్చారనే భయం కమ్ముకొని పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. జనాన్ని అదుపు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగారు. ఆ ఘర్షణల్లో అయిదుగురు దుర్మరణం పాలయ్యారు.

మసీదులు, దర్గాల కింద ఆలయాలున్నాయని, వాటి పునరుద్ధరణకు ఆదేశించాలని కోరుతూ హిందూ సంస్థలు స్థానిక కోర్టులకు ఎక్కితే, కొన్ని కోర్టులు అటువంటి మసీదులపై సర్వేకి ఆదేశించాయి. వారణాసిలో 1670లో నిర్మించిన గ్యాన్‌వాపి మసీదు వివాదం ఇందులో ముఖ్యమైనది. దీని కింద విశ్వనాథుని ఆలయం ఉందని ఆలయ పునరుద్ధరణ శక్తులు వాదిస్తున్నాయి. 1669లో ఔరంగజేబు ఆదేశాలపై అక్కడి విశ్వనాథ ఆలయాన్ని కూల్చివేసి ఆ శిథిలాల మీద మసీదు నిర్మించారన్నది వారి వాదన. మసీదు దక్షిణ భాగంలో పూజలు చేసుకోడానికి స్థానిక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులతో క్షణం జాగు చేయకుండా అక్కడ ఆరాధన ప్రారంభించారు. ఇది 2024 ఫిబ్రవరి 1న జరిగింది. అందుకు నిరసన సంకేతంగా ఆ మరుసటి రోజు శుక్రవారం నాడు అసాధారణ స్థాయిలో 3000 మంది ముస్లింలు ఆ మసీదులో ప్రార్థనకు హాజరయ్యారు. గ్యాన్‌వాపికి కూడా బాబ్రీ మసీదుకు కలిగిన పరిస్థితే కలుగుతుందని వారు భయపడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మథురలో కృష్ణుడి గుడిని కూల్చివేసి ఔరంగజేబు అక్కడ షాహీ దర్గాను కట్టాడన్నది మరో వివాదం. ఈ వివాదాలు దేశంలో మత సామరస్యాన్ని దారుణంగా దెబ్బ తీస్తూ ఎక్కడికక్కడ మందుపాతరలను సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో– నాయకులం అయిపోవాలనే అత్యాశతో మసీదుల కింద శివలింగాల కోసం వెతకడం మానుకోండని మోహన్ భగవత్ హెచ్చరించడం బాగుంది. 'ప్రతి రోజూ ఒక కొత్త వివాదాన్ని రేకెత్తిస్తుంటే దానిని ఎలా అనుమతిస్తారు? ఇది ఇలా కొనసాగడానికి వీల్లేదు. మనం కలిసి బతకగలమని చూపించాలి,' అని కూడా భగవత్ హితవు చెప్పారు. 'ప్రపంచానికి శాంతి సామరస్యాలు కావాలి, భారతదేశం తన భిన్నత్వంలో ఏకత్వ సంప్రదాయాన్ని, అందరినీ కలుపుకొనిపోయే సమ్మిళిత తత్వాన్ని ప్రదర్శించి విశ్వగురువుగా నిరూపించుకోవాలి' అని కూడా అన్నారు ఆయన.



ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యల్లో వ్యక్తమైన సర్వమత సామరస్యం, సమధర్మం భారత రాజ్యాంగ స్ఫూర్తి అయిన సెక్యులరిజానికి చేరువైనది. కానీ, పరివార్ శక్తులు తన వ్యాఖ్యలపై వ్యతిరేకంగా స్పందించిన తర్వాత ఆయన ఇక కిమ్మనలేదు.

భగవత్ పూణే ప్రసంగం సద్దుమణగకముందే ఆర్ఎస్ఎస్ సోదర సంస్థలు తాము అందుకు అంగీకరించబోమని కరాఖండిగా స్పష్టం చేశాయి. మతసంబంధ విషయాల్లో మతసంస్థలే నిర్ణయం తీసుకోవాలి కాని ఆర్ఎస్ఎస్ కాదని అఖిల భారతీయ సంత్ సమితి దృఢంగా ప్రకటించింది. మత నాయకుల నిర్ణయాలను ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు గౌరవించాలని కూడా సంత్ సమితి స్పష్టం చేసింది. మసీదులను కూల్చి ఆలయాలు నిర్మించవలసిన స్థలాలు ఇంకా 56 ఉన్నాయని ఈ సమితి ప్రధానకార్యదర్శి స్వామి జితేంద్రానంద సరస్వతి వెల్లడించారు. మోహన్ భగవత్ తమను శాసించలేరని, ఆయనకు ఆ స్థాయి లేదని జగద్గురు రామభద్రాచార్య అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ఎస్ వార పత్రిక 'ది ఆర్గనైజర్' మోహన్ భగవత్ హితబోధను సుతిమెత్తగా చెత్త బుట్టకు చేరవేసింది. 'మసీదుల కింద గల గుడులను పునరుద్ధరించాలన్నది మన జాతీయతా గుర్తింపు సంబంధమైనది, నాగరికతా న్యాయం కోసం ఉద్దేశించినది. దీనిని కుహనా సెక్యులర్ అద్దంలో హిందూ ముస్లిం గొడవగా చూడరాదు' అని ఆ పత్రిక తన సంపాదకీయంలో పేర్కొని, అలా అధినేత మాటనే కొట్టిపారేసింది. ఈ దేశానిది హిందూ జాతీయతేనని నొక్కివక్కాణించింది.

మోహన్ భగవత్ వ్యాఖ్యల్లో వ్యక్తమైన సర్వమత సామరస్యం, సమధర్మం భారత రాజ్యాంగ స్ఫూర్తి అయిన సెక్యులరిజానికి చేరువైనది. పరివార్ శక్తులు ఆయన వ్యాఖ్యలపై వ్యతిరేకంగా స్పందించిన తర్వాత ఇక భగవత్ కిమ్మనలేదు. ప్రధాని మోదీ గాని, హోమ్ మంత్రి అమిత్ షా గాని నోరు విప్పలేదు అంటే వారు కూడా మోహన్ భగవత్ మాటను గౌరవించడం లేదనుకోవాలి.

1991 నాటి ప్రార్థనా మందిరాల చట్టంపై తన తీర్పు వెలువడే వరకు మసీదుల కింద మందిరాలున్నాయని వాదిస్తూ వాటిపై సర్వే జరిపించాలని కోరే వ్యాజ్యాలను అనుమతించరాదని దేశంలోని కోర్టులన్నిటికీ సుప్రీంకోర్టు డిసెంబర్ 13న ఆదేశాలు జారీ చేసింది. రాజ్యాంగంలోని సమానత్వ హక్కును, 'సౌభ్రాత్రం' అనే పదాన్ని గమనిస్తే సెక్యులరిజం రాజ్యాంగ ప్రధాన లక్షణమని బోధపడుతుంది అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. సెక్యులరిజం ఎల్లప్పుడూ రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమేనని ధ్రువపరిచింది. రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని వేసిన కేసులను గత నవంబర్ 25న కొట్టివేస్తూ ఈ అభిప్రాయాన్ని ప్రకటించింది.

దేశంపై హిందూ రాజ్యాన్ని, హిందూ సంస్కృతిని రుద్దాలన్నది ఆర్ఎస్ఎస్ లక్ష్యమని సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్వయంగా అన్నారు. అటువంటి సంస్థ అధినేత చేసిన మతసామరస్య ఉద్బోధ వెనువెంటనే అపహాస్యం పాలుకావడం ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. వాస్తవానికి నిజమైన హిందూమతావలంబులు ఎవ్వరూ హిందుత్వ మోదీత్వ శక్తుల మతవైరతత్వాన్ని మెచ్చరు. దేశంలో ఇంతకాలంగా భిన్న మతస్థుల మధ్య సహజీవన సామరస్యాలు సురక్షితంగా కొనసాగాయంటే అది ఇక్కడి బహుళత్వ సంస్కృతి గొప్పదనమే. దానిని వమ్ము చేయడానికి జరుగుతున్న కుట్ర కొంతైనా ఆగుతుందేమోనన్న ఆశ కల్పించిన భగవత్ ఉద్బోధకు ఈ గతి పట్టడం బాధాకరం. ప్రజల్లో ప్రజాస్వామ్యం, సెక్యులరిజం పట్ల గౌరవ అభిమానాలను పెంచడానికి ప్రజాస్వామిక శక్తులు పునరంకితం కావడమొక్కటే శరణ్యం.

■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

గ్రంథాలయ శాస్త్రంలో అగ్రగణ్యుడు!

ఆరు దశాబ్దాల పాటు భారతదేశ గ్రంథాలయ శాస్త్రంలో అపూర్వ సేవలు అందించిన డాక్టర్ పి.ఎస్.జి. కుమార్ (పోగుల శేషగిరి కుమార్) జనవరి 3, 2025న తుది శ్వాస విడిచారు. లైబ్రరీ సైన్సెస్‌లో ఆయన చేసిన కృషికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. అందుకుగాను ఆయనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది.

పి.ఎస్.జి. కుమార్ 1946 జూన్ 9న గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. ఆయన తండ్రి సాంబశివరావు, హోమియోపతి వైద్యుడిగా, గ్రంథాలయ నాయకుడిగా సేవలందించారు. తల్లి వెంకటరత్నమ్మ చిన్నవయసులోనే మరణించారు. తరువాత ఆయన అమ్మమ్మ బసవమ్మ, సవితి తల్లి భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో పెరిగారు. ఆయనకు సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. 1972లో ఉదయశ్రీతో వివాహం జరిగింది. శైలజ, ఫణి భార్గవి ఇద్దరు కూతుర్లు.

పి.ఎస్.జి. కుమార్ ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు నాటకాల మీద ఆసక్తితో మిత్రులతో కలిసి 'ఆంధ్ర థియేటర్'ను స్థాపించారు. 1962లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలలో ప్రథమ బహుమతి పొందారు. స్కూల్, కాలేజీ సమయంలో పెయింటింగ్, కథాకళి వంటి కళలలో నైపుణ్యం సాధించారు. 1969లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గ్రంథాలయ శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ తీసుకున్నారు. తరువాత బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మాస్టర్ డిగ్రీ, షఫీల్డ్ యూనివర్సిటీ నుండి డిప్లమా కోర్సు, గుల్బర్గా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పొందారు. 1972లో లక్నో కళాశాలలో ఉపన్యాసకుడిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1973లో నాగపూర్ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ ఉపన్యాసకుడిగా చేరారు. అక్కడ లెక్చరర్, రీడర్, ఆచార్యునిగా 29 సంవత్సరాలు సేవలందించారు. ముఖ్యంగా 24 సంవత్సరాలపాటు గ్రంథాలయ శాస్త్ర విభాగానికి అధిపతిగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర విభాగం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి.



భారతదేశ లైబ్రరీ శాస్త్రంలో ఒక తెలుగువాడిగా పి.ఎస్.జి. కుమార్ విజయాలు మనందరికీ గర్వకారణం. ఆయన నాయకత్వంలో లైబ్రరీ ప్రొఫెషనల్స్‌కు సంబంధించిన సమర్థవంతమైన విధానాలు, నిబంధనలు రూపొందాయి.

ఆయన తన వృత్తి జీవితంలో అనేక గౌరవప్రదమైన పదవులను చేపట్టారు. ముఖ్యంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టీచర్స్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (IATLIS) అధ్యక్షులుగా సేవలందించారు. ఈ పదవిలో ఆయన గ్రంథాలయ శాస్త్ర ఉపాధ్యాయ సమస్యలపై విశేషమైన కృషి చేశారు, ఆ సమస్యల పరిష్కారాలకు నూతన మార్గాలను సూచించారు. ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ (ILA) అధ్యక్షునిగా 1994–96 వరకు పనిచేసిన పి.ఎస్.జి. కుమార్ లైబ్రరీ ప్రొఫెషనల్స్ హక్కులను, వారి అభివృద్ధికి అవసరమైన మార్పులను ప్రతిపాదించారు. ఆయన నాయకత్వంలో లైబ్రరీ ప్రొఫెషనల్స్‌కు సంబంధించిన సమర్థవంతమైన విధానాలు, నిబంధనలు రూపొందాయి. ఈ మార్పుల ద్వారా లైబ్రరీ రంగంలో సమానత్వం, అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణపై ముఖ్యమైన దృష్టికోణాలు వెలుగు చూసాయి.

పి.ఎస్.జి. కుమార్ భారతదేశ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రముఖ లైబ్రరీ, సమాచార సంస్థలతో సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయన జాయింట్ కౌన్సిల్ ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్స్ ఇన్ ఇండియా (JOCLAI), సార్క్ దేశాల లైబ్రరీ అసోసియేషన్ (LASAARC) వంటి సంస్థలలో ఎడ్వైజరీ, నాయకత్వ పాత్రలను నిర్వహించారు. ఈ అన్ని స్థానాలూ ఆయన వృత్తి జ్ఞానాన్ని, లైబ్రరీ శాస్త్రానికి సంబంధించి అనేక అంశాలను అభివృద్ధి చేసేందుకు కీలకంగా పనిచేశాయి.

పి.ఎస్.జి. కుమార్ 70 పుస్తకాలు, 142 పరిశోధన పత్రాలు రచించారు. 'ఇండియన్ లైబ్రరీ క్రానాలజీ', 'ఇండియన్ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్', 'యూనివర్సిటీ గ్రాంట్స్ కరిక్యులం సిరీస్', 'లైబ్రరీ ఇన్ ఇండియా సిరీస్' వంటి పుస్తకాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఆయన తన రచనలను అనేక జాతీయ, అంతర్జాతీయ గ్రంథాలయ శాస్త్ర జర్నల్స్‌లో ప్రచురించారు. 'లైట్ అండ్ షేడ్స్ ఆఫ్ మై లైఫ్' అనే ఆత్మకథలో పి.ఎస్.జి. కుమార్ తన జీవితంలోని అద్భుత ఘట్టాలను, కష్టాలను, విజయాలను పాఠకులకు తెలియజేశారు. లైబ్రరీ శాస్త్రంలో చేసిన సేవలకు ఆయన 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'ను అందుకున్నారు. 'డా. పి.ఎస్.జి. కుమార్ లైబ్రరీ ఫౌండేషన్'ను కూడా స్థాపించారు.

పి.ఎస్.జి. కుమార్ స్థాపించిన ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా లైబ్రరీ శాస్త్రం అభివృద్ధికి సహకరించే అనేక కార్యక్రమాలు, సేవలు కొనసాగించబడుతున్నాయి. ఈ ఫౌండేషన్ ఆయన ఆశయాలను ప్రతిబింబిస్తూ, లైబ్రరీ శాస్త్రంలో కొత్త దిశలో పరిశోధనలను ప్రోత్సహించడంలో, మరింత అవగాహన కల్పించడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నది. భారతదేశ లైబ్రరీ శాస్త్రంలో ఒక తెలుగువాడిగా ఆయన విజయాలు మనందరికీ గర్వకారణం. ఆయన వేసిన దారిలో భారతదేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న లైబ్రరీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు కృషి చేస్తూనే ఉంటారు.

○ డా. రవికుమార్ చేగోని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

సమగ్ర సర్వే పేరుకే సమగ్రమా?

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అన్న కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎన్నికలు ముగియగానే ఆరు నెలల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. ఆరునెలల కాలయాపన తర్వాత బీసీ వర్గాల డిమాండ్‌తో డెడికేటెడ్ బీసీ కమీషన్‌ను నియమించింది. డిసెంబర్ మాసానికే సర్వే పూర్తి చేస్తామని ప్రకటించింది. రూ.150కోట్ల కేటాయింపు జరిగినా, 94 వేల మంది ఎన్యుమరేటర్లు, 9000 మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నా, వంద రోజులు కావొస్తున్నా ఇంకా సర్వే పూర్తి కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతానికి పైగా పూర్తయ్యిందనీ, హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో సగానికి పైగా సర్వే పూర్తి కాలేదనీ అంటున్నారు.

బీసీలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో ఏ దశలో ఉన్నారు, ఏయే కులాలు ఎంతగా వెనుకబడి ఉన్నాయి, అలాగే ప్రధానంగా ఎంబీసీలు, సంచార, అర్ధసంచార, విముక్త జాతుల వారి దీనస్థితి.. ఈ సర్వే ద్వారా వెల్లడవుతాయని బడుగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వే తూతూ మంత్రంగా చేస్తే అది బీసీ సామాజిక వర్గాలకు తీవ్ర నష్టంగా భావించాల్సి వస్తుంది.

అన్ని జిల్లాల్లో ఈ సర్వే పూర్తయ్యిందని డెడికేటెడ్ కమీషన్ ఇంతకు ముందే తెలియజేసింది. హైదరాబాద్ నగరమంటే 1/3 తెలంగాణ. సుమారు కోటి మందికి పైగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో సమగ్ర సర్వే అంటే కొంచెం కష్టంతో కూడుకున్న పనే. రాష్ట్ర ప్రణాళికా శాఖకు కూడా అదొక సవాలు. మా ఇళ్ళకు సర్వేకు ఎవరూ రాలేదని చెబుతున్న వాళ్ళ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ అంశంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ చేస్తున్న కృషి కూడా అంతగా కనిపించడం లేదు. మా ఇంటికి రాలేదని చెబుతున్న వారు ఈ విషయంపై ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటున్నారు. ఇలా పట్టణాల్లో అసమగ్రంగా సర్వే పూర్తి చేసి ఉంటే అది బీసీలకు తీరని నష్టమే. రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జీహెచ్ఎంసీ పరిధిలో క్షేత్రస్థాయికి వెళ్ళాలి.

చాలామంది బీసీలలో తమ కుటుంబ వివరాలను పూర్తిగా చెప్పేస్తే తమకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పింఛన్లు, రేషను కార్డులు పోతాయన్న భయం ఉంది. కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సర్వే బృందానికి వెల్లడించటం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఏమీ రద్దు కావని ప్రజలకు భరోసా ఇవ్వాలి. ఇందుకు సంబంధించిన విస్తృతమైన అవగాహన కల్పించాలి. కానీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా ఉన్నది. మరో పదిరోజుల్లో డెడికేటెడ్ కమిషన్ తన సర్వే నివేదిక ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. సమగ్ర సర్వే అసమగ్రంగా జరిపితే బీసీ జనాభాను తక్కువగా చూపించే ప్రమాదం ఉంది. దీని వల్ల బీసీలకు తీరని నష్టం జరుగుతుంది. బీసీ కుటుంబాల సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు లోతుల్లోకి వెళ్ళి చూస్తామని చెప్పి లెక్కలు చూడకుండా వదిలేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేము సమాచారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పేవారి దగ్గరకు సర్వే బృందం పోలేకపోతున్నదన్న విమర్శలను కూడా జయించాలి.

సర్వేను సమగ్రంగా చేయడానికి గడువును పొడిగించాలి. లేకపోతే ఈ సర్వే తూతూ మంత్రంగానే చేస్తున్నట్లు బీసీలు అనుమానించాల్సి వస్తుంది. గత 77 ఏళ్ళలో బీసీల కోసం నియమించిన అనంతరామన్ కమిషన్ (1970), మురళీధరరావు కమిషన్ (1982), పుట్టస్వామి కమిషన్ (1994–2002), దాళ్వ సుబ్రహ్మణ్యం కమిషన్లు (2004–2011) బీసీల విద్యా ఉద్యోగాల రిజర్వేషన్ల వరకు మాత్రమే పరిమితమైన సిఫారసులు చేశాయి. ఇప్పుడు నియమించిన డెడికేటెడ్ కమిషన్ మాత్రమే స్థానిక సంస్థల్లో పొలిటికల్ రిజర్వేషన్లపై నియమించిన తొలి కమిషన్. ఈ సమగ్ర సర్వేకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసి నివేదికను ఇచ్చింది. ఒక్క బెంగుళూరు మహానగరం పైనే ప్రత్యేక శ్రద్ధతో ఎక్కువ రోజులు విస్తృతంగా తిరిగి నివేదిక తయారు చేశారు. మన ప్రణాళికా శాఖ కూడా ఏ గడప వదలకుండా సమగ్ర సర్వే చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది.

– జూలూరు గౌరీశంకర్
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

సినిమా ఒక విచిత్రమైన సరుకు!

ప్రేక్షకుల్లో 'గౌరవాన్ని' (అభిమానాన్ని) సంపాదించిన– అంటే, డిమాండు ఉన్న– ఒక హీరో చేసే నటన అనే శ్రమకీ, దానికోసం అతను తీసుకునే కోట్ల డబ్బుకీ పొంతన ఉండదు. అతను, తన పట్ల ప్రేక్షకులకు ఉన్న అభిమానానికి కూడా ఒక ధర పెట్టి, దాన్ని ఒక సరుకుగా అమ్మకానికి పెడతాడన్న మాట!

నిన్నటి డిసెంబరు నెలాఖరులో, ఆ సంవత్సరంలో వచ్చిన సినిమాలు ఎన్నో; అవి ఎన్ని కోట్లు వసూలు చేశాయో; ఎన్ని సినిమాలు ఘోరంగా దెబ్బ తిన్నాయో; ఏ హీరో రేటు ఎన్ని కోట్లుగా పెరిగిందో– వగైరా వగైరా వార్తలూ, లెక్కలూ పత్రికల్లోనూ, టీవీ చానళ్ళలోనూ వచ్చాయి. 2024వ సంవత్సరంలో దాదాపు 160 తెలుగు సినిమాలు విడుదలయ్యాయట! వాటిల్లో ఒక పదో, పదకొండో మాత్రమే బ్రహ్మాండంగా ఆడి, భారీ వసూళ్ళు సాధించాయట! ఒక సినిమా 300 కోట్లు! ఇంకోటి 500 కోట్లు! మరొకటి 1000 కోట్లు! ఒక సినిమా అయితే, 1800 కోట్లు వసూలు చేసిందట! కానీ, బొత్తిగా ఆడని, పెట్టిన పెట్టుబడిలో కనీసం కూడా రాని, సినిమాలే ఎక్కువట! అలా నష్టపోయిన నిర్మాతలు ఎందరోనట! ఒక నిర్మాత, గుండెపోటు వచ్చి ఆస్పత్రి పాలయ్యాడనీ; ఇంకో నిర్మాత, ఉన్న ఆస్తులన్నీ అమ్మేసుకుని అప్పులు తీర్చి బికారి అయ్యాడనీ; మరొక నిర్మాత ఇంటి ముందు, సినిమాకి అప్పులిచ్చిన వాళ్ళు ధర్నా చేశారనీ– ఇలాంటి వార్తలు కూడా విన్నాం. ఈ మధ్య సినిమాలు తియ్యడానికి అప్పులిచ్చేవాళ్ళు (ఫైనాన్షియర్లు) ఆ నిర్మాతలకి సంబంధించిన ఆస్తుల పత్రాలు ముందే తీసుకుని పెట్టుకుంటున్నారట!

కొన్ని సినిమాలే బాగా ఆడడమూ, ఎక్కువ సినిమాలు ఆడకపోవడమూ అనే దానికి –కథ, దర్శకత్వం, నటన, సంగీతం, పబ్లిసిటీ వంటి –అనేక కారణాలుంటాయి. అవన్నీ ఇక్కడ చర్చించలేం. ఒక ముఖ్యకారణం మాత్రం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో, ఏ ఒక్క సరుకుకి సంబంధించీ కూడా, ఆ సరుకుని తయారు చేయించే పరిశ్రమదారులకు, ఒక ఉమ్మడి ప్లాను అంటూ ఉండకపోవడం! ఎందుకంటే, ప్రైవేటు పెట్టుబడిదారులు –వాళ్ళు సబ్బుల పెట్టుబడిదారులైనా, సినిమాల పెట్టుబడిదారులైనా– ఎవరికి వారు, తమ సరుకుల్ని పెద్ద ఎత్తున అమ్ముకోగలమనుకుంటారు. ఉదాహరణకి, ఒక ప్రాంతంలో ఉన్న జనాభాకి ఎన్ని సబ్బులు అవసరమో, ఆ సంఖ్యకి కొంచెం అటూ ఇటూగా, వాటిని తయారు చేయించరు. వంద సబ్బులు అవసరమైన చోట, వెయ్యి సబ్బులు తయారు చేయిస్తే, వాటిని వాడేవాళ్ళెవరు? సినిమాలైనా అంతే! జనాలు నెలకి ఒక కొత్త సినిమా చూస్తారనుకుంటే, పది పన్నెండు కాకుండా, ఏకంగా 160 సినిమాలు తీస్తే, ఎంత బాగున్నా, ఎన్నని చూస్తారు? దీన్నే 'అమితోత్పత్తి' అంటారు. పెట్టుబడిదారీ సమాజానికి ఉన్న ఈ లక్షణాన్ని 'అంటువ్యాధి'గా వర్ణిస్తాడు మార్క్సు. మార్కెట్‌లోకి, అవసరాన్ని మించి కుప్పలు తెప్పలుగా సరుకులు వచ్చి పడుతోంటే, అన్నిటికీ ఒకే రకమైన డిమాండు ఉండదు గదా!

సినిమా తియ్యడానికి, 'పెట్టుబడి' పెట్టడమూ, 'లాభాలు' సంపాదించడమూ జరుగుతుంది కాబట్టి, సినిమా కూడా పెట్టుబడిదారీ పరిశ్రమే. 'సినిమా ప్రదర్శన' ఒక 'అమ్మకం సరుకు.' టిక్కెట్లు కొని, సినిమాని చూడడం అంటే, అది ఆ సరుకుని కొనడమే. అన్ని సరుకుల తయారీలో లాగే, సినిమా అనే సరుకు తయారీలో కూడా కావలిసినవి రెండు. 1) ఉత్పత్తి సాధనాలు (కెమెరాలూ, మేకప్ సామాన్లూ, బట్టలూ, సెట్టింగులూ వగైరాలు). 2) ఉత్పత్తిదారులు (డైరెక్టర్లూ, నటీనటులూ, టెక్నీషియన్లూ, వగైరాలు). అయితే, ఈ ఉత్పత్తిదారుల్లో రచనా, డైరెక్షనూ, నటనా, సంగీతమూ – వంటి 'కళాత్మక నైపుణ్యాలు' కొన్ని అవసరం అవుతాయి. కుండల్ని తయారు చెయ్యడంలోనూ, చెప్పుల్ని కుట్టడంలోనూ కూడా నైపుణ్యాల్లో తేడాలు ఉంటాయి. అటువంటి వస్తువుల్ని తయారు చేసే శ్రమల కన్నా, రచనా, గానం, నటనా – వంటి నైపుణ్యాల విషయాలు వేరు. వీటికి 'కళ' అనే ఒక వేరే లక్షణం కలుస్తుంది. సినిమా వంటి పరిశ్రమలు 'నిజం కళల్ని' వదిలేసి, 'వ్యాపార కళల్ని' పడతాయి!

ఏ 'సరుకు' విషయంలో అయినా, దాని తయారీకి అవసరమయ్యే పాతా–కొత్తా 'శ్రమల మొత్తమే, దాని విలువ'. ఆ సరుకుని అమ్మితే వచ్చే డబ్బు, ఆ సరుకు 'విలువే.' సప్లై, డిమాండ్లని బట్టి, ఏదైనా మార్పు జరిగితే, ఆ 'విలువ' కన్నా, అమ్మకం ధర, కొంత తగ్గడమో, పెరగడమో జరుగుతుంది. 'సినిమా'ని కూడా ఒక 'అమ్మకం సరుకు'గానే అర్థం చేసుకోవాలి. ఒక సినిమాని తయారుచెయ్యడానికి, 'ఉత్పత్తి సాధనాల ఖర్చు'ని, 'లక్ష' అనుకుందాం. డైరెక్టర్ నించీ, లైట్ బాయ్ వరకూ తీసుకునే ఛార్జీల ఖర్చుని, '2 లక్షలు' అనుకుందాం. (ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం 'లక్ష' అనే అతి చిన్న మాట వాడుతున్నాం. అసలైతే, సినిమాలు తీయడానికి యాభై లక్షలు తక్కువ కాకుండా, వెయ్యి కోట్ల వరకూ ఖర్చు పెడతారట!) ఆ సినిమా కోసం ఖర్చులు పెట్టిన నిర్మాతకి వచ్చిన లాభాన్ని, '1 లక్ష' అనుకుందాం. నిర్మాత చేతికి వచ్చేది లాభం! అంటే, ఆ సినిమా ప్రదర్శనలు పూర్తి అయ్యేటప్పటికి, దాని వల్ల మొత్తం రావలిసిన డబ్బుని, ఈ ఉదాహరణలో 4 లక్షలు అనుకోవాలి. అందులో నించి 'ఉత్పత్తి సాధనాల మొదటి లక్షని' తీసేస్తే, మిగిలిన 3 లక్షలూ, ఆ సినిమా తయారీ కోసం శ్రమలు చేసిన నటులతో కలిసి, మిగతా శ్రామికులందరిదీ అవుతుంది.

ఉదాహరణకి, 4 లక్షల ఖర్చుతో తయారైన ఒక సినిమాకి, 'డిమాండ్' పెరిగిపోయి, ఎక్కువ మంది చూసి, ఎక్కువసార్లు చూసి, దానికి మొత్తం మీద 1 కోటి డబ్బు వచ్చిందనుకుందాం. ఆ డబ్బు ఎక్కడి నించి వచ్చినట్టు? ఆ సినిమా తయారుకావడానికి జరిగిన రకరకాల శ్రమల నించే వచ్చినట్టు. ఆ సినిమా వల్ల 1 కోటి డబ్బు వచ్చిందంటే, ఆ కోటిలో నించి, 'ఉత్పత్తి సాధనాల' లక్షని తీసివేస్తే, ఇంకా మిగిలే 99 లక్షలూ, ఆ సినిమా తయారీలో శ్రమలు చేసిన కార్మికుల 'శ్రమ విలువే!' కానీ, ఆ శ్రమ విలువ రెండు భాగాలుగా ఉంటుంది. ఒకటి: సినిమా తీయడానికి అవసరమైన శ్రమలు చేసిన వారికి (లైట్ బోయ్ నించీ సూపర్ స్టార్ వరకూ అనేక మందికి) ఇచ్చిన జీతభత్యాలు. రెండు: ఆ శ్రామికులు, తాము జీతాలుగా పొందిన దానికన్నా అదనంగా చేసే శ్రమ విలువ. (అదే అదనపు విలువ! దాన్ని పెట్టుబడిదారుడు 'లాభం' అంటాడు.)




ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. సినిమాకి డిమాండ్ పెరిగి, ఎక్కువ టిక్కెట్లు అమ్ముడై, ఆ రకంగా వచ్చిన డబ్బు, ఎన్ని కోట్లు వస్తే, అన్ని కోట్లూ, సినిమా కార్మికుల శ్రమ విలువే అవుతుందా? ఈ విషయం గురించి వివరంగా చర్చించడానికి ఇక్కడ చోటు చాలదు. క్లుప్తంగానే చూడగలం! ఒక నటి గానీ, నటుడు గానీ, డైరెక్టర్ గానీ, ఎక్కువ డిమాండ్‌తో పదేసి లక్షల్లో, కొన్ని కోట్లో తీసుకున్నారనుకుందాం. అది వాళ్ళ 'ధర' అన్నమాట! అలా తీసుకుంటే, వాళ్ళు ఎంత ఎక్కువ తీసుకుంటే, ఆ ఎక్కువ అంతా, వాళ్ళ శ్రమ విలువేనా?– దీనికి జవాబు, 'కొంతవరకూ అవును', 'కొంతవరకూ కాదు' అని! పెట్టుబడిదారీ సమాజం మొత్తంలో, అనేక సరుకుల తయారీ కోసం జరిగే శ్రమల విషయంలో, జనరల్ సూత్రంగా చూస్తే, ఇది నిజమే! కానీ, మార్క్సు వివరించినట్టు కొన్ని ప్రత్యేక సందర్భాలలో "విలువ పరిమాణానికీ, డబ్బు రూపంలో దాని వ్యక్తీకరణకీ మధ్య" పొంతనే వుండదు ('ఇన్ కన్సిస్టెన్సీ'). ఈ పాయింటుని వివరించడానికి, మార్క్సు, 'పరువు, ప్రతిష్ఠ' అనే విషయాల్ని ఉదాహరణగా తీసుకుంటాడు, ఇలా: "డబ్బు అనేది, సరుకుల విలువల రూపం మాత్రమే అయినప్పటికీ, ధర అనేది విలువను బొత్తిగా వ్యక్తం చెయ్యకపోవచ్చు. 'అంతరాత్మ, గౌరవం' (కీర్తి, పరువు ప్రతిష్ఠలూ) వగైరాలు, తమంత తాముగా సరుకులు కానప్పటికీ, వాటి యజమానులు, వాటిని అమ్మకానికి పెట్టడం సాధ్యమే! ఆ రకంగా వాటి ధర వల్ల అవి సరుకుల రూపం ధరిస్తాయి. కనుక, విలువ అనేది లేని వస్తువులకు సైతం ధర అనేది వుండవచ్చు. అటువంటి సందర్భాలలో, ధర అనేది... ఊహాత్మకం!" (కాపిటల్–1, 'సరుకులూ, డబ్బూ' చాప్టరులో.)

మార్క్సు వివరణని, సినిమాలకి అన్వయించి చూద్దాం. ఉదాహరణకి, ప్రేక్షకుల్లో 'గౌరవాన్ని' (అభిమానాన్ని) సంపాదించిన–అంటే, డిమాండు ఉన్న–ఒక హీరో చేసే నటన అనే శ్రమకీ, దాని కోసం అతను తీసుకునే కోట్ల డబ్బుకీ పొంతన ఉండదు. అతను, తన పట్ల ప్రేక్షకులకు ఉన్న అభిమానానికి కూడా ఒక ధర పెట్టి, దాన్ని ఒక సరుకుగా అమ్మకానికి పెడతాడన్నమాట! అందుకే, 2024 సంవత్సరంలో, తెలుగు సినిమాల్లో హీరోలు కొందరు 30 కోట్లూ, కొందరు 50, కొందరు 100, కొందరు 200 కోట్లూ తీసుకున్నారట! ఈ మధ్య విడుదలై, తొక్కిసలాట జరిగిన సినిమాలో, హీరో 350 కోట్లు తీసుకున్నాడని ఒక వార్త. ఇది నిజమైనా కాకపోయినా, ప్రేక్షకుల్లో డిమాండు ఉన్న హీరోలు, కోట్లలో డబ్బుని డిమాండ్ చేస్తారనేదాన్ని నమ్మకుండా ఉండనక్కరలేదు. 'డిమాండ్ల' పేరుతో, తాము చేసే 'నటన' అనే శ్రమకి, లక్షలూ, కోట్లూ సంపాదించే పెద్ద పెద్ద సినిమా నటీనటులందరినీ 'శ్రమ దోపిడీ వర్గం'లో జమ కట్టెయ్యవచ్చు! కారణం, వాళ్ళ ఆస్తులూ, అహంకారాలూ, విలాసాలూ, వ్యసనాలూ!

హీరోలూ, హీరోయిన్లూ, డైరెక్టర్లూ, సినిమాల కోసం చేసే శ్రమకీ, ఆ శ్రమకి బదులుగా తీసుకునే కోటాను కోట్ల డబ్బు రాశులకీ, ఏ సంబంధమూ లేని పరిస్థితే, సినిమాని, మిగతా సరుకుల ప్రపంచం నించీ భిన్నమైన, ప్రత్యేకమైన, ఒక విచిత్రమైన సరుకుగా చేస్తుంది!

● రంగనాయకమ్మ

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 9 జనవరి 2025



ఎవరికి భరోసా.. నిరాశ?

పెట్టుబడి సాయం అమలుపై అన్నదాతల్లో అయోమయం

- అర్హులైన వారిని గుర్తించేందుకు సన్నాహాలు
- సాగేతర భూముల గుర్తింపునకు అధికారుల సర్వే
- శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా అంచనా
- ఒకటీ రెండు రోజుల్లో జారీకానున్న మార్గదర్శకాలు
- తగ్గనున్న లబ్ధిదారుల సంఖ్య
- 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పంపిణీ

హనుమకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం పెట్టు బడి సాయాన్ని ఎకరాకు రూ.2వేలు అదనంగా ఇవ్వనున్నట్లు చేసిన ప్రకటన.. అన్నదాతల్లో ఒకింత ఆనందాన్ని నింపగా, ఇదే క్రమంలో సాగేతర భూములకు రైతు బంధు ఇచ్చే ప్రసక్తిలేదన్న ప్రకటన మరో పక్క గుబులు రేపుతోంది. ఈ నిర్ణయం అర్హులైన రైతుల్లో మోదం, అనర్హుల్లో ఖేదం కలిగిస్తోంది. సాగేతర భూముల యజమానులను రైతు భరోసా జాబితా నుంచి తొలగిస్తే పెట్టుబడి సాయం పొందేవారి సంఖ్య చాలా వరకు తగ్గే అవకాశాలున్నాయి. దీంతో ప్రభుత్వానిక ఆర్థిక భారం కూడా తగ్గుతుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో జనవరి 26వ తేదీ నుంచి సాగు యోగ్యమైన భూములకు మాత్రమే సాయం అందించాలనే నిర్ణయాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో సాగు యోగ్యమైన భూముల గుర్తింపు ఏ విధంగా జరుగుతుందోనని రైతుల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ వర్గాల మౌఖిక ఆదేశాలతో వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

మొదలైన కసరత్తు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు సాయాన్ని ఎడాపెడా అందచేశారు. భూములున్న ప్రతీవారికి సాయం అందింది. గత ప్రభుత్వం 2023-24 వానా కాలం సీజన్‌లో రైతు బంధు పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 1,50,000 మంది రైతులకు చెందిన భూములకు రూ.150కోట్లు, యాసంగి సీజన్‌లో రూ.148 కోట్ల పెట్టుబడి సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ఇందులో వ్యవసాయేతర భూములతోపాటు నివాస స్థలాలకు సైతం రైతుబంధు వర్తింపజేసిందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశమున్నట్లు అధికారవర్గాలుపేర్కొంటు న్నాయి. దీంతో సాగేతర భూములు గుర్తించేందు కు జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

కార్యాచరణ

గ్రామసభల్లో రైతు భరోసా లబ్ధిదారులు, సాగు భూముల వివరాలు వెల్లడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ, నీటి పారుదల, పురపాలక, ఆర్అండ్‌బీ శాఖల సంయుక్త కార్యాచరణతోనే వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయానికి వచ్చింది. ఈ శాఖల ఆధీనంలోని భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలను సిద్ధం చేసుకుంటున్నారు.

మిగతా 8వ పేజీలో..

ఈ భూములకు వర్తించదు

రాళ్ల రప్పలు, కొండలు, గుట్టలు, స్థిరాస్తి వెంచర్లు, నివాస, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు ఉపయోగించే భూములు, నాలా మార్పిడీ చేసినవి, వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం సేకరించిన, వ్యవసాయ యోగ్యం కాని భూములకు రైతు భరోసా వర్తించదు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా సమాచారం సేకరించనున్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు, స్థిరాస్తి భూములు, ప్రభుత్వం సేకరించిన భూములకు సైతం రైతు బంధు అందడంతో కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయి. ఈసారి ఆ పరిస్థితి ఉండబోవటం లేదు. రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం సాగులో లేని భూముల లెక్కతేల్చేందుకు సర్వే, శాటిలైట్ మ్యాపింగ్‌ను ఆధారం చేసుకోనున్నది. ఈ కారణంగా జిల్లాలోని మండలాల్లో సాగులో ఉన్నవి లేనివి తేటతెల్లం అవుతాయి. దీనితో పాటు రైతు భరోసా వర్తింప చేయాలంటే తమ భూములు సాగుకు యోగ్యమైనవని, సాగులో ఉన్నాయని రైతుల నుంచి ప్రమాణ పత్రాలను (అఫిడవిట్) కూడా ప్రభుత్వం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రైతు భరోసా ఏ భూములకు రాదో వివరించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామ సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతేకాకుండా రైతు భరోసాకు కొత్తగా ఎలాంటి దరఖాస్తులు చేసుకోవలసిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం ఇచ్చింది.



సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వానం, శేషవస్త్రాలను అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐలోని మల్లన్న జాతరకు రండి..

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

ఐనవోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు రావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో కలిసి ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న జాతర ఉత్సవాల తంతును వివరించారు. ఆహ్వానపత్రికతోపాటు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం బహుకరించి వేద ఆశీర్వచనం అందజేశారు. జాతర ఆహ్వానంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఈవో తెలిపారు. అంతకు ముందు మంత్రి సురేఖను బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో కలిసి జాతర ఆహ్వానపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. సీఎం, మంత్రిని కలిసినవారిలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌గౌడ్, నాయకులు, అర్చకులు ఉన్నారు.

కోర్కెలు తీర్చే.. కోరమీసాల స్వామి

- బ్రహ్మోత్సవాలకు కొత్తకొండ ఆలయం ముస్తాబు
- రేపు వీరభద్రస్వామి కల్యాణం
- హాజరు కానున్న మంత్రి పొన్నం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

7



ఇత్తడి తాపడంతో మెరిసిపోతున్న వీరభద్రస్వామి మూలవిరాట్

బల్దియాకు నిధులొచ్చాయ్..

రూ.173 కోట్లు విడుదల చేస్తూ సర్కారు ఉత్తర్వులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు స్టాంప్ డ్యూటీ నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఆయా మున్సిపాలిటీల ట్రెజరీలలో నిధులను జమ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు జనరల్ ఫండ్ కింద రూ.173కోట్ల స్టాంప్ డ్యూటీ నిధులను విడుదల చేస్తూ ఆదేశాలు అందాయని బల్దియా అధికారులు వెల్లడించారు. అయితే 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో బల్దియాకు సంబంధించిన ఉద్యోగుల జీతాలు, కరెంటు చార్జీలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఐటీ, జీఎస్టీ బిల్లుల చెల్లింపులు జరపాలని మార్గదర్శకాలు సూచించారు. ఈ నిధులను ట్రెజరీ నుంచి విడతల వారిగా తీసుకుని ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖర్చు చేయనున్నట్లు బల్దియా అకౌంట్స్ అధికారి సరిత వెల్లడించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య, వేదికపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నాణ్యమైన విద్య అందించడమే సర్కారు లక్ష్యం

వరంగల్ ఎంపీ కడియం కావ్య

మామునూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం ఆమె బొల్లికుంట జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎంపీ కావ్య మాట్లాడతూ.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, మెరుగైన సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం, అల్పాహారం, దుస్తులు, పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న సద్గురు సేవా సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు పసునూరి వేణుగోపాల్, సమన్వయ కమిటీ సభ్యులు వి.రాజు, టి.కృష్ణ, ఎం.డి.జానీ, బట్టిమేకల భరత్, ఆకుల మధు, సిరికొండ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట సబ్‌డివిజన్ పోలీసు అధికారులకు సూచనలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

- పోలీసు అధికారులతో సీపీ అంబర్‌కిషోర్‌ఝా
- నర్సంపేట ఏసీపీ కార్యాలయం తనిఖీ

నర్సంపేట టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగే నేర సంఘటనలపై సంబంధిత స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం సీపీ నర్సంపేట ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు ఏసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులు, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు తీరును ఏసీపీ కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్టీ, ఎస్సీ కేసులు, ఇతర గ్రేవ్ కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మావోయిస్టు ప్రాబల్యంపై సీపీ ఆరా తీశారు. అనంతరం పోలీసు అధికారులతో సీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌తో పాటు బ్యాంకులు, ఇతర ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. నేరాల కట్టడికి మరింత శ్రమించాలని, చట్టాలను అతిక్రమించేవారిని వదలవద్దని, సమాజంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ఆదేశించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, ఓపిక, సహనంతో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను పరిశీలించాలని సూచించారు. కార్యాలయం ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి సీపీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ట్రైనీ ఐపీఎస్ మానాన్‌భట్, సీఐలు జి.రమణమూర్తి, సాయిరమణ, చంద్రమోహన్, ఎస్సైలు అరుణ్, రవికుమార్, మహేందర్, గోవర్ధన్, రాజేష్‌రెడ్డి, రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

వీసీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ప్రజాభవన్‌లో మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి డిప్యూటీ సీఎం జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఐదేళ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ క్రమంలో మహిళలకు పెద్దఎత్తున



వీసీలో పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు

వడ్డీలేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన 150 ఎకరాలలో ఇప్పటివరకు 75 ఎకరాలు గుర్తించి సంయుక్త తనిఖీ చేశామని, దీనికి సంబంధించి ఎస్‌హెచ్‌జీలను గుర్తించామన్నారు. మిగిలిన 75ఎకరాలు ఈ నెల 22వ తేదీలోపు జాయింట్ ఇన్స్‌పెక్షన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా ఫారెస్టు అధికారి లావణ్య, డీఆర్‌డీవో మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో మూడు ప్రాంతాల్లో 31 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించామని తెలిపారు. 55 ఎకరాల భూమిని గుర్తించి సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నామని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెల 20లోగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

పీహెచ్‌సీలపై కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, జనవరి8(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలను ఈ నెలలో కనీసం రెండు ఎక్కువ అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రావీణ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఎవరైతే తమ లక్ష్యాన్ని పూర్తిగా అందుకోలేదో.. వారు మార్చి వరకు 100శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ముఖ్యంగా ప్రతీ పీహెచ్‌సీలో నెలకు ఒక సాధారణ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని, 24గంటలు పీహెచ్‌సీలు పూర్తిస్థాయిలో పని చేయాలన్నారు. సాధారణ ప్రసవాలు రెగ్యులర్‌గా నిర్వహించాలని, ఈ నెలలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాలను రెండు శాతం అదనంగా జరిగేలా డాక్టర్లు కృషి చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, ఎంటీపీ చట్టం నియమానికి వ్యతిరేకంగా అబార్షన్లు నిర్వహించే వారి గురించి ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్‌లో ఫిర్యాదు పెట్టే ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్‌మోహన్‌రావు, డాక్టర్ కె.లలితాదేవితో పాటు తదితర డాక్టర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 8: (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు అత్యంత పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఇళ్లులేని వారిని, అత్యంత నిరుపేదలను గుర్తించి గ్రామ, వార్డు సభలలో చర్చించి ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పెండింగ్‌లో ఉన్న వాటిని, గ్రామాల్లో లేని వారిని పిలిపించి వివరాలు సేకరించి సర్వే పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని దూపకుంట, పైడిపల్లి, రాయపర్తి, తిమ్మాపూర్‌లలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రావిరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అత్తాకోడళ్లు.. అందరూ దొంగలే..

- ఇనుప సామాన్లు ఏరుకునే ముసుగులో చోరీలు
- అరెస్టు చేసి రూ.8లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, ఇనుప సామాను ముసుగులో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన అత్తా సహా ఇద్దరు కోడళ్లను అరెస్టు చేసి వారి వద్ద రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బుధవారం కేయూ పోలీసు స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, సీసీఎస్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి ఏసీపీ వివరాలను వెల్లడించారు. వరంగల్ శివనగర్ ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన అత్త కడమంచి లచ్చమ్మ, ఇద్దరు కోడళ్లు తూర్పాటి రాజీమేరీ, పర్వతం కనకలక్ష్మీలు అనే ముగ్గురు మహిళలు ఇళ్ల పరిసరాల్లో పాత ఇనుప సామాను ఏరుకుంటూ వచ్చే ఆదాయం సరిపోక జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

పాల్పడుతున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అత్తా కోడళ్లతో కలిసి భీమారం, గోపాల్‌పూర్, విజయనగర్ కాలనీ ఏరియాలో ఇనుప సామాన్లు ఏరుకుంటూ ఇంటికి తాళం వేసిన ఇండ్లను గుర్తించి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దొంగతనాలు చేస్తున్నారు. 2024 డిసెంబరు 31వ తేదీన భీమారం విజయనగర్ కాలనీలో సయ్యద్ ఆసిఫ్ అనే వ్యక్తి వారి కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వేరే ఊరుకు వెళ్లారు. దీంతో అత్త ఇంటి బయట కాపలా ఉండి తన ఇద్దరు కోడళ్లతో కలిసి తాళం పగులగొట్టి ఇంట్లోకి పంపించి ఇంట్లో ఉన్న పదిహేడున్నర తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.బాలాజీ వరప్రసాద్ రెండు బృందాలుగా ఏర్పడి సీసీ టీవీ ఫుటేజీల

(మిగతా 8వ పేజీలో)

ఐనవోలు జాతరపై నిర్లక్ష్యం

- ఏర్పాట్లను మరిచిన మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు
- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

ఐనవోలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు ఏర్పాట్లను కల్పించడంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ విమర్శించారు. ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో జాతర ఏర్పాట్లను బుధవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, బీజేపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐనవోలు జాతర ఉత్సవాలు 12వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా ఇప్పటికి స్నానపు గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మహిళలకు డ్రెస్సింగ్ రూముల ఏర్పాట్లు, ఆలయానికి రంగులు వేయడం ఇంకా పూర్తిస్థాయిలో జరుగలేదన్నారు. నెల ముందు సమీక్ష నిర్వహించి పనులు పూర్తిచేయాల్సి ఉండగా.. ఎమ్మెల్యే కేవలం 4 రోజుల ముందు సమీక్ష నిర్వహించడం ఆలయ చరిత్రలో ఎప్పుడు ఇలా జరుగలేదన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా వాస్తవ్యులై ఉండి పట్టించుకోకపోవడం వెనుకాల మతలబు ఏమిటో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. జాతర ఏర్పాట్ల నిర్లక్ష్యానికి మంత్రి, ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలన్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డును సకాలంలో నియమించుకొని జాతరలో వసతులను కల్పించుకోవాల్సి ఉండగా నేటికీ ట్రస్టుబోర్డు ఊసే లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గుడి అంటే తనకు ఇష్టముండదని గతంలో బహిరంగంగా చెప్పిన ఎమ్మెల్యే అందుకే జాతరను పట్టించుకోకుండా వదిలేసినట్లు ఉందని ఆరోపించారు. జాతర సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ మంత్రి సురేఖ జాతరపై శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుండేకారి కోటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎ.రాజేంద్రప్రసాద్, జిల్లా, మండల నాయకులు మహేష్‌గౌడ్, వెంకటనారాయణ, పాక కుమారస్వామి, మాదాసు ప్రణయ్, ప్రభాకర్, భాస్కర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్, ముత్తిరెడ్డి కేశవరెడ్డిలు

పోలీసులతో ఘర్షణ

ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ప్రయత్నించగా ఎస్సై పస్తం శ్రీనివాస్ వద్దని వారించగా ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తాను మాజీ ఎమ్మెల్యేను, పైగా స్థానికుడినని, రాజకీయం చేయడానికి రాలేదు.. భక్తుల సౌకర్యార్థం ఇక్కడికి వచ్చానని, తాను ఇక్కడే మాట్లాడుతానని వాదించారు. కొద్ది నిమిషాల తర్వాత విలేఖరులు కలుగచేసుకోవడంతో ఆలయం బయటికి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడారు. ఆలయ ద్వారానికి కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఉండగా బీజేపీ నాయకులు ఇది ఏంటని ఎస్సైని ప్రశ్నించారు. అందరికీ ఒకే నిబంధనలు వర్తించాలని, సత్వరమే ఫ్లెక్సీలు తొలగించాలని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఎస్సైలను మాజీ ఎమ్మెల్యే కోరారు.

మెడికల్ షాపులో సోదాలు

వరంగల్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిషేధిత మందులను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు కమిషనరేట్ యాంటీ డ్రగ్స్ టీం పోలీసులు, డ్రగ్ కంట్రోల్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో వరంగల్ పోస్టాఫీస్ ఏరియాలోని గుడ్ హెల్త్ మెడికల్ షాపులో బుధవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ నిషేధిత మత్తు టాబ్లెట్లను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నారని తేలడంతో మందులను స్వాధీనం చేసుకొని తదుపరి దర్యాప్తు కోసం మెడికల్ షాప నిర్వాహకుడిని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్ టీం ఇన్స్‌పెక్టర్ సురేశ్, ఆర్ఐ శివకేశవులు, వరంగల్ డ్రగ్ కంట్రోల్ ఇన్స్‌పెక్టర్ అరవింద్ కుమార్, ఆర్ఎస్సై పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న డ్రగ్ కంట్రోల్ బృందం

యువత మత్తుకు బానిస కావొద్దు

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

శంభునిపేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. బుధవారం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్, నెహ్రూ యువ కేంద్రం వరంగల్ వారి ఆధ్వర్యంలో బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. డ్రగ్స్‌తో వ్యక్తులే కాకుండా కుటుంబాలు నాశనమవుతాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, మానసిక స్థిరత్వం కోల్పోతారని, నేర ప్రవృత్తి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. యువత క్షణిక ఆనందంకోసం నిండు జీవితాన్ని బలి చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా నార్కోటిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రవీందర్, సురేశ్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాలు ఎక్కడ కనిపించినా, ఎవరైనా సేవించినా వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1933, 100కు డయల్‌కు చేయాలని నార్కోటిక్ విభాగం డీఎస్పీ సైదులు సూచించారు. నెహ్రూ కేంద్రం, జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డిపార్టుమెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రవీందర్, డాక్టర్ భరత్ కుమార్, పబ్లిక్ సిటీ ఆఫీసర్ సూరనేని శ్రీధర్, వాగ్దేవి కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ, వై.భాస్కర్‌రావు, మురళి, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

- దిక్కులేని వారైన ఇద్దరు కుమారులు



లత మృతదేహాన్ని రాజు ఇంటికి తీసుకెళ్తుండగా చర్చిస్తున్న ఎస్సై, సిబ్బంది

ఐనవోలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకోగా.. ఇద్దరు పిల్లలు అనాథలైన సంఘటన మొల్కలగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన గుండెకారి లత(35) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. లత భర్త నాగరాజు మూడేళ్ల కిందట మూర్చ వ్యాధితో వరిపొలంలో పడి మృతిచెందాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు శశిధర్ 6వ తరగతి, శశివర్ధన్ 4వ తరగతి చదువుతున్నారు. భర్త మృతిచెందాక తమకున్న వ్యవసాయ భూమిని సాగుచేస్తూ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ ఇద్దరు కుమారులను చదివించుకుంటోంది. వీరి పాలివారైన గుండెకారి రాజు గృహం సమీపంలోనే ఉంటోంది. రాజు భార్య రజిత తన భర్తతో వివాహేతన సంబంధం పెట్టుకున్నావని లతను దూషించేంది. దీంతో లత పెద్దమనుషులకు మొరపెట్టుకోగా రజితను వారించారు. వారం కిందట వెంకటాపురం పుట్టింటికి వెళ్లి వచ్చిన లతను రజిత మళ్లీ తిట్టడంతో మనస్థాపానికి గురైంది. ఐనవోలుకు వెళ్లి పురుగుల మందు తెచ్చుకొని మధ్యాహ్నం తాగింది. అనంతరం అత్త లక్ష్మిబాయికి మందుతాగానని చెప్పింది. ఇరుగు పొరుగు వారు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా మృతిచెందింది.

కాగా, లత మృతదేహాన్ని రాజు - రజితల ఇంటి ఎదుట వేయడానికి బంధువులు కొద్ది దూరం తీసుకెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో చిన్న పిల్లలకు దిక్కెవరని, వీరు ఎలా బతకాలి..? ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై బాధిత కుటుంబసభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా మహిళలు ససేమిరా అన్నారు. చివరగా కుటుంబ సభ్యులను శాంతింపచేసి మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఎంజీఎంకు తరలించారు. మృతురాలి తండ్రి సండ్ర రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. కాగా, పెద్ద కుమారుడు శశిధర్ హాస్టల్లో చదువుకుంటుండగా, చిన్న కుమారుడు స్థానిక స్కూల్లో చదువుకుంటున్నాడు. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

పెరిగిన వ్యవసాయ సర్వీసు కనెక్షన్లు

- రైతుల సంక్షేమం కోసం యుద్ధ ప్రాతిపదికన మంజూరు
- వరంగల్, హనుమకొండ ఎస్ఈలు పి.మధుసూదన్, వెంకటరమణ

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ అవలంబిస్తూ యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ సర్వీసులు మంజూరు చేస్తున్నామని వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. 2024లో 1,409 సర్వీసులను మంజూరు చేశామని, దానిలో ఒక్క డిసెంబరు నెలలోనే 159 సర్వీసులు మంజూరు చేశామన్నారు. 2023తో పోల్చుకుంటే సుమారుగా 21.9 శాతం సర్వీసుల మంజూరు పెరిగిందన్నారు. వ్యవసాయ సర్వీసుల మంజూరుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటూ త్వరితగతిన విడుదల చేస్తున్నామన్నారు. రైతుల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సర్వీసుల మంజూరు విషయంలో పెద్దపీట వేస్తున్నామన్నారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా దరఖాస్తుల పెండింగ్, కారణాలు తెలుసుకునే వెసలుబాటు ఉందన్నారు. ఈ-స్టోర్ ప్రవేశపెట్టడం ద్వారా ఆన్‌లైన్‌లో మెటీరియల్‌ను రిజర్వు చేసుకొని కావాల్సి సమయంలో తీసుకొని వెంటనే పనులు ప్రారంభించుకోవచ్చన్నారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం ఉండటం విద్యుత్ శాఖతో పాటు రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఒక పనికి సంబంధించిన మెటీరియల్ మిగిలితే వేరే పనికి మార్చుకునే వెసులుబాటు అంతా ఆన్‌లైన్‌లోకి మార్చామన్నారు. ఈ పద్ధతి ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసే విద్యుత్ అధికారులకు ఎంతగానో సమయం ఆదా అవుతుందన్నారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువయ్యేందుకు పొలంబాట కార్యక్రమం చేపట్టామన్నారు.

హనుమకొండ సర్కిల్‌లో..

హనుమకొండ సర్కిల్ పరిధిలో గత ఏడాదిలో 1,390 వ్యవసాయ సర్వీసులు మంజూరు చేశామని ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. ఒక్క డిసెంబర్ నెలలోనే 188 సర్వీసులు మంజూరు చేశామన్నారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే 2024లో 20 శాతం సర్వీసులు పెరిగాయని అన్నారు. రైతులకు వ్యవసాయ సర్వీసులు మంజూరు చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు.

ప్రతీ ఎకరానికి సాగు నీరందించడమే లక్ష్యం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ద్వారా సాగునీటి కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్న రైతుల చిరకాల ఆకాంక్ష నెరవేర్చడానికి ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఈ ప్రాజెక్టును రూపొందించడం జరిగిందని, ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ఆయకట్టు అభివృద్ధి జరుగక పోవడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయామన్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా నీరు విడుదలతో రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాల్లోని కాలువలు పూర్తయిన పలు గ్రామాలకు సాగునీరు అందించడంతో పాటు కాలువలు పూర్తికాని దగ్గర రెండు మండలాల్లో కలిపి 30 చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపి సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరుఅందించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. పూర్తికాని కాలువలకు సంబంధించి భూసేకరణ సమస్యను పరిష్కరించి పూర్తిస్థాయిలో కాలువలను తవ్వించి వచ్చే వానాకాలంలో రెండు మండలాల రైతాంగానికి రెండో పంటకు సరిపోను సాగునీరు అందించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మాసాన్‌పల్లి లింగాజీ, ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈలు వినయ్‌బాబు, ప్రవీణ్, డీఈ రామకృష్ణ, ఏఈలు భాస్కర్, శ్యాంసుందర్,సింధు, మాజీజడ్పీటీసీలు బొల్లం అజయ్ మణికంఠ, గుడి వంశీధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోనాసి క్రాంతి కుమార్, మేకల నరేందర్ పాల్గొన్నారు.



అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మొసళ్ల గుర్తింపునకు జియోట్యాగింగ్ సర్వే

- పాకాలలో రెండు రోజుల పాటు కొనసాగిన ప్రక్రియ

ఖానాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఖానాపురం మండలంలోని పాకాల సరస్సులో మొసళ్లను గుర్తించడానికి జూలాజికల్ సర్వేఆఫ్ ఇండియా(జడ్ఎస్ఐ) శాస్త్రవేత్తలు జియోట్యాగింగ్ సర్వే చేపట్టారు. రెండు రోజులుగా డాక్టర్ ప్రత్యూష్, డాక్టర్ శ్రీకాంత్ జాదవ్ స్థానిక అటవీ శాఖ అధికారులతో కలిసి సరస్సు చుట్టూ బోట్‌పై విహరిస్తూ మొసళ్ల సంచారం కోసం అన్వేషించారు. మొసళ్లు సంచరించిన అనవాళ్లను గుర్తించారు. సరస్సులో మొసళ్లు ఎక్కడెక్కడ కనిపిస్తాయనే విషయాలను పర్యాటకులను, అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జడ్ఎస్ఐ అధికారులు సేకరించిన నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నారు. అయితే ఈ సర్వే బుధవారం ముగిసింది. ఈసందర్భంగా ఎఫ్ఆర్వో రవికిరణ్ మాట్లాడుతూ జీవవైవిధ్యానికి నిలయమైన పాకాల అభయారణ్యంలోని జంతు జాతులను, పక్షులను, మొసళ్లను గుర్తించటానికి ఏటా నిర్వహించే సర్వేలో భాగంగానే జడ్ఎస్ఐ అధికారులు సర్వే చేపట్టామన్నారు. అధికారులు సేకరించిన నివేదికలు రాగానే పాకాలలో ఉన్న జంతు జాతులు, పక్షులు, మొసళ్ల వివరాలను వెల్లడిస్తామన్నారు.



పాకాల సరస్సులో బోట్‌పై వెళ్తున్న జూలాజికల్ సర్వే అధికారులు

17న 'పాటల పల్లకిలో 12 గంటలు'

- టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న చక్రాల రఘు, నేర్నాల కిశోర్

వడ్డెపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఈనెల 17న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు, ఉద్యమ కవి, ప్రముఖ గాయకుడు నేర్నాల కిశోర్‌లు తెలిపారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో గోసిపెట్టి, గొంగడేసి, గళమెత్తి ధూం ధాం ద్వారా గర్జించి పాడిన ఉద్యమ కళాకారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. వేలాది మంది ఉద్యమకళాకారుల త్యాగఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో సాంస్కృతిక సారథి పేరుతో కేవలం 550 మంది తమ అనుయాయులకు ఉద్యోగావకాశాలు కల్పించి మిగతా వారిని విస్మరించిందని విమర్శించారు. ఈనెల 17న నిర్వహించిన పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్కతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో టీపీసీసీ సాంస్కృతిక సేన వరంగల్ , హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గడ్డం సుధాకర్, పాలాటి రాజు, గజవెల్లి ప్రతాప్, మోటె రమేష్, బుల్లెట్ వెంకన్న, కోండ్ర కుమార్, గడ్డం గోవర్ధన్, మాటేటి కవిత, భవాని, భానోత్ నర్మద, బిర్రు సురేందర్, జన్ను యుగందర్, మందుల స్వప్న, ఎర్రాల స్వప్న, బొజ్జం కల్పన, గడ్డం రాజశేఖర్, మడిపెల్లి కట్టయ్య, జోగు రాజు, జన్ను రంజిత్ పాల్గొన్నారు.

కేయూలో కొత్త బీవోఎస్‌ల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



కరుణాకర్‌రావు, శ్రీనివాసులు, మహేందర్

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో బాటనీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్ఆర్ఎం, ఇంజనీరింగ్ ఈసీఈ, ఈ అండ్ ఐ విభాగాలకు నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లను (బీవోఎస్) నియమిస్తూ బుధవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బీవోఎస్‌గా డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, బాటనీ విభాగం బీవోఎస్‌గా డాక్టర్ పి.కరుణాకర్ రావు, ఇంజనీరింగ్ ఈసీఈ, ఈఅండ్ఐ విభాగం బీవోఎస్‌గా డాక్టర్ వి.మహేందర్‌లను నియమించారు. నూతన బీవోఎస్ చైర్మన్లు బుధవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు ఉత్తర్వులను అందుకున్నారు.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి

కాజీపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన కిషోర్‌కుమార్ మెరజారి (47) కాజీపేట ప్రశాంత్‌నగర్ వద్ద ఓ అపార్ట్‌మెంటలో కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం అపార్ట్‌మెంట్ పైన పనిచేస్తుండగా పైనుంచి కిందపడ్డాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి బంధువులు మధ్యప్రదేశ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పర్యాటక పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- సమీక్షలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాల్కూరికి సోమనాథుడు, బమ్మెర పోతన, వల్మిడిలోని వాల్మీకి ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తి మండలంలోని చెన్నూరులో పురాతన శివాలయంతో పాటు దేవరుప్పల మండలం కడవెండి శివారులోని వానకొండయ్య దేవాలయం అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ఆలయాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. దేవాలయాల్లో దూప దీప నైవేద్యాలతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఆలయాల్లో పారిశుద్య నిర్వహణలో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవరుప్పల మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఉన్న వల్మిడి దేవస్థానానికి సబంధించిన వ్యవసాయ భూములు కబ్జాకు గురవుతున్నాయని తన దృష్టికి వచ్చిందని అన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే ఆట్టి భూములు దేవస్థానానికి దక్కేలా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని ఈ నెలలో తనిఖీ చేపడుతానని అన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. గత 15ఏళ్ల నుంచి దేవాలయంలో కొబ్బరికాయల కాంట్రాక్టర్లు టెండర్ డబ్బులు చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని నెల రోజుల్లో బకాయిలు చెల్లించలేకపోతే వారి ఆస్తులను జప్తు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్యా మంజుల, భాస్కర్, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పాల్గొన్నారు.



వల్మిడిలో చేపట్టే అభివృద్ధి పనులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వివరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2560	2045
పల్లికాయ (సూక)	6610	5600
పల్లికాయ (పచ్చిది)	4750	4500
కందులు	7186	5560
పెసళ్లు	7013	4000
పత్తి	7165	5800
పసుపు (కాడి)	11506	10235
పసుపు (గోల)	11609	10432
తేజ మిర్చి	14900	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	14000	13000
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్341ఏసీ	14000	11000
యూఎస్341	14000	12500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

గొంతెమ్మ గుట్ట.. ప్రకృతి అందాల పుట్ట

ఓవైపు ఆధ్యాత్మికం, మరోవైపు రమణీయత

కనువిందు చేస్తున్న శివలింగం, శ్రీకృష్ణుడి పాదాలు

- సజీవ సాక్ష్యాలుగా కాకతీయుల కాలం నాటి ఆనవాళ్లు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు

చరిత్ర



గుట్టపై పెద్ద రాయి కింద నిర్మించిన ఆలయం



గుట్టపై ఉన్న గుడిలో శివ లింగం



గుట్టపై ఉన్న శ్రీకృష్ణుడి పాదాలు

కాటారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ప్రకృతి రమణీయత ఉట్టిపడే పచ్చని అడవులు, గలగల పారే సెలయేళ్లు.. మరో వైపు ఆధ్యాత్మికతకు మారుపేరుగా నిలిచిన శతాబ్దాల నాటి శివలింగం, శ్రీకృష్ణుడి పాదాలు. ఇంకో వైపు కాకతీయుల కా లం నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా పలు నిర్మాణాలు..పెరసి పచ్చని అడవుల్లో మంత్ర ముగ్ధులను చేసే ప్రకృతి సోయగాలతో అబ్బురపరుస్తున్న గొంతెమ్మ గుట్ట అందాలు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రతాపగిరి అడవుల్లో నెలకొన్న చారిత్రక, ఆధ్యాత్మిక ఆనవాళ్లు. ద్వాపరయుగంలో కుంతీదేవి వరాలు పొందడానికి గుట్టపై శివుని కోసం తపస్సు చేసినట్లు, అంతే కాకుండా శ్రీకృష్ణుడు, సుభద్రలు కుంతీదేవిని ఇక్కడే కలిసి ఆమెతో పాటు చాలా రోజులు నివాసం ఉన్నట్లు ప్రతీతి.. దీంతోనే కుంతీదేవి గుట్ట కాస్తా కాలక్రమేణ వాడుకలో గొంతెమ్మ గుట్టగా ప్రసిద్ధి పొందినట్లు పెద్దలు చెప్తున్నారు. అంతే కాకుండా ఇప్పటికీ సరైన వర్షాలు కురవనప్పుడు చుట్టు పక్కల 10గ్రామాలకు చెందిన ప్రజలు డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, లక్ష్మీదేవర విన్యాసాలతో గుట్టపైకి వెళ్లి పూజలు చేస్తే వర్షాలు కురుస్తాయని ప్రజల నమ్మకం. అలాగే 14వ శతాబ్దంలో మొఘల్ సేనల దాడి నుంచి తప్పించుకొని వస్తూ గొంతెమ్మ గుట్టతో పాటు పక్కనే కిలోమీటర్ దూరంలో ఉన్న మరో పెద్ద గుట్టపై కాకతీయ వంశ రాజు ప్రతాపరుద్రుడు తన సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. దీనికి రుజువుగా గుట్టపై పలు నిర్మాణాలున్నాయి.

జాతీయ రహదారికి దగ్గరలోనే గొంతెమ్మ గుట్ట

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రతాపగిరి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న గుట్టనే గొంతెమ్మ గుట్టగా పిలుస్తారు. 353(సీ)జాతీయ రహదారి నుంచి సుమారు 10కిలోమీటర్ల దూరంలోనే ఉంది. కాటారం నుంచి ప్రతాపగిరి వరకు 7కిలోమీటర్ల మేర తారు రోడ్డు ఉండగా 3 కిలోమీటర్లు అడవిలో బండ్ల బాట మీదుగా సాగి గుట్టపైకి చేరుకోవచ్చు. ప్రకృతి అందాల మధ్య సుమారు 250మీటర్ల ఎత్తులో గొంతెమ్మ గుట్ట ఉంది. గుట్టపైకి వెళ్లేందుకు మూడు ప్రధాన ద్వారాలున్నాయి. గుప్తనిధుల వేటగాళ్లతో గుట్టపై ఉన్న ద్వారాలు, ఇతర చారిత్రిక సంపద ధ్వంసమైనప్పటికీ.. చరిత్ర సజీవ సాక్ష్యాలుగా పలు ఆనవాళ్లు మిగిలే ఉన్నాయి.

కృష్ణుడి పాదముద్రలు నయనానందకరం

గుట్టపై పెద్ద బండ సొరికెలో అలనాటివిగా చెప్పుకొనే శ్రీకృష్ణుడి పాదముద్రలు, కుంతీ దేవి పూజించినట్లు చెప్పే ప్రాచీన శివ లింగం దర్శనమిస్తాయి. కృష్ణుడి పాదాలను, శివలింగాన్ని భక్తులు నయనాందకరంగా దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. పెద్ద బండ రాయి కింద చిన్నపాటి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంపైన పద్మం ఆకారంలో రాయిని చెక్కించారు.

శత్రు దుర్భేద్యంగా పెద్ద బండలతో ప్రహరీ

గొంతెమ్మ గుట్టపై కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు రక్షణ కోసం శత్రు దుర్భేద్యమైన పెద్ద పెద్ద రాళ్లతో ప్రహరీని నిర్మింపజేశాడు. సైనిక అవసరాల కోసం గుట్టపై స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లున్నాయి. గుట్టపైకి చేరుకోవాలంటే మూడంచెల్లో ఉన్న ద్వారాలను దాటి వెళ్లాలి. సైన్యం స్నానాలు, ఇతర నీటి అవసరాల కోసం గుట్టపైనే పెద్ద కొలనును ఏర్పాటు చేశారు. గుట్ట పైనుంచి ఇతర ప్రాంతాలకు పెద్ద సొరంగమార్గం ఉంది. గుట్టపై గుప్త నిధులున్నాయనే అపోహతో పలు చోట్ల దుండగులు ధ్వంసం చేశారు. దీంతో చరిత్ర ఆనవాళ్లు కొంత మేర దెబ్బతిన్నాయి. ఓ వైపు ఆధ్యాత్మికత.. మరో వైపు ప్రకృతి రమణీయత.. ఇంకో వైపు కాకతీయుల నాటి ఆనవాళ్లు, చారిత్రక సంపద ఉన్న గొంతెమ్మ గుట్టను ప్రభుత్వం గుర్తించి పర్యాటకంగా కేంద్రంగా చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రకృతి అందాల మధ్య, మనసును పులకింపజేసేలా అబ్బురపరుస్తున్న గొంతెమ్మ గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దితే చారిత్రక సంపదను పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించినట్లవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

విశిష్టత కలిగిన కొలనుగుంట నీరు

గుట్టపై భక్తితో పూజించి ధ్వని చేస్తే వేసవికాలంలో కూడా కొంచెం నీటి ఊట కనిపించే కొల్లుగుంట (కొలను గుంట)గా ప్రసిద్ధి చెందిన నీటి ఊట ఉంది. పరిసర ప్రాంతాల ప్రజలు తమ పంటలకు చీడపీడలు ఆశించినప్పుడు ఎంతో విశిష్టత కలిగిన గుంటలోని నీటిని తీసుకొని వెళ్లి చీడపీడలు సోకిన పంటలపై చల్లడం ఆనవాయితీగా వస్తోంది. అంతే కాకుండా పాండవ దేవుళ్లను కొలిచే భేరి(వేదిక)ఉంది. ప్రతీ శ్రావణమాసంలో వివిధ ప్రాంతాల లక్ష్మీదేవరలు, శివసత్తులు, పాండవదేవుళ్లు గుట్టపై చేరి అక్కడే బోనాలు సమర్పించి మొక్కులు సమర్పిస్తుంటారు. నాయకపోడ్ కులస్థుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవర జాతర మూడు రోజుల పాటు ప్రతీ ఏటా పెద్దఎత్తున జరుగుతుండగా వేలాది మంది భక్తులు హాజరవుతారు. వర్షాభావ సమయంలో కాటారం మండలంతో పాటు మహదేవ్‌పూర్, మహముత్తారం మండలాల ప్రజలు డప్పు చప్పుళ్లతో గుట్టపైకి చేరుకొని వర్షాలు సమృద్ధిగా కురవాలని గొంతెమ్మను మొక్కడం ఆనవాయితీగా వస్తోంది.



గుట్టపై భారీ రాళ్లతో నిర్మించిన గోడ



గుట్టపై కాకతీయుల కాలం నాటి ప్రహరీ



సొరంగ మార్గం



కొండపర్తి గ్రామం వ్యూ

మారనున్న కొండపర్తి రూపు

- గవర్నర్ దత్తత గ్రామంలో పలు పనులకు శ్రీకారం
- మారుమూల ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ

మేడారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామ రూపురేఖలు మారబోతున్నాయి. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పంచాయితీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచనల మేరకు ఈ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్న నేపథ్యంలో ఈ గ్రామానికి కావల్సిన మౌలిక సదుపాయాలు, ప్రజల అభివృద్ధికి కావల్సిన పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా టైలరింగ్, కుట్టు మిషన్ల పరిశ్రమ, పకృతి సిద్ధ తాత్కలిక ప్లేట్ల తయారీ, సానిటరీ ప్యాడ్స్ ప్యాకింగ్, పప్పు దినుసులు మసాలాల ప్యాకింగ్, మార్కెటింగ్ స్కిల్ డెవలప్ మెంట్ వంటి పరిశ్రమల ఏర్పాటు లాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ గ్రామంలో మొత్తం 300మంది ఆదివాసీలు జీవిస్తుండగా.. చదువుకున్న యువతీ, యువకులు 50 మంది ఉన్నారు. వారంతా నిరుద్యోగులు కావడంతో ఈ గ్రామాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. అభివృద్ధిలో భాగంగా గ్రామంలో రెండు భారీ షెడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామంలో చీకట్లను తొలగించేలా సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గ్రామంలోని ప్రతి కుటుంబానికి 79 పక్కాఇళ్లు నిర్మించనున్నట్లు అధికారులు తెలుపారు. కలెక్టర్ దివాకర పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతుండగా.. ఆయన గురువారం గ్రామంలో పర్యటించి పనుల పురోగతిని తెలుసుకోనున్నారు. అయితే మండలంలోని మారుమూల గ్రామమైన కొండపర్తి గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకోవడం సంతోషంగా ఉందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మంత్రి సీతక్క చొరవతో వందల ఏళ్ల తరువాత ఆదివాసీల అభివృద్ధి జరుగుతోందన్నారు.



కొండపర్తి గ్రామంలో షెడ్ నిర్మాణాలు

గవర్నర్, సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు : అరెం లచ్చుపటేల్



ఏజెన్సీ మండలమైన తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని ఎన్నుకొని అభివృద్ధి చేస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్కకు మేడారం దేవాదాయ మాజీచైర్మన్ అరె లచ్చుపటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజల జీవితాల్లో కష్టనష్టాలను తొలగించే ప్రయత్నం అభినందనీయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కోర్కెలు తీర్చే.. కోర మీసాలస్వామి

- బ్రహ్మోత్సవాలకు కొత్తకొండ ఆలయం ముస్తాబు
- రేపు వీరభద్రస్వామి కల్యాణం
- హాజరు కానున్న మంత్రి పొన్నం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆధ్యాత్మికం

భీమదేవరపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారమైన కొత్తకొండ వీరన్న జాతరకు వీరభద్రస్వామి ఆలయం ముస్తాబైంది. కొత్తకొండ వీరన్న జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలను సమర్పిస్తూ స్వామి వారి కృపకు భక్తులు పాత్రులవుతారు. భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించేందుకు నెల రోజులుగా అధికారులు పనులు మొదలు పెట్టారు. భక్తులకు ఎక్కడా లోటు పాట్లు కలుగకుండా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆలయ ఈవో కిషన్ రావు యుద్ధ ప్రాతిపదికన పనులను చేయిస్తున్నారు. వైద్యం, మంచినీటి సౌకర్యం, ఆర్టీసీ, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పా ట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులందరి సమష్టి కృషితో జాతరను విజయవంతం చేయాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ చలువ పందిళ్లు, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి.





కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామి వారి కల్యాణంతో శుక్రవారం ప్రారంభమవుతాయి. 11న త్రిశూలార్చన, 12న లక్ష బిల్వార్చన, 13న భోగి పండుగ, 14న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బండ్ల తిరుగుట, 15న కనుమ ఉత్సవం, 16న నాగవల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం, 18న అగ్ని గుండాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. వీరభద్రస్వామి దేవాలయం ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి గా విలసిల్లుతుంది. ఈ ఆలయం శిల్పాలు, విశాల ఆలయ ప్రాంగణంలో ప్రాకార మండపంతో రాజగోపురాలతో అలరాలుతూ ఈశాన్య భాగంలో పుష్కరిణి విశేషంగా ఆకర్షిస్తూ కొండపై భాగంలో సప్త కోనేరులతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిస్తుంది.

అభివృద్ధి పనులు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ జ్ఞాపకార్థం రూ.40 లక్షల వ్యయంతో ధ్యాన మందిరం నిర్మించారు. ప్రస్తుతం ఇదే ధ్యాన మందిరంలో స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్తకొండ కొండపైకి కాలి నడకన వెళ్లేందుకు రహదారి నిర్మాణం జరుగుతోంది. ఇందుకోసం మంత్రి పొన్నం ప్రభాకర్ మొదటి విడతగా రూ.10లక్షల నిధులను కేటాయించారు. పనులు చురుగ్గా సాగుతున్నాయి. దేవాలయం గర్భగుడిలో వీరభద్రస్వామికి ఇత్తడి తాపడం పూర్తి చేశారు. దీంతో ఆలయం గర్భగుడి శోభయామనంగా భక్తులకు వీరభద్రుడు దర్శనవిస్తున్నాడు. ఏసీ కల్యాణ మండపం పూర్తయింది. ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం దేవాదాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రేపు సాయంత్రం కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన వీరభద్రస్వామి కల్యాణం శుక్రవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణం సందర్భంగా గణపతిపూజ, శైవశుద్ధి, పంచగవ్య పాశన, ధ్వజారోహణం, భేరిపూజ నిర్వహిస్తారు. స్వామి వారికి పట్టువస్త్రాలను మంత్రి పొన్నం ప్రభా కర్ సమర్పిస్తారు. అలాగే ముత్యాల తలంబ్రాలను సైతం కల్యాణంలో అందిస్తారు. ఇప్పటికే కల్యాణం జరిగే కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.

జాతరకు విస్తృత ఏర్పాట్లు



కొత్తకొండ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించాం. ఈ సారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేసి అందుకు తగ్గట్లు ఏర్పాట్లు పూర్తి చేశాం. వైద్యం, మంచి నీటి సౌకర్యం కల్పించాం. భక్తుల రద్దీకి తగ్గట్టుగా బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశాం. కరీంనగర్, హనుమకొండ, వరంగల్, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల నుంచి భక్తులను తీసుకువచ్చేందుకు ఆర్టీసీ బస్సులు నడుపిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కిషన్‌రావు, ఆలయ ఈవో, కొత్తకొండ

40 ఇయర్స్.. ఇండస్ట్రీ

- టెన్త్‌లోనే మద్రాస్ రైలెక్కిన శ్యామల గణేష్
- సహాయ నటుడిగా 1986లో తెరంగ్రేటం
- 'ఆహుతి'కి గాను దాసరి చేతులమీదుగా అవార్డు
- 1990లో 'డాక్టర్ భవానీ'తో నిర్మాతగా అడుగులు
- త్వరలో విడుదలకు సిద్ధంగా రెండు సినిమాలు

కళ

వరంగల్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆయనకు సినిమాలంటే అమితమైన ఇష్టం. ఎలాగైనా నటుడిని కావాలన్న తపనతో 50ఏళ్ల క్రితం మద్రాసు రైలెక్కారు. తొలిరోజుల్లో నిరాశే ఎదురైనా.. పట్టు వీడలేదు. ఆ తర్వాత హైదరాబాద్ బాట పట్టి.. అనేక ఇబ్బందులను తట్టుకుని.. ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డారు. వచ్చిన అవకాశాలను మెట్లుగా మలుచుకుని నటుడిగా, నిర్మాతగా, హీరోగా ఎదిగారు. కళలకు కళాకారులకు నిలయమైన ఓరుగల్లు కీర్తి కిరీటంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. సినీ రంగంలో రాణించాలంటే ఎంత కష్టపడాలో తెలిసిన వ్యక్తిగా.. తన వద్దకు వచ్చిన వారిలో ఎంతోమందికి సినిమాల్లో అవకాశాలు కల్పించారు. ఆయనే శ్యామల గణేష్. హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలో పుట్టిపెరిగి.. సుమారు 40ఏళ్ల సినీ రంగంలో రాణించిన ఆయన ప్రస్తుతం వరంగల్‌లో నివాసం ఉంటున్నారు.

త్యాగరాజును చూసి..

1970వ దశకంలో తన ఇంటిపక్కన ఉండే త్యాగరాజు అనే సినీ కళాకారుడు ఉండేవారని, ఆయన హనుమకొండకు వచ్చినప్పుడు ఆయన్ను చూసేందుకు చాలామంది వచ్చేవారని, ఆయన్ను చూసి తనకు కూడా సినిమా ఆర్టిస్టును కావాలనే కుతూహలం మొదలైందన్నారు. అలా తాను 10వ తరగతిలో ఉన్నప్పుడు హీరో కృష్ణ నటించిన మోసగాళ్లకు మోసగాడు విడుదలైందని, అందులో త్యాగరాజు కూడా ఉన్నాడని, దాంతో ఆ సినిమాను వంద సార్లు చూశాని గుర్తుచేసుకున్నారు. ఇక పదో తరగతి పూర్తయ్యాక ఎలాగైనా సినిమాల్లో నటించాలన్న ఆసక్తితో 1976లో మద్రాస్ రైలెక్కి త్యాగరాజు ఇంటికి వెళ్లానని,

కానీ ఇక్కడ ఏం పనిలేదు వెళ్లిపొమ్మని తనను పంపించాడని, చేసేది లేక ఇంటికి తిరిగి వచ్చానన్నారు. ఈ క్రమంలో ఓ మిత్రుడి సలహా మేరకు హైదరాబాద్ వెళ్లి.. రాజకీయ నాయకుడు పి.జనార్థన్‌రెడ్డికి దగ్గరి బంధువైన నా మిత్రుడిని కలిశానన్నారు. అయితే 1980లో కోడి రామకృష్ణ దర్శకత్వంలో తీసిన ఉదయం సినిమా కొన్ని కారణాలతో విడుదల కాలేదని, ఆ సినిమా విడుదల చేయిస్తే తనకు సినిమాల్లో అవకాశం వస్తుందన్న ఆశతో వాళ్లందరినీ హనుమకొండకు తీసుకువచ్చి అప్పటి ఎమ్మెల్యే హయగ్రీవాచారితో కల్పించి ఆ సినిమా విడుదలకు మార్గం సుగమం చేశానన్నారు. ఆ ఘటన తర్వాత తనకు సినిమా వాళ్లతో మంచి పరిచయాలు ఏర్పడ్డాయని, 1986లో తొలిసారి హిందీ సినిమాలో అవకాశం కూడా వచ్చిందన్నారు.

తేరా కరమ్, మేరా తరమ్ అనే సినిమాలో హీరో ధర్మేంద్రతో కలిసి మూడు సీన్లలో నటించానని అవన్నీ తనకు మధురానుభూతులుగా మిగిలాయన్నారు. 1887లో తెలుగు సినిమా విషజ్వాలలో నటించగా మంచి క్యారెక్టర్ కావడంతో గుర్తింపు వచ్చిందని, అదే ఏడాది 'ఈ ప్రశ్నకు బదులేది' 'జైలుపక్షి' 'యుగకర్తలు' 'ఆహుతి' సినిమాల్లో నటించాననని, ఆహుతి వందరోజుల ఫంక్షన్‌లో దాసరి నారాయణరావు చేతులమీదుగా జ్ఞాపిక అందుకున్నానని గుర్తుచేసుకున్నారు.

నిర్మాతగా..

నటనలో రాణిస్తూనే గణేష్ నిర్మాతగా కూడా మారారు. 1990లో భానుచందర్, శారద, వాణివిశ్వనాథ్, రాజేష్, జగ్గయ్య, పరుచూరి గోపాలకృష్ణతో కలిసి 'డాక్టర్ భవానీ' సినిమా తీయగా అది సూపర్‌హిట్ అయ్యింది. ఆ తరువాత 'ప్రేవించొద్దు ప్రేమించొద్దు' 'దేశద్రోహులు' సినిమాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. ఆ సమయంలో హీరోలు, నిర్మాతలు, దర్శకులతో మంచి పరిచయాలు ఏర్పడుతుండగా.. విధి వక్రించింది. కుటుంబంలో వచ్చిన సమస్యలకు తండ్రి మరణంతో ఆయన కొన్నాళ్లు వరంగల్‌కే పరిమితమవ్వాల్సింది.



మిస్టర్ రౌడీ చిత్రంలో హీరో సుమన్‌తో ఓ సన్నివేశంలో గణేష్ (ఫైల్)



దేశద్రోహులు షూటింగ్‌లో హాస్య నటుడు అలీ, హీరో భానుచందర్, హీరోయిన్లు ప్రియరామన్, శ్వేతామీనన్, శరత్‌బాబులతో గణేష్ (ఫైల్)

హీరోగా.. విలన్‌గా..

వరంగల్ మిత్రులతో కలిసి గణేష్ నిర్మాతగా 'స్పాట్' సినిమా తీశారు. అది పూర్తిగా వరంగల్ పరిసర ప్రాతంలోనే చిత్రీకరించారు. అందులో ఆయన విలన్ పాత్ర పోషించారు. అనంతరం హీరో, నిర్మాతగా మిస్టర్ రౌడీ సినిమా రూపొందించారు. ఇటీవల కాలంలో నిర్మాతగా, విలన్‌గా ఆత్మకూర్ గడీ, జ్వాలా సేతు సినిమాలు చేశారు. అవి రెండూ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అంతేగాకుండా మరో కొత్త సినిమాకు కూడా రంగం సిద్ధం చేస్తున్న ఆయన ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వాస్తవికతతో కూడిన కథను తయారు చేసుకుంటున్నానని తెలిపారు. తన కొత్త సినిమాను కూడా ఉమ్మడి వరంగల్ పరసర ప్రాంతంలోనే చిత్రీకరించేందుకు సిద్ధమవుతున్నానని, ఇక ఆ సినిమా టైటిల్‌ను 'రోకలిబండ' అని పెట్టామని, ఇందులో ఉమ్మడి వరంగల్‌కు చెందినవారినే నటీనటులుగా తీసుకోవాలనే ఆలోచనతో ఉన్నానన్నారు. అయితే తన నలభైఏళ్ల సినీ ప్రస్థానంలో ఇప్పటివరకు దాదాపు వంద మందిని ఇండస్ట్రీకి పరిచయం చేశానని చెప్పుకొచ్చారు.

వరంగల్‌లో స్టూడియో ఏర్పాటు చేయాలి

శ్యామల గణేష్



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది నాటక, టీవీ, సినీ కళాకారులున్నారు. సినిమాలు షూటింగ్ చేసేందుకు అందమైన, అనువైన లోకేషన్లున్నాయి. వరంగల్‌లో తక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీసుకునేందుకు వీలుగా ఒక స్టూడియో నిర్మించాల్సిన అవసరం ఉంది. దాని కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి స్థలం కేటాయించాలని కోరాం. ఈలోగా వరం గల్ కళాకారులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చి త్వరలోనే వ రంగల్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

హనుమకొండ జడ్పీలో శాయంపేట మండలం విలీనం

- అధికారికంగా ఉత్తర్వులు జారీ
- హనుమకొండ జడ్పీసీఈవో విద్యాలత

శాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో భాగంగా వరంగల్ రూరల్ జడ్పీలో ఉన్న శాయంపేట మండలం హనుమకొండ జడ్పీ పరిధిలో చేర్చారని ఈ మేరకు ఇటీవల అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయని హనుమకొండ జడ్పీసీఈవో విద్యాలత వెల్లడించారు. బుధవారం జడ్పీసీఈవో ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో శాయంపేట మండలం హనుమకొండ జిల్లాలో ఉండి, జడ్పీ వరంగల్ పరిధిలో ఉండేదని తెలిపారు. ఈ నేపథ్యంలో మండలాన్ని మొదటిసారి సందర్శించడం జరిగిందని తెలిపారు. అలాగే మండలంలోని మాందారిపేట గ్రామాన్ని సందర్శించారు.

ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అతాగే నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరచూ తనిఖీలు చేయడం జరుగుతుందని, విధులలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, ఏపీవో అనిత, పంచాయతీ కార్యదర్శి అజయ్, ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న విద్యాలత

అగ్నిప్రమాదాలపై అవగాహన

కాజీపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాజీపేట బాపూజీనగర్ విశ్వశాంతి హైస్కూల్‌లో బుధవారం అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇళ్లలో, షాపింగ్ మాల్స్‌లో మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, టీచర్లకు వివరించారు. మంటలు చెలరేగితే ఫైర్‌సిబ్బంది వద్ద ఉన్న పరికరాలు, అవి ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారులు దయాకర్, సిబ్బంది కె.జనార్దన్, యాకూబ్, రత్నాకర్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన దాస్యం



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ కో-ఆర్డినేటర్ పులి రజనికాంత్, 6వ డివిజన్ గౌరవాధ్యక్షుడు రెడ్డి రాజేశ్వర్, అధ్యక్షుడు మడిపల్లి సుమన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బజ్జూరి అజయ్‌కుమార్, రాపర్తి రాజేందర్, శ్రవణ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో దళిత ఉద్యోగులు, విద్యార్థుల పట్ల కుల వివక్ష పాటిస్తూ అవమానకరంగా మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, నాయకులు చింత అంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిపై ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డిని రిజిస్ట్రార్ పదవి నుంచి తొలగించాలని విన్నవించారు. దీనిపై రిజిస్ట్రార్ మల్లారెడ్డి వివరణ కోరగా.. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోవాలి

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం కేయూ పరిపాలన భవనం లోని కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ వారంలో రాష్ట్రంలోని అన్నివర్సిటీల వీసీలతో సీఎం సమావేశం కానున్న నేపథ్యంలో వర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజుగౌడ్, కేయూ కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు బి.సతీశ్, కె.నరసింహారావు, శ్రీధర్‌కుమార్‌లోథ్, ఎం.కనుకయ్య, సత్య, ఎస్.రాజేశ్, టి.నాగయ్య, టి.వెంకటేశ్, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, సంగీత్, ఎం. లింగయ్య, సదాశివ్, రఘువర్ధన్‌రెడ్డి, రమేశ్, శ్రీధర్‌రావు, ఉషాకిరణ్, రాధిక, సుకన్య, సునీత, రమాదేవి,సాహితీ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఇంజనీరింగ్ కళాశాలలో కార్యశాల

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాల నేతృత్వంలో వారం పాటు నిర్వహించనున్న ఆన్‌లైన్ కార్యశాల పోస్టర్‌ను బుధవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ కార్యశాల వివరాలను వెల్లడించారు. ఐఎసీటీఈ ట్రైనింగ్ అండ్ లర్నింగ్ అకాడమీ సహకారంతో అడ్వాన్స్‌మెంట్ ఇన్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మేషన్ లర్నింగ్ ఫర్ మోడ్రన్ ఇంజనీరింగ్ సొల్యూషన్ అనే అంశంపై కార్యశాల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 18 వరకు ఆన్‌లైన్‌లో ఇంజనీరింగ్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పరిశ్రమల నిపుణులతో పాటు ఆసక్తి కల్గిన వారు https://www.kakatiya ఆశేయెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను 20న ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ జగన్మోహన్, ఎం.సదానందం, కె.కిశోర్‌కుమార్, ఎస్.రమణ, కె.బిక్షాలు పాల్గొన్నారు.

దాడులు కాదు హామీలు నెరవేర్చండి

హసన్‌పర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులు చేయడం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టాలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయ కులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని తరువాత ప్రజల సంక్షేమ కోసం పనిచేయాలి తప్ప ఇలాంటి హింసాత్మక దాడులు సరికావని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్ దాసరి రాజు, డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, దేవస్థానం మాజీ డైరెక్టర్ పెద్దమ్మ శ్రీనివాస్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు కుంబార్కర్ సాయికిరణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖరన్

బాలసముద్రం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖరన్ అన్నారు. హనుమకొండ కెనరా బ్యాంకు రీజినల్ ఆఫీస్ సౌజన్యంతో బుధవారం హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల ఆశ్రమంలోని పిల్లల సౌకర్యార్థం సుమారు రూ.50 వేల విలువైన బీరువాలు, వాటర్ ప్యూరిఫైయర్లు, బెడ్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కెనరా బ్యాంకు కార్పస్ ఫండ్ ప్రాజెక్టులో భాగంగా ఇలాంటి పిల్లల అవసరాలు తీర్చేందుకు తాము యేటా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి మాట్లాడుతూ.. అన్ని కార్పొరేట్ సంస్థలు ఇలాంటి కార్పస్ ఫండ్ ప్రాజెక్టుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఇంకా హనుమకొండ కెనరా బ్యాంకు ఏజీఎం శాంతికుమార్, వరంగల్ కెనరాబ్యాంకు ఏజీఎం మాధవి, అధికారులు సంతోష్ కుమార్, రాఘవేంద్ర, రాజ్‌నారాయణ, యువ జ్యోతి, ఇంద్రజ, విజయ్‌కుమార్, శ్రీనివాస్, వసుధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహం

హుజూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాలువలో ఓ మహిళ మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం.. ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహం కొట్టుకువస్తుండగా గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పోలీస్, అగ్నిమాపక సిబ్బంది ఒడ్డు కు చేర్చారు. మృతురాలి వివరాలు ఆరా తీయగా హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దూలం సరోజన (68)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

▸▸ జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి

హసన్‌పర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి సూచించారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట టీటీడీ కల్యాణ మండపంలో ఐసీడీఎస్ భీమదేవరపల్లి ప్రాజెక్టు సీడీపీవో పి.స్వరూప అధ్యక్షతన కమలాపూర్, హసన్‌పర్తి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రీస్కూల్ విద్యార్థులకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సకాలంలో అందేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరికి అంగన్‌వాడీ సెంటర్‌లోనే పోషకాహారం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, సూపర్‌వైజర్లు శిరీష, కల్పన, పద్మ, రమ, రేణుక, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌తో పాటు కమలాపూర్, హసన్‌పర్తి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అత్తాకోడళ్లు.. అందరూ దొంగలే..

(5వ పేజీ తరువాయి)

ద్వారా నేరస్తులను గుర్తించారు. భీమారం జంక్షన్ వద్ద వీరిని అరెస్టుచేసి వారి వద్ద బంగారు హారం, చైన్, నెక్లెస్, గాజులు, ఉంగరాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. కేసును ఛేదించడంలో ప్రతిభకనబర్చిన కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఎస్సైలు బి.రవీందర్, పి.శ్రీకాంత్, కేయూ క్రైం సిబ్బంది జి.నర్సింగరావు, పాషా, పి.రవిప్రసాద్‌రెడ్డి, జితేందర్, సీసీఎస్ ఏఎస్సై శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ నసీమ్ అహ్మద్, పీసీలు మధుకర్, చంద్రశేఖర్, రాములు, వెంకన్నను హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అభినందించారు.

కేటీఆర్‌ను కలిసిన వెంకటేశ్వర్‌రెడ్డి



కేటీఆర్‌కు పూలమొక్క అందిస్తున్న చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

వడ్డెపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ జిల్లా ప్రతినిధి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్ నందినగర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీకి ఆపద కాలంలో అండగా నిలిచిన వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు చిర్ర సుమన్ గౌడ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

కోర్టు ఆవరణలో రంగవల్లులు



కేయూ బయోటెక్నాలజీ విభాగంలో ముగ్గులను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, శాస్త్రి తదితరులు

వరంగల్ లీగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా ప్రధాన జడ్జి నిర్మల గీతాంబ ముఖ్య అతిథిగా విచ్చేశారు. న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు వేసిన ముగ్గులలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. మహిళా న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు వేసిన ముగ్గులకు జిల్లా జడ్జి, న్యాయసేవ సంస్థ కార్యదర్శి సాయికిరణ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మహిళా న్యాయవాదుల నుంచి ప్రధాన బహుమతి లావణ్య, రజిత, ద్వితీయ బహుమతి శశిరేఖ, సింధూజ, తృతీయ బహుమతి సుకన్య, జయశ్రీలను ఎంపిక చేశారు. అదేవిధంగా న్యాయశాఖ మహిళా ఉద్యోగుల నుంచి ప్రథమ బహుమతి నాగసుధ, అరుణ, ద్వితీయ బహుమతి లావణ్య, సోనియా, తృతీయ బహుమతి రవళి, గౌతమిని ఎంపిక చేశారు. అనంతరం జిల్లా జడ్జి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముదసిర్ అహ్మద్, ఇతర కార్యవర్గ సభ్యులు వెంకట్రమణ, సునిల్, గోపికరాణి, న్యాయవాదులు వనజ, అరుణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ టౌన్: హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై ముగ్గులను తిలకించారు. ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు అందించారు ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. మహిళలకు రూ. 2500 హామీ ఇవ్వకపోవడంపై మహిళలు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినికాంత్, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కేయూ బయోటెక్నాలజీ విభాగంలో

కేయూ క్యాంపస్: కేయూ బయోటెక్నాలజీ విభాగంలో బుధవారం విద్యార్థులకు సంక్రాతి పండుగను పురస్కరించుకుని రంగవల్లి పోటీలు నిర్వహించారు. కేయూ బయోటెక్నాలజీ విభాధిపతి డాక్టర్ తాడూరి శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరైయారు. విద్యార్థులు సంప్రదాయక దుస్తులు ధరించి ఆలరించారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లి పోటీల్లో తీరొక్క ముగ్గులు వేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగం ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ టి.రాధిక, డాక్టర్ మహేందర్‌తోపాటు ఎంఎస్సీ బయోటెక్నాలజీ, ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటేడ్ స్టూడెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కబడ్డీ సెలక్షన్స్

హసన్‌పర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం హసన్‌పర్తి, ఆత్మకూరు, దామెర మండలాల కబడ్డీ క్రీడాకారులకు మధ్యాహ్నం 3గంటలకు హసన్‌పర్తి జోన్ సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు రమేష్, విక్టర్‌బాబు తెలిపారు. హసన్‌పర్తి, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, కబడ్డీ క్రీడాకారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సెలక్షన్‌లో జిల్లా, మండల అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు గుర్తించి ఒక్కరిని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ బుధవారం తెలిపారు. డీబార్‌కు గురైన వారిలో బొల్లికుంటలోని వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల సెంటర్‌లో అభ్యర్థి ఉన్నట్లు తెలిపారు. వారిపై వర్సిటీ నిబంధనల మేరకు చర్యలుంటాయని వెల్లడించారు. కాగా, పరీక్షల తీరుతెన్నులను పరిశీలించిన పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

కేయూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

▸▸ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేయూ క్యాంపస్‌లోని సీఐటీయూ కార్యాలయంలో కేయూ సీఐటీయూ శాఖ అధ్యక్షుడు ఎ.రాంచందర్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాగుల రమేశ్ మాట్లాడుతూ.. 20 ఏళ్లగా వర్సిటీలోని హాస్టల్స్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్సిటీలకు ఇవ్వాల్సిన గ్రాంట్‌ను చెల్లించాలని అన్నారు. వర్సిటీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. తెలంగాణ వర్సిటీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్సిటీలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో ఖాళీ పోస్టులను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే రెగ్యులర్ చేయాలని అన్నారు. వర్సిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వర్సిటీ అధికారులు సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, ప్రధాన కార్యదర్శి రవికుమార్, పి.రాజు, ఎం.మధు, ఇ.శోభన్‌కుమార్, ఎం.శ్రీనివాస్, ఎం.శోభ, ఎస్.శ్రీనివాస్, సీహెచ్.రమేశ్, డి.కృష్ణ, జి.రవి, ఇ.సందీప్, ఆర్.ప్రభాకర్, డి.రణధీర్, ఎ.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ నేతృత్వంలో 40 రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ తరగతుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెల్ట్ డైరెక్టర్ మేఘనరావు తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 12 వరకు తరగతులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. జనవరి 27 వరకు జ్టిఇట//జ్జుజ్జుజీడ్చ్రిచి.జీ/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వర్సిటీవిద్యార్థులు, రూ.వెయ్యి, ఇతరులు రూ.1500 చెల్లించాలని సూచించారు. ఇతర వివరాలకు తమను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన సమ్మయ్య



హనుమకొండ సిటీ, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కమిటీ రాష్ట్ర సభ్యుడు మండల సమ్మయ్య కలిశారు. హనుమకొండ వడ్డెపల్లికి చెందిన సమ్మయ్య ఇటీవలే రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియమితులైన సంగతి విదితమే. బుధవా రం హైదరాబాద్ నాంపల్లిలోని ఫిషర్‌మెన్ కమిటీ ప్రధాన కార్యాలయం లో సమ్మయ్య రాష్ట్ర చైర్మన్ సాయి కుమార్‌ను కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై 1930కు సమాచారం ఇవ్వాలి

సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



హంటర్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

వరంగల్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరానికి గురైతే తక్షణమే 1930కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం పోలీసులు బుధవారం సైబర్ నేరాలపై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు అంటూ మోసాలకు పాల్పడుతున్న తీరును విద్యార్థులకు వివరించారు. పోలీసులు ఎప్పుడు డిజిటల్ అరెస్టులు చేయరని, పోలీస్ యూనిఫామ్ ధరించి డిజిటల్ అరెస్టు చేస్తామనే సైబర్ నేరగాళ్లు చేసే బెదిరింపులకు కంగారుపడొద్దని తల్లితండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930కు ఫోన్ చేయడం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈసమావేశంలో సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

హసన్‌పర్తి: సైబర్ నేరాలపై అప్రమత్తం గా ఉండాలని కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధి భీమారం గౌతమ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ అరె స్టు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. మోసగాళ్లు మీపై సైబర్‌నేరాలు ఉన్నాయంటూ ఫోన్ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడి పెద్ద ఎత్తును నగదును దోచు కుంటున్నట్లు సమాచారం ఉందన్నారు. నకిలీ ఎఫ్ఐఆర్‌లు, అరెస్టు వారెంట్లు, పోలీసు యూనిఫాంలో వీడియో కాల్స్ ద్వారా బాధితుల కు నమ్మకం కలిగే విధంగా ప్రవర్తిస్తూ మోసాలకు పాల్పడడమే డిజిటల్ అరెస్టు మోసగాళ్ల పనేనని గుర్తించాలన్నారు. ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు 1930 సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్‌తో పాటు పోలీసు సిబ్బంది, కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎవరికి భరోసా.. ఎవరికి నిరాశ?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే భూభారతి(ధరణి) పోర్టల్‌లో సర్వే నెంబర్ల ఆధారంగా ఆయా భూముల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేయనున్నారు. వాణిజ్య, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే భూముల వివరాలను స్వచ్ఛందంగా సమర్పించాలని ప్రభుత్వం కోరింది. దీనికి స్పందించిన వారి భూముల వివరాలను నిర్ధేశిత పోర్టల్ నుంచి తొలగించనున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు రైతు భరోసా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించింది తెలిసిందే. ఇది కూడా ఈనెల 26 నుంచే అమలు కానున్నది. రైతు భరోసాతోపాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేసేందుకు కూడా కసరత్తు జరుగుతోంది. జిల్లాలో భూమిలేని వ్యవసాయ కుటుంబాలు ఎన్ని ఉన్నాయో రెవెన్యూ అధికారులు లెక్కతీస్తున్నారు. యాసంగి సీజన్ పంటల సాగు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అందులో 500 ఎకరాల్లో సాగు చేసే పంటలు నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ అతివేగంగా జరగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీన్ని ఈనెల 6న ప్రారంభించా రు. 8వ తేదీలోగా పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనితో వ్యవసాయ శాఖ అధికారులు పొలాల బాట పట్టారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకం అమలులో భాగంగా ఈ సర్వే చేస్తున్నట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది. సర్వేలో భాగంగా రైతు పేరు, సర్వే నెంబరు, ఏ పంటలు వేశారు..? ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేశారు..? అనే వివరాలను సేకరించిన క్రమంలో భూమి లేని వ్యవసాయ కుటుంబాలు ఎన్ని అనే విషయంలో ప్రాథమికంగా ఒక అంచనాకు రావడానికి వీలు కలుగుతుందని చెబుతున్నారు.

రక్తదాన శిబిరం

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమక్షంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు సుమారు 72 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లైబ్రరీ సైన్స్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్

కేయూ క్యాంపస్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులకు ఉజ్వల ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని కేయూ గ్రంథాలయ ఇన్‌చార్జి ప్రొఫెసర్ సీజే శ్రీలత ఉద్బోధించారు. బుధవారం కేయూ లైబ్రరీ సైన్స్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాధిక రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీజే శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వర్సిటీలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి జీవితంలో స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ విభాగం ప్రొఫెసర్ కె.సుజాత లైబ్రరీ సైన్స్ ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పుర, లష్కర్‌బజార్‌లో ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మడికొండ, కొండపర్తి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని భట్టుపల్లి కొత్తపల్లి, ఇందిరమ్మకాలనీ దర్గా, సైనిక్‌పురి, శాయంపేట అగ్రికల్చరల్ ఫీడర్, అమ్మవారిపేట ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షి కాలనీ, శివముక్తి ధామం, రాజ్‌పుత్‌వాడ, జయకళాశాల ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 81 కేంద్రాల్లో జనవరి 3, 4, 5, 6 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ రూ.6,000, ద్వితీయ రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతులు అందించాం. ప్రతి ఉమ్మడి జిల్లా స్థాయిలో విజేతగా నిల్చిన మహిళలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల విజేతలకు హైదరాబాద్‌లో జనవరి 10న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటక విజేతలిద్దరు... మొత్తం 15 మందికి జనవరి 11న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000కు పైగా బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్న ఫైనలిస్టులు, వారు జిల్లాస్థాయి పోటీల్లో తీర్చిన అందమైన రంగవల్లులు 'నవ్య' పాఠకుల కోసం...

సంతూర్- ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు ఫైనలిస్టులు వీరే


ఎస్.హేమలత, ఆదిలాబాద్


కె.లహరి, కరీంనగర్


ఎం.కవిత, వరంగల్


హీరా, నిజామాబాద్



వి.దివ్య, నల్లగొండ


బి.విద్య, మహబూబ్‌నగర్


ఆర్.లక్ష్మీ స్రవంతి, ఖమ్మం


మాధురి నేమ, హైదరాబాద్


ఆర్.యామిని, మెదక్


శిరీష, రంగారెడ్డి

ఇవి తింటే కాళ్లకు బలం...

మనం నిలబడాలన్నా, నడవాలన్నా, పరుగెత్తాలన్నా కాళ్లు బలంగా ఉండాలి. కొంతమందికి తరచూ కాళ్లలో తిమ్మిరి వస్తూ ఉంటుంది. పాదాల్లో సిరలు ఉబ్బి నొప్పిని కలిగిస్తుంటాయి. అలాకాకుండా కాళ్లలో కండరాలు పటిష్టంగా ఉండాలంటే బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి.

చికెన్ బ్రెస్ట్: ఇందులో ప్రోటీన్లు అధికం. చికెన్ బ్రెస్ట్‌ని గ్రిల్ లేదా బేక్ చేసి తీసుకున్నా, ఉడికించి సలాడ్‌లో కలుపుకుని తిన్నా ప్రయోజనం కనిపిస్తుంది. కూరగాయలతో కలిపి వండుకుని బ్రౌన్ రైస్‌తో తింటే శరీరానికి సమతులాహారం లభించి కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

గ్రీక్ యోగర్ట్: ఇందులో కాల్షియం, ప్రోటీన్లు పుష్కలం. ఇవి ఎముకలకు, కండరాలకు పుష్టినిస్తాయి. దీనిలోని ప్రోబయాటిక్స్ జీర్ణక్రియని వేగవంతం చేసి శరీరానికి పోషకాలు అందిస్తుంది. ఏదైనా స్మూతీలో కలుపుకుని తీసుకొంటే కాళ్లకు బలం చేకూరుతుంది.

సోయా పన్నీర్: ఇది శాకాహారులకు వరం లాంటిది. మాంసంలో లభించే ప్రోటీన్లన్నీ ఇందులో ఉంటాయి. దీనిలో ఉండే తొమ్మిది రకాల అమినోయాసిడ్లు కండరాల పెరుగుదలకు తోడ్పడతాయి. దీనిలోని మెగ్నీషియం.... కండరాల తిమ్మిరిని పోగొడుతుంది. సోయా పన్నీర్‌ని గ్రిల్ చేసి లేదంటే పాన్ మీద తేలికగా వేయించి తినడంవల్ల కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.



పాలకూర: ఇందులో ఐరన్, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలోని ఆక్సీజన్.... కండరాలకు చేరేలా చేస్తాయి. కాళ్లలో కండరాల తిమ్మిరిని తొలగించి పటుత్వాన్ని పెంచుతాయి. పాలకూరని సన్నగా తరిగి సలాడ్స్, స్మూతీల్లో కలుపుకుని తీసుకోవచ్చు. ఆలివ్ నూనె, వెల్లుల్లితో కలిపి కొద్దిగా వేయించి కూడా తినవచ్చు.

క్వినోవా, చియా గింజలు, బాదాం: వీటిలో కూడా అమైనోయాసిడ్లు, ప్రోటీన్లు, మెగ్నీషియం, పీచు పదార్థాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి కాళ్లలో కండరాలు బిగుసుకోకుండా చేస్తాయి. దీనివల్ల మోకాళ్లు, పాదాలలో నొప్పులు రాకుండా ఉంటాయి. రోజుకు అయిదు బాదాములను రాత్రి నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే తొక్కు తీసి తింటే మంచిది. చియా గింజలను ఓట్ మీల్, స్మూతీల్లో కలుపుకుని తీసుకోవచ్చు. క్వినోవాను ఉడికించి సలాడ్స్, సూప్‌లలో కలుపుకోవచ్చు.

ఎముకల నొప్పులా?

శీతాకాలంలో విపరీతమైన చలివల్ల కొందరికి కీళ్లు, కండరాలు పట్టేస్తుంటాయి. ఎముకల నొప్పి బాధిస్తుంటుంది. ఈ సమస్యల నుంచి బయటపడాలంటే శరీరానికి తగినంత కాల్షియం అందించే ఆహార పదార్థాలను తీసుకోవాలి.

పాల ఉత్పత్తులు: పాలు, పెరుగు, ఛీజ్‌లలో అధికంగా కాల్షియం కొద్ది మోతాదులో డి విటమిన్ ఉంటాయి. వీటిని ప్రతిరోజూ ఆహారంలో చేర్చుకుంటే ఎముకలు బలోపేతమవుతాయి. బోలు ఎముకల వ్యాధి, తుంటి పగుళ్లు రావు.

బీన్స్: వీటిలో ప్రోటీన్లు, పీచు పదార్థం, కాల్షియం అధికంగా ఉంటాయి. వీటిని కూర లేదా సలాడ్ రూపంలో తరచూ తినడం వల్ల ఎముకల్లో సాంద్రత పెరుగుతుంది. ఎముకలు పెళుసుబారకుండా బలంగా మారతాయి. బీన్స్‌లో కె విటమిన్ కూడా ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం పేరుకోకుండా పూర్తిగా వినియోగమయ్యేలా చేస్తుంది. చలికాలంలో ప్రతిరోజూ అర కప్పు బీన్స్ తినడం మంచిది.

సాల్మన్ చేపలు: వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఎముకల్లో నొప్పిని, మంటను తగ్గిస్తాయి. సాల్మన్ చేపల్లో ఉండే డి విటమిన్ ఎముకలను పుష్టిగా మారుస్తుంది. వారానికి ఒకసారైనా వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

అవకాడో: అవకాడో తినడం వల్ల ఎముకల్లో వాపు, మంట తగ్గుతాయి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు, మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఎముకల్లో ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడకుండా అడ్డుకుంటాయి. అవకాడోలోని కె విటమిన్ ఎముకలు బిగుసుకోకుండా సులభంగా కదిలేలా చేస్తుంది.

టమాటా: టమాటాలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది ఎముకల చుట్టూ ఉన్న కణజాలాన్ని కాపాడుతుంది. ఎముకలకు రక్షణగా నిలుస్తుంది. టమాటాను రోజూ తినడం వల్ల శరీరానికి కావాల్సిన కె, డి విటమిన్లతో పాటు కాల్షియం, పొటాషియం లాంటి పోషకాలు అంది ఎముకలు దృఢంగా మారతాయి.



నువ్వులు: వీటిలో రాగి, మెగ్నీషియం, కాల్షియం, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రోటీన్లు ఉంటాయి. ఇవన్నీ ఎముకల వ్యాధులు రాకుండా కాపాడతాయి. మహిళలు తరచూ నువ్వులు తింటూ ఉంటే అకారణంగా ఎముకలు విరగడం, ఎముకల పగుళ్లు, ఎముకల నొప్పి వంటి సమస్యలు రావు.

బాదం: బాదం పప్పులో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఇ విటమిన్, పీచు పదార్థం, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి ఎముకలు క్షీణించకుండా కాపాడతాయి. ప్రతిరోజూ అయిదు నుంచి ఎనిమిది బాదం పప్పులు తింటూ ఉంటే ఎముకలు పట్టేయడం లాంటి సమస్యలు రావు.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● గురువారం 9 జనవరి 2025

కత్తి మీద సాములాంటి పాత్ర పోషించా



ఐశ్వర్య రాజేశ్ నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఐశ్వర్య మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు అనిల్ రావిపూడి మొదట లుక్ టెస్ట్ కోసం నన్ను పిలిచారు. ఆ తర్వాత కథ చెప్పగానే విపరీతంగా నచ్చింది. ఆయన కథ చెప్పేటప్పుడే ఈ సినిమా ప్రేక్షకులని కడుపుబ్బా నవ్విస్తుంది అని అర్థమైంది. సినిమాలో కీలకమైన 'భాగ్యం' పాత్రలో కనిపిస్తా. కత్తి మీద సాములాంటి క్యారెక్టర్ ఇది. ఈ రోల్ పోషిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. వెంకటేశ్ అద్భుతమైన కో స్టార్. ఆయన కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. ప్రేక్షకుల నాడి తెలిసిన దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ సినిమా పాటలు ఇప్పటికే సూపర్ హిట్ అయ్యాయి. భీమ్స్ సిసిరోలియో అందరినీ అలరించే సంగీతం ఇచ్చారు. ఇది ఫీల్ గుడ్ ఫ్యామిలీ సినిమా. ఇటువంటి కుటుంబ చిత్రం వచ్చి చాలా రోజులైంది. అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

ఇది సినిమా కాదు జీవితం



రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేశ్ చౌదరి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఇది సినిమా కాదు జీవితం. ఈ ప్రాజెక్ట్‌కు పనిచేసిన వారందరూ గర్వపడేలా ఉంటుందీ చిత్రం. మన కుటుంబంలోని వారంతా సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో చెప్పే చిత్రమిది" అని అన్నారు. అర్చన మాట్లాడుతూ ""లేడీస్ టైలర్ వచ్చిన 38 ఏళ్లకు తిరిగి రాజేంద్రప్రసాద్‌తో పనిచేస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెప్పారు. దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ "మంచి విలువలున్న చిత్రమిది. కలకాలం ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోతుంది" అని తెలిపారు.



శక్తిమంతమైన పాత్రలో...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సంయుక్త హీరోయిన్. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమా టైటిల్ 'హైందవ' అని ప్రకటించారు. అద్భుతమైన విజువల్స్, యాక్షన్ సన్నివేశాలతో గ్లింప్స్ ఆకట్టుకుంది. సాయి శ్రీనివాస్ ఇందులో శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కార్తీక శ్రీనివాస్, డీఓపీ: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్.

హారర్ కామెడీలో...



వచ్చే నాలుగేళ్ల కాలంలో ఎనిమిది హారర్ కామెడీ చిత్రాలు నిర్మించనున్నట్లు మ్యాడ్‌లాక్ ఫిల్మ్స్ సంస్థ ఇటీవల ప్రకటించింది. అందులో భాగంగా ఈ ఏడాది రెండు చిత్రాల నిర్మాణం ప్రారంభించిందీ సంస్థ. వాటిల్లో 'థామా' చిత్రం దీపావళికి, మరో సినిమా 'శక్తి షాలిని' డిసెంబర్ 31న విడుదల చేయాలనేది మ్యాడ్‌లాక్ ప్రణాళిక. 'థామా' చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా, రష్మిక, నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావెల్.. ఇలా భారీ తారాగణమే ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఇక రెండో సినిమా 'శక్తి షాలిని'లో కియారా అడ్వాణీ కీలక పాత్ర పోషించనున్నారు. భారత జానపద కథల నుంచి స్ఫూర్తి పొంది తయారు చేసిన కథతో రూపుదిద్దుకొనే ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ షూటింగ్ ఏప్రిల్, మే నెలల్లో ప్రారంభం కానుంది. కియారా నటించిన తెలుగు చిత్రం 'గేమ్ ఛేంజర్' ఈ నెల 10న విడుదలవుతోంది.

అట్లీ కథతో షాహిద్ చిత్రం



బాలీవుడ్ హీరో షాహిద్‌కపూర్ తమిళ దర్శకుడు అట్లీతో ఓ చిత్రం చేయబోతున్నారని సమాచారం. అయితే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రానికి అట్లీ కథను మాత్రమే అందించనున్నారట. ఆయన శిష్యుల్లో ఒకరు దర్శకత్వం వహించనున్నారని బీ-టౌన్ టాక్. కొన్నాళ్లుగా అట్లీ, షాహిద్ మధ్య జరుగుతున్న చర్చలు ముగింపునకు వచ్చాయని, అట్లీ స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశారని త్వరలోనే ఈ చిత్రంపై అధికారిక ప్రకటన రావొచ్చని తెలుస్తోంది. షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్న 'దేవా'చిత్రం టీజర్ ఇటీవలే విడుదలైంది. ఈనెల 31న ఈ చిత్రం విడుదలవుతోంది. అలాగే విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం షూటింగ్ ఇటీవలే మొదలైంది.

ఎమర్జెన్సీ సినిమా చూడండి

ప్రియాంక గాంధీకి కంగనా రనౌత్ ఆహ్వానం



ఎమర్జెన్సీ చిత్రం చూడమని ఎంపీ ప్రియాంక గాంధీని ఆహ్వానించినట్లు బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో కంగనా రనౌత్ ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ నెల 17న విడుదలవుతున్న సందర్భంగా ఆమె సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను మీడియాతో పంచుకున్నారు.

"ఇందిరాగాంధీకి ప్రియాంక మనవరాలు కావడంతో అందరికన్నా ముందుగా ఆమెకు 'ఎమర్జెన్సీ' సినిమా చూపిస్తే బావుంటుందనిపించింది. ఈ మధ్య పార్లమెంట్‌లో ప్రియాంక గాంధీని కలిశాను. మీరు తప్పకుండా 'ఎమర్జెన్సీ' చిత్రం చూడాలి. మీకు బాగా నచ్చుతుంది అని కోరాను. 'అవును నచ్చొచ్చు, వీలు చూసుకొని సినిమా చూస్తాను' అని ప్రియాంక గాంధీ చెప్పారు" అని కంగనా రనౌత్ తెలిపారు.

అలాగే ఇందిరాగాంధీ గురించి ఆమె ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో నిఖార్సైన బంధుప్రీతికి ఇందిరాగాంధీ నిదర్శనం అన్నారు. ఆమెను వారసత్వ రాజకీయాలకు ప్రతీకగా తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఆమె ఎంతోమంది అభిమానించే నాయకురాలు, మూడుసార్లు ప్రధాని కావడం అంటే తమాషా కాదు అంటూనే, మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ తనయ కావడం వల్ల రాజకీయాల్లో ఎదిగారనీ, అందుకు తన ఘనమైన కుటుంబ నేపథ్యాన్ని ఉపయోగించుకున్నారని కంగన అన్నారు. అయితే 'ఎమర్జెన్సీ' చిత్రంలో వివాదాస్పద అంశాలను స్పృశించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. "ఒక వ్యక్తిగా ఇందిరాగాంధీ నాకు నచ్చినా, నచ్చకున్నా ఆ పాత్రకు నూరుశాతం న్యాయం చేయడానికే ప్రయత్నించాను" అని చెప్పారు. గతేడాది సెప్టెంబర్‌లో 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్‌బోర్డ్ అనుమతి లభించకపోవడంతో విడుదల వాయిదా పడింది. వివాదాస్పద సన్నివేశాలకు కత్తెర వేయడంతో అనుమతులు లభించాయి.

ఆ తరహా చిత్రాలకే ఆస్కార్‌లో పెద్ద పీట

దేశ వ్యతిరేకంగా రూపొందిన చిత్రాలకే ఆస్కార్ పురస్కారాల్లో పెద్దపీట వేస్తున్నారని కంగన విమర్శించారు. ఇలాంటి చిత్రాలకు ఏటా ఆస్కార్ నామినేషన్స్ దక్కడం ఓ తంతుగా మారిందన్నారు. మన సినిమాల విషయంలో వారు ప్రత్యేక ఎజెండా అమలు చేస్తున్నారనీ, దేశాన్ని తక్కువగా చూపించే 'స్లమ్‌డాగ్ మిలియనీర్' లాంటి చిత్రాలకు ఆస్కార్ పురస్కారాలు దక్కుతున్నాయని తెలిపారు.

ఆడపులి అరాచకం

'రాచకొండ ఒక అడవి లాంటిదబ్బా.. ఈడ బలంతో పోరాడే పులులు, బలగంతో పోరాడే ఏనుగులు, ఎత్తుకు పై ఎత్తు వేసే గుంటనక్కలు, కాసుకుని కాటేసే విష సర్పాలు ఉంటాయి. వాటి మధ్య జరిగే పోరులో రక్త పాతాలే తప్ప రక్త సంబంధాలు ఉండవు' అంటూ సాగింది 'రాచరికం' చిత్రం ట్రైలర్. అప్సరా రాణి, విజయ్‌శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు మారుతి విడుదల చేశారు. విలేజ పొలిటికల్ రివెంజ్ డ్రామా ఇదని దర్శక ద్వయం సురేశ్ లంకపల్లి, ఈశ్వర్ వాసే చెప్పారు. ఈశ్వర్ ఈ చిత్రానికి నిర్మాత.



ప్రేక్షకులకు చేరువవుతా



శ్రద్ధా శ్రీనాథ్ నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా శ్రద్ధా మీడియాతో ముచ్చటించారు.

"నేను ఈ సినిమాలో నందిని అనే పాత్రలో నటించాను. నటనకు ఆస్కారముండే పాత్ర ఇది. నందిని పాత్రను దర్శకుడు చాలా బాగా డిజైన్ చేశారు. ఇలాంటి పాత్రను నేను ఇప్పటివరకు చేయలేదు. ఈ క్యారెక్టర్ ప్రతీ విషయంలో ఎంతో స్పష్టతతో పాటు ఓపికగా ఉంటుంది. నేను నటించిన వాటిలో పూర్తి స్థాయి కమర్షియల్ సినిమా ఇదే. ఈ సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువవుతాను. బాలకృష్ణతో పనిచేయడం మరిచిపోలేని అనుభవం. ఆయనలో కొంచెం కూడా స్టార్ అనే ఫీలింగ్ చూడలేదు. ఆయన దర్శకులు ఏం చెప్తే అది చేయడానికి సిద్ధంగా ఉంటారు. దర్శకుడు బాబీ కొల్లి ఎంతో ప్రతిభ గల దర్శకుడు. ప్రతీ విషయంలో చాలా స్పష్టతతో ఉంటారు. ఈ సినిమాకు తమన్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇది మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులను పాటు విపరీతంగా ఆకట్టుకునే సినిమా" అని చెప్పారు.

క్వార్టర్స్‌లో భాంబ్రీ జోడీ

న్యూఢిల్లీ: యుకీ భాంబ్రీ జోడీ ఏఎస్‌బీ క్లాసిక్ ఏటీపీ టూర్‌లో క్వార్టర్ ఫైనల్స్ చేరింది. బుధవారం ఆక్లాండ్‌లో జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో యుకీ-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 6-4, 6-4తో శాండర్ అరెండ్స్ (నెదర్లాండ్స్)-లూకీ జాన్సన్ (బ్రిటన్) ద్వయంపై గెలిచింది.



ఏఎఫ్ఐ అథ్లెటిక్స్ కమిషన్

చైర్‌పర్సన్‌గా అంజు

నీరజ్ చోప్రా, సబ్లేకు చోటు

చండీగఢ్: దిగ్గజ లాంగ్ జంపర్ అంజూ బాబీ జార్జ్‌కు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ)లో కీలక పదవి లభించింది. తొమ్మిది మంది సభ్యులతో కూడిన అథ్లెటిక్స్ కమిషన్‌కు అంజూ చైర్‌పర్సన్‌గా నియమితురాలైంది. సభ్యులలో ఏకంగా ఆరుగురు మహిళలకు ఏఎఫ్ఐ స్థానం కల్పించింది. అలాగే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పురుషుల విభాగం నుంచి నామినేట్ అయిన ప్రముఖుడు. కమిషన్ కొత్త సభ్యులుగా మాజీ రన్నర్లు జ్యోతిర్మయి సిక్దర్, సునీతా రాణి, ఎండీ వలసమ్మ, డిస్కస్ త్రోయర్ కృష్ణ పూనియా, స్టీపుల్ చేజర్ సుధా సింగ్ ఎంపిక య్యారు. 2003 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సొంతం చేసుకున్న అంజు.. ఏఎఫ్ఐ సీనియర్ ఉపాధ్యక్షురాలిగా కూడా వ్యవహరిస్తోంది. కాగా..గత అథ్లెటిక్స్ కమిషన్‌లో నలుగురే మహిళా సభ్యులుండడం గమనార్హం. ఇక..రెండుసార్లు ఒలింపిక్ పతకాలు సాధించిన నీరజ్ చోప్రా, 3000మీ. స్టీపుల్ చేజర్ అవినాష్ సబ్లే, కొత్తగా ఎన్నికైన ఏఎఫ్ఏ అధ్యక్షుడు బహదూర్ సింగ్ ఇతర పురుష సభ్యులు.

ప్రీక్వార్టర్స్‌కు ప్రణయ్, మాళవిక

మలేసియా ఓపెన్‌లో సాత్విక్ జోడీ బోణీ


ప్రణయ్

కౌలాలంపూర్: భారత స్టార్ హెచ్ఎస్ ప్రణయ్, వర్ధమాన షట్లర్ మాళవిక బన్సోడ్ మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల డబుల్స్‌లో ఏస్ జంట సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి కూడా శుభారంభం చేసింది. ఇండోర్ స్టేడియం పైకప్పు నుంచి నీళ్లు లీకైన కారణంగా మంగళవారం ప్రణయ్, బ్రయాన్ యాంగ్ (కెనడా) మధ్య తొలిరౌండ్ మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. మ్యాచ్ నిలిపివేసే సమయానికి ప్రణయ్ 21-12, 9-11తో ఉన్నాడు. ఈ మ్యాచ్‌ను బుధవారం కొనసాగించగా.. చివరకు ప్రణయ్ 21-12, 17-21, 21-15తో బ్రయాన్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్ ఆరంభ రౌండ్లో మాళవిక 21-15, 21-16తో స్థానిక ఫేవరెట్ గో జిన్ వీని చిత్తుచేసింది. సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 16-21, 21-5తో లోకల్ జంట టాంగ్ కాయ్ వీ/మింగ్ చెలూపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన తనీషా/ధ్రువ్ జోడీ 21-13, 21-14తో దక్షిణ కొరియా జంట సంగ్ హ్యాన్/హే వోన్‌పై, సతీష్/ఆద్య ద్వయం 21-13, 21-15తో సహచర జోడీ సూర్య/అమృతపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌కు చేరాయి. మిగతా భారత షట్లర్లలో సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, అనుపమ, ఆకర్షి కశ్యప్.. డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప/తనీషా జంట, రీతూపర్ణ/శ్వేతాపర్ణ ద్వయం ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై తొలి రౌండ్లోనే వెనుదిరిగారు.

చాంపియన్స్ బరిలో ఎవరు?

రాహుల్, జడేజా, షమికి చోటు దక్కేనా?



రోహిత్‌కే పగ్గాలు!

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా టూర్‌లో ఘోరంగా విఫలమైన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల కెరీర్ ముగిసిందంటూ ఊహాగానాలు బలంగా వినిపించాయి. కానీ, భారత క్రికెట్ బోర్డు వారికి చివరి అవకాశం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి 19 నుంచి హైబ్రిడ్ ఫార్మాట్‌లో పాకిస్థాన్/దుబాయ్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ (సీటీ)లో బరిలోకి దిగే భారత జట్టులో ఇద్దరికీ చోటు కల్పించనున్నట్టు సమాచారం. సారథిగా రోహిత్ శర్మనే కొనసాగించవచ్చు. అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ శనివారం భారత జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే, వన్డే ఫార్మాట్‌లో ముగ్గురు సీనియర్లు కేఎల్ రాహుల్, షమి, జడేజా భవితవ్యంపై తీవ్రమైన చర్చ నడుస్తోంది. గత వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత షమి, జడేజాకు పూర్తిగా విశ్రాంతినివ్వగా.. రాహుల్ మాత్రం దక్షిణాఫ్రికా, శ్రీలంకతో సిరీస్‌లలో కనిపించాడు. కాగా, యువ కెరటం యశస్వీ జైస్వాల్ వన్డేల్లో అరంగేట్రం చేసే చాన్సుంది. పంత్‌కు చోటు లభిస్తే రాహుల్ అవసరం ఉండకపోవచ్చు. ఇక, ఎంపికలో కోచ్ గంభీర్ హవా నడిస్తే సంజూ శాంసన్‌కు చోటు దక్కినా ఆశ్చర్యపోనవసరం లేదు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది.



భారత బృందం (అంచనా)

రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లీ, రాహుల్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి/బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్/షమి, రింకూ/తిలక్.

అక్షర్‌కే ఓటు!

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో జడేజా ఆకట్టుకోలేకపోతున్నాడు. అతడితో పోల్చితే అక్షర్ పటేల్ ప్రదర్శన మెరుగ్గా ఉంది. దీంతో సెలెక్టర్లు అక్షర్‌వైపే మొగ్గే చాన్స్ లేకపోలేదు. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా సత్తాచాటుతున్నాడు. లెగ్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పూర్తి ఫిట్‌గా ఉంటే అతడి చోటుకు ఢోకా లేదు. ఒకవేళ అనుకోని పరిస్థితులు ఎదురైతే రవి బిష్ణోయ్ లేదా వరుణ్ చక్రవర్తిలో ఒకరిని ఎంపిక చేసే చాన్సులున్నాయి. ఇక, షమి ఫిట్‌నెస్ విషయమై ఇంత వరకు స్పష్టత రాలేదు. ఇటీవలే విజయ్ హజారే ట్రోఫీలో షమి బౌలింగ్ చేశాడు. మరోవైపు స్టార్ పేసర్ బుమ్రా వెన్నునొప్పిపై బీసీసీఐ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఒకవేళ అతడు చాంపియన్స్ ట్రోఫీకి దూరమైతే మాత్రం జట్టుకు పెద్దదెబ్బే. ఇక, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా ఉండడంతో.. నితీశ్ కుమార్ పరిస్థితి ప్రశ్నార్థకమైంది. రిజర్వు ఆటగాళ్లుగా రింకూ సింగ్ లేదా తిలక్ వర్మ ఎంపికయ్యే ఆస్కారముంది.

టాప్‌లోనే బుమ్రా

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్



దుబాయ్: స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో బుమ్రా మొత్తం 908 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో భారత్ ఆడిన చివరి, ఐదో టెస్ట్‌కు ముందు 907 పాయింట్లతో నెంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న బుమ్రా.. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు తీసి మరో పాయింట్‌ను పెంచుకున్నాడు. ఇక, స్పిన్నర్ రవీంద్ర జడేజా, బోలాండ్‌తో కలిసి సంయుక్తంగా 9వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు దీంతో బుమ్రా తర్వాత భారత్ నుంచి టాప్-10లో ఉన్న బౌలర్‌గా జడ్డూ నిలిచాడు. ఆసీస్ సారథి కమిన్స్ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. బ్యాటర్ల జాబితాలో పంత్ మూడు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంక్‌లో, యశస్వీ జైస్వాల్ 4వ స్థానంలో ఉన్నారు. జో రూట్ నెంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.



సీఎం రేవంత్‌రెడ్డిని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు రాష్ట్ర క్రీడారంగ అభివృద్ధికి సీఎం తీసుకుంటున్న నిర్ణయాలను గోపీచంద్ కొనియాడాడు.

బంగారు బాతును చంపుకోవద్దు

బుమ్రాకు కెప్టెన్సీపై కైఫ్ హితవు

ముంబై: బుమ్రాకు టెస్ట్ కెప్టెన్సీ అప్పగించడంపై బీసీసీఐ ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సూచించాడు. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో తొలి, ఆఖరి టెస్టులకు బుమ్రా సారథ్యం వహించిన సంగతి తెలిసిందే. కాగా..రోహిత్ టెస్ట్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్న క్రమంలో బుమ్రాకే పూర్తిస్థాయి నాయకత్వం అప్పజెపుతారంటూ వార్తలొస్తున్నాయి. ఈనేపథ్యంలో కైఫ్ స్పందిస్తూ కెప్టెన్సీ బుమ్రాపై అదనపు ఒత్తిడి తెస్తుందన్నాడు. అందువల్ల అతడిని పూర్తిస్థాయి సారథిగా నియమించడం ద్వారా బంగారు బాతును చంపుకోవద్దని బోర్డుకు హితవు పలికాడు.

అంతర్జాతీయ క్రికెట్‌కు

గప్తిల్ గుడ్ బై

తెల్లబంతుల ఫార్మాట్‌లో తిరుగులేని ఓపెనర్

వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు

ఆక్లాండ్: తెల్లబంతుల ఫార్మాట్‌లో తిరుగులేని న్యూజిలాండ్ బ్యాటర్‌గా పేరుపొందిన మార్టిన్ గప్తిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు బుధవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల గప్తిల్ 2009 నుంచి 2022 వరకు 14 ఏళ్ల పాటు కివీస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈక్రమంలో 198 వన్డేలు, 122 టీ20లు, 47 టెస్ట్‌లు ఆడాడు. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఈ కుడిచేతి వాటం ఓపెనర్ మెరుపులు చూసి తీరాల్సిందే. టీ20లలో 3531 పరుగులు చేసిన మార్టిన్..ఈ ఫార్మాట్‌లో అత్యధిక రన్స్ సాధించిన టాప్ న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. వన్డేలలో 7346 రన్స్‌తో రాస్ టేలర్ (8607), స్టీఫెన్ ఫ్లెమింగ్ (8007) తర్వాత అత్యధిక పరుగులు చేసిన మూడో కివీస్ బ్యాటర్ గప్తిల్ కావడం విశేషం. ఓవరాల్‌గా మూడు ఫార్మాట్లలో 367 మ్యాచ్‌లు ఆడిన అతడు అన్నింటిలో కలిపి 23 సెంచరీలు సాధించాడు. ఇక..2015 వన్డే వరల్డ్ కప్‌లో వెస్టిండీస్‌పై క్వార్టర్ ఫైనల్లో మార్టిన్ డబుల్ సెంచరీ (163 బంతుల్లో 24 ఫోర్లు, 11 సిక్సర్లతో 237 నాటౌట్)తో కదం తొక్కాడు. తద్వారా వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక రన్స్ చేసిన రికార్డును ఇప్పటికీ తన పేరిట నమోదు చేశాడు. అలాగే ఓవరాల్‌గా వన్డేలలో అది రెండో అత్యధిక స్కోరు కూడా. 2022లో చివరిసారి కివీస్‌కు ఆడాడు. కివీస్ దేశవాళీ క్రికెట్‌లో ఆక్లాండ్ ఏసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గప్తిల్ టీ20 ఫ్రాంచైజీ క్రికెట్‌లో కొనసాగుతానని ప్రకటించాడు. 'న్యూజిలాండ్ జాతీయ జట్టుకు ఆడాలనేది నా కల. అలాంటిది నా దేశానికి ఏకంగా 350కిపైగా మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా ఉంది' అని గప్తిల్ పేర్కొన్నాడు.



న్యూజిలాండ్‌దే సిరీస్

హామిల్టన్: శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే ఉండగానే న్యూజిలాండ్ కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో కివీస్ 113 పరుగులతో గెలిచింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించగా తొలుత కివీస్ 255/9 స్కోరు చేసింది. తీక్షణ (4/44) హ్యాట్రిక్ సహా నాలుగు వికెట్లతో అదరగొట్టాడు. ఛేదనలో శ్రీలంక 30.2 ఓవర్లలో 142 పరుగులకే కుప్పకూలింది.

సిడ్నీ పిచ్..పర్లేదు

ఐసీసీ రేటింగ్

సిడ్నీ: ఇటీవలే ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి 4 టెస్ట్‌లు జరిగిన పిచ్‌లకు ఐసీసీ 'ఉత్తమ' రేటింగ్ ఇచ్చింది. అయితే, ఆఖరి మ్యాచ్‌కు వేదికైన సిడ్నీ పిచ్‌కు 'సంతృప్తికర' రేటింగ్ లభించింది. బ్యాటింగ్ వికెట్ అయిన సిడ్నీ.. ఈసారి పేసర్లకు సహకరించడంతో మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. 'పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్ పిచ్‌లు ఉత్తమం. సిడ్నీ వికెట్ సంతృప్తికరం' అని ఐసీసీ ప్రకటించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

న్యూఢిల్లీ: భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి రూ.85.91 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకడం ఇందుకు ప్రధాన కారణం. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం కూడా రూపాయిని మరింత బలహీనపరిచాయి.

సెన్సెక్స్ 50 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ సూచీలు బుధవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఒకదశలో 712 పాయింట్ల మేర క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 50.62 పాయింట్ల నష్టంతో 78,148.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.95 పాయింట్లు కోల్పోయి 23,688.95 వద్ద క్లోజైంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు అంచనాలను నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి తగ్గించడంతో పాటు డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై అమ్మకాలకు పాల్పడ్డారు.

డా. అగర్వాల్స్ ఐపీఓకు సెబీ ఆమోదం

న్యూఢిల్లీ: నేత్ర వైద్య సేవల సంస్థ డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీఓలకు సెబీ ఆమోదం తెలిపింది. డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీఓలో భాగంగా రూ.300 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 6.95 కోట్ల షేర్లను విక్రయించనుంది. దీంతో పాటు చెన్నై రియల్టీ సంస్థ కాసగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్, మధ్యప్రదేశ్‌కు చెందిన టోల్ కలెక్షన్ అండ్ ఈపీసీ ఇన్‌ఫ్రా కంపెనీ హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇథనాల్ ప్లాంట్ల తయారీలోని రీగ్రీన్-ఎక్సెల్ ఈపీసీ ఇండియా ఇష్యూలకు కూడా అనుమతించింది.

● హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ రూ.410 కోట్ల ఐపీఓకు అద్భుత స్పందన లభించింది. బుధవారంతో ముగిసిన ఈ ఇష్యూకు ఏకంగా 182.57 రెట్ల బిడ్లు వచ్చాయి.

ఏడీఐఏ నుంచి జీఎంఆర్ గ్రూప్‌నకు రూ.6,300 కోట్లు

న్యూఢిల్లీ: అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) నుంచి జీఎంఆర్ గ్రూప్‌నకు రూ.6,300 కోట్ల పెట్టుబడి నిధులు అందాయి. జీఎంఆర్ గ్రూప్ ఈ నిధులను ప్రధాన కంపెనీ జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఈపీఎల్) రుణభారం తగ్గించేందుకు ఉపయోగించనుంది. ఇందుకు బదులుగా జీఎంఆర్ గ్రూప్ ఈ నెల 7న ఏఐడీఏకు జీఈపీఎల్ అనుబంధ కంపెనీ జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఎంటర్‌ప్రైజెస్‌లో ఆప్షనల్లీ కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేసింది.

బర్డ్ ఢిల్లీలో వాటా: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ విమానాశ్రయాల అనుబంధ వ్యాపారాల్లోకీ విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బర్డ్ ఢిల్లీ జనరల్ ఏవియేషన్ సర్వీసెస్ (బీడీజీఏఎస్‌పీఎల్) ఈక్విటీలో 50 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.15.02 కోట్లు ఖర్చు చేసినట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది.

ఇండియాఏఐతో మైక్రోసాఫ్ట్ జట్టు



2026 నాటికి 5 లక్షల మందికి 'ఏఐ'లో శిక్షణ

» మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ చందోక్ వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి చెందిన కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్ట్ 'ఇండియాఏఐ'తో అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యంలో దేశంలోని విద్యార్థులు, టీచర్లు, డెవలపర్లు, ప్రభుత్వ అధికారులు, మహిళా పారిశ్రామికవేత్తలు సహా మొత్తం 5 లక్షల మందికి ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ వెల్లడించారు. "భారత్‌లో 20 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు గత ఏడాదే ప్రకటించాం. ఇప్పటికే 24 లక్షల మందికి శిక్షణ అందించాం. వచ్చే ఐదేళ్లలో కోటి మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తాజాగా ప్రకటించడం జరిగింది. ఇందుకోసం ఇండియాఏఐ మిషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ ఒప్పందంలో భాగంగా 5 లక్షల మందికి శిక్షణ అందిస్తాం" అని చందోక్ పేర్కొన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా మైక్రోసాఫ్ట్ 10 రాష్ట్రాలోని 20 నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎస్‌టీఐ), ఎన్ఐఈఎల్ఐటీ సెంటర్లలో ఏఐ ప్రొడక్టివిటీ ల్యాబ్స్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రాల ద్వారా 20,000 మంది టీచర్లకు ఏఐ ఫండమెంటల్స్ శిక్షణ ఇవ్వడంతోపాటు 200 ఐటీఐల్లో 1,00,000 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఏఐ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే, 'ఏఐ క్యాటలిస్ట్' పేరుతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు చందోక్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు లక్ష మంది ఏఐ డెవలపర్లకు మద్దతివ్వనున్నారు. సమాజానికి పనికివచ్చే పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించనున్నారు.

సరికొత్త ఆవిష్కరణల కోసం కృషి చేయాలి: నాదెళ్ల

కృత్రిమ మేధలో సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ కృషి చేయాలని, సొంత ఫౌండేషనల్ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల అన్నారు. కానీ, ఇందుకు పెట్టుబడుల లేమి ప్రధాన అవరోధమని, ఒక్క పురోగతి మొత్తం స్థితిగతులను మార్చగలదన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు (బుధవారం) నాదెళ్ల ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషలు, ఏఐ ద్వారా పారిశ్రామిక పరివర్తనం అంశాల్లో భారత్ గొప్పగా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం భారత్ గూగుల్, ఓపెన్ ఏఐ తదితర సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ ఇంజన్లు లేదా ఫౌండేషనల్ మోడల్స్‌ను ఉపయోగించుకుంటోంది.

విదేశీ మార్కెట్లపై మహీంద్రా ఫోకస్



ఇప్పటికే బలం ఉన్న చోట్ల కొత్త వాహనాల విడుదల

పుణె: దేశీయ మార్కెట్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న మహీంద్రా అండ్ మహీంద్రా అంతర్జాతీయ మార్కెట్ల విస్తరణ వైపు దృష్టి సారించింది. దశలవారీగా అంతర్జాతీయ మార్కెట్లలో ఆటోమోటివ్ వ్యాపారాన్ని విస్తరించాలని యోచిస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రాజేష్ జెజూరికర్ తెలిపారు. విదేశీ మార్కెట్లకు విస్తరించే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుతం ఉన్న పంపిణీ చానళ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న లైఫ్‌స్టైల్ పికప్ ట్రక్, కొత్తగా తయారుచేయనున్న విద్యుత్ వాహనాలు అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లలో ప్రవేశించేందుకు సహాయపడతాయని భావిస్తున్నట్టు తెలిపారు. కంపెనీకి ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, చిలీ, మొరాకో బలమైన మార్కెట్లుగా ఉన్నాయి. ఈ మార్కెట్లన్నింటిలోనూ స్కార్పియో పికప్‌కు మంచి ఆదరణ ఉన్నదంటూ ఎక్స్‌యూవీ 700, స్కార్పియో ఎన్, ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వాహనాలను ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. తయారీ దశలో ఉన్న లైఫ్‌స్టైల్ పికప్ వాహనం రైట్ హ్యాండ్ డ్రైవ్, లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ మార్కెట్లన్నింటి అవసరాలు తీర్చుతుందని జెజూరికర్ తెలిపారు. ప్రధానంగా పికప్ వాహనాలకు ఆసియాన్ మంచి మార్కెట్ అని, అక్కడకు తాము ఇంకా విస్తరించలేదని ఆయన అన్నారు. 2023 సంవత్సరంలో మహీంద్రా కంపెనీ "గ్లోబల్ పికప్" కాన్సెప్ట్ కారును ఆవిష్కరించింది. 2027 నాటికి అది ఉత్పత్తి దశను చేరుతుందని ఆయన చెప్పారు. ప్రపంచ మార్కెట్ల విస్తరణలో మూడో దశగా రైట్‌హ్యాండ్ డ్రైవ్ విద్యుత్ ఎస్‌యూవీలను ప్రవేశపెట్టనున్నట్టు ఆయన తెలిపారు. రైట్ హ్యాండ్ డ్రైవ్ మార్కెట్లలో స్థిరపడిన అనంతరం లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ మార్కెట్లలోకి ప్రవేశించాలనుకుంటున్నట్టు చెప్పారు. ఐసీఈ (ఇంటర్నల్ కంబుస్టన్ ఇంజన్) పోర్ట్‌ఫోలియోలో మరింత బలపడేందుకు 2025 సంవత్సరంలో ప్రయత్నిస్తామని జెజూరికర్ తెలిపారు. రాక్స్ మోడల్‌కు ఈ మార్కెట్‌లో మంచి ఆదరణ ఉన్నదని, ఉత్పత్తి సామర్థ్యాలను మరింత పెంచవలసి ఉన్నదని చెప్పారు. అలాగే 3 ఎక్స్‌ఓ సామర్థ్యాలు కూడా పెంచుకోవలసి ఉన్నదన్నారు. 2025 సంవత్సర ప్రాధాన్యతల్లో విద్యుత్ వాహనాలు కీలకమని ఆయన తెలిపారు. గత నవంబరులో తాము ఆవిష్కరించిన బీఈ 6, ఎక్స్ఈవీ 9ఇ విద్యుత్ కార్ల డెలివరీ మార్చి నాటికి ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు.

బుధవారం కంపెనీ చకాన్ ప్లాంట్‌లో ఈవీ తయారీ, బ్యాటరీ తయారీ యూనిట్లను ప్రారంభించింది. ఏడాదికి 90 వేల విద్యుత్ కార్ల తయారీ సామర్థ్యాన్ని సాధించాలని కంపెనీ భావిస్తోంది. ఏడాదికి 1.2 లక్షల వరకు తయారీ సామర్థ్యం పెంచుకోగల వసతి ఈ ప్లాంట్‌లో ఉంది. 2022-27 సంవత్సరాల మధ్య కాలంలో విద్యుత్ వాహనాలపై రూ.16,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది.

షామీ ఇండియా నుంచి

కొత్త 5జీ స్మార్ట్‌ఫోన్

ధర రూ. 9,999 నుంచి రూ. 11,999



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చైనా స్మార్ట్‌ఫోన్ల కంపెనీ షామీ ఇండియా భారత మార్కెట్‌లో 'రెడ్‌మీ 14సీ 5జీ' పేరుతో సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేస్తోంది. ఈ నెల 10వ తేదీ నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఆఫ్‌లైన్ స్టోర్లలో ఈ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ప్రారంభమవుతాయని కంపెనీ మార్కెటింగ్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ సందీప్ శర్మ విలేకరులతో చెప్పారు. మూడు రంగులు, మూడు వేరియంట్లలో ఈ 5జీ స్మార్ట్‌ఫోన్ లభిస్తుంది. 50 మెగాపిక్సెల్ (ఎంపీ) కెమెరాతో పాటు సెల్ఫీల కోసం ప్రత్యేకంగా 8 ఎంపీ కెమెరాను ఈ స్మార్ట్‌ఫోన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఫోన్ బ్యాటరీ సామర్థ్యం 5160 ఎంఏహెచ్. ఈ 'రెడ్‌మీ 14సీ 5జీ' స్మార్ట్‌ఫోన్‌తో పాటు కంపెనీ రూ.1,999 విలువైన 33 వాట్స్ చార్జర్‌ను ఉచితంగా ఇస్తోంది. 4జీబీ+64 జీబీ మోడల్ రూ.9,999, 4జీబీ+128 జీబీ మోడల్ ధర రూ.10,999గా, 6జీబీ+128 జీబీ మోడల్ ధర రూ.11,999గా కంపెనీ నిర్ణయించింది. గత ఏడాది విడుదల చేసిన రెడ్‌మీ 13సీ 5జీ మోడల్‌లానే రెడ్‌మీ14సీ 5జీ మోడల్‌కూ వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నట్టు శర్మ చెప్పారు.

హైదరాబాద్‌లో బ్రిగేడ్ గేట్‌వే ప్రాజెక్టు

ఒక్కో ఫ్లాట్ ధర రూ.4-12 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్రిగేడ్ గ్రూప్ హైదరాబాద్‌లో మరో భారీ ప్రాజెక్టు ప్రారంభించింది. కోకాపేటలోని నియోపోలిస్ వద్ద దాదాపు రూ.4,500 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టు చేపడుతోంది. ఇందులో ఇప్పటికే భూసేకరణ ఇతర ఖర్చుల కోసం రూ.1,000 కోట్లు ఖర్చు చేసినట్టు బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ (బీఈఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అమర్ మైసూర్ చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఎకరాల్లో 45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే చోట వరల్డ్ ట్రేడ్ సెంటర్, బ్రిగేడ్ రెసిడెన్స్, బ్రిగేడ్ ఓరియన్ మాల్, మూడు వందలకుపైగా గదుల సామర్థ్యంతో ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ ఏర్పాటు చేస్తారు. నాలుగేళ్లలో పూర్తి చేయాలనుకుంటున్న ఈ ప్రాజెక్టులో 'బ్రిగేడ్ రెసిడెన్స్' పేరుతో ఏర్పాటు చేసే వెంచర్‌లో ఒక్కో సూపర్ లగ్జరీ ఫ్లాట్ ధర విస్తీర్ణాన్ని బట్టి రూ.4 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు ఉంటుంది.

బిగ్ 'సి' సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రముఖ మొబైల్ రిటైలింగ్ కంపెనీ బిగ్ 'సి' సంక్రాంతిని పురస్కరించుకుని కస్టమర్లకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 విలువ గల మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు రూ.5,999 విలువ గల స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువ గల ఇయర్ బడ్స్ ఉచితంగా అందిస్తున్నట్టు కంపెనీ సీఎండ బాలు చౌదరి చెప్పారు. ఇవి కాకుండా ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.15,000 తక్షణ క్యాష్‌బ్యాక్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్, ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ అవసరం లేకుండా మొబైల్ కొనుగోలు సదుపాయం, ఐఫోన్ కొనుగోలుపై రూ.5,000 తక్షణ డిస్కౌంట్, వివో, ఒప్పో ఫోన్ల కొనుగోలుపై 10% వరకు క్యాష్‌బ్యాక్, వన్‌ప్లస్, రియల్‌మీ మొబైల్స్ కొనుగోలుపై రూ.3,000వరకు డిస్కౌంట్, ఎంఐ మొబైల్స్ కొనుగోలుపై రూ.5,000వరకు డిస్కౌంట్ వంటి ఆఫర్లు అందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఏటీఎం కార్డ్‌పై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేసేందుకు ఆకర్షణీయమైన ఆఫర్ కూడా అందిస్తున్నట్టు చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,820 ▲	72,250 ▲	1,00,000 ▲
విజయవాడ	79,700 ▲	75,200 ▼	92,000 ▼
విశాఖపట్నం	78,230 ▲	71,710 ▲	91,470 ▲
రాజమండ్రి	78,820 ▲	72,250 ▲	91,800 ▲
ప్రొద్దుటూరు	79,100 ▲	73,250 ▲	92,200 ▲
ముంబై	77,360 ▲	70,860 ▲	89,500 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ

హైదరాబాద్	485	విజయవాడ	510
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	523	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	95
కర్నూలు	114	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	116		

ఎస్‌హెచ్‌జీలకు సౌర విద్యుత్తు ప్లాంట్లు..

త్వరలో టెండర్ల ఖరారు

భవంతులపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి: భట్టి విక్రమార్క



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ద్వారా ఏర్పాటు చేసే సౌర విద్యుత్తు ప్లాంట్ల టెండర్లను త్వరలో ఖరారు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీల ద్వారా విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్లాంట్ల ద్వారా మొదటి దశలో 1000 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యమని, దీనికి సంబంధించి ఇంధన శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ పథకంపై బుధవారం ప్రజాభవన్‌లో మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో కలిసి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. ప్లాంట్ల కోసం రుణాల విషయంలో బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలన్నారు. ఇప్పటికే ప్లాంట్ల ఏర్పాటుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ(టీజీ రెడ్‌కో) టెండర్లను ఆహ్వానించిందని, త్వరలో వీటిని ఖరారు చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని భారీ భవంతులపై సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. 'పీఎం కుసుమ్' పథకంలో భాగంగా రైతులు 2 మెగావాట్ల వరకు సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే అవకాశముందని, ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. దీని కోసం టీజీ రెడ్‌కో పోర్టల్ ద్వారా రైతులు దరఖాస్తు చేసుకునేలా చూడాలని డిప్యూటీ సీఎం సూచించారు.

ఏఐఎఫ్ కింద రూ.4వేల కోట్లు ఇవ్వాలి

» కేంద్రానికి మంత్రి తుమ్మల ప్రతిపాదనలు



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ మౌలిక వసతుల నిధి(ఏఐఎఫ్) కింద 2025-26 సంవత్సరంలో రూ.4వేల కోట్లు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 సంవత్సరంలో ఏఐఎఫ్(అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) పథకంలో ఇప్పటి వరకు రూ. 3,046 కోట్లు రాష్ట్రానికి వచ్చినట్లు తెలిపారు. 2,246 మౌలిక సదుపాయాల యూనిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 1,450 వ్యవసాయ ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లు, 785 గిడ్డంగులు, 209 కస్టమ్ హైరింగ్ సెంటర్లు, మరో 101 పోస్ట్ హార్వెస్టు సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రూ. 3,075 కోట్ల లక్ష్యానికి దగ్గరలోకి చేరుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 4వేల కోట్ల సాధనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ పథకంలో రైతులకు 3 శాతం వడ్డీ రాయితీ వస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ పథకం అమలులో తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు.

యాసంగికి 20 లక్షల టన్నుల ఎరువులు అవసరం

రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు 20లక్షల టన్నుల ఎరువులు అవసరమవుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎరువుల నిల్వలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు ఎరువులను ఆయా జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు, గ్రామాలకు ముందస్తుగా పంపించాలని ఆదేశించారు. ఏవోలు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ రైతులకు సక్రమంగా ఎరువులు అందేలా చూడాలని ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బడ్జెట్ కసరత్తు షురూ

» గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమంపై భట్టి, సీతక్క సమీక్ష

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ఆర్థిక శాఖ అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను స్వీకరించింది. శాఖలు, పథకాల వారీగా రాబడులు, వ్యయాల అంచనాలను, ఉద్యోగుల జీతభత్యాల వివరాలను అన్ని శాఖలు పంపించాయి. ఈ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల ప్రతిపాదనలపై సచివాలయంలో బుధవారం ఆయన ఆ శాఖల మంత్రి సీతక్కతో కలిసి సమీక్షించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలు రాష్ట్రంలోని కోట్లాది మంది జీవితాలతో ముడిపడి ఉన్నాయని, ఈ శాఖల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందాలని భట్టి విక్రమార్క, సీతక్క ఆకాంక్షించారు. జువైనల్ హోమ్స్‌లో ఉండే పిల్లల మానసిక పరిపక్వతకు క్రీడలు దోహదం చేస్తాయని, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి వారికి స్పోర్ట్స్ కిట్స్‌ను అందిస్తామని తెలిపారు. ఈ కిట్స్‌ను అందించాల్సిందిగా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డికి సూచించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని మహిళా ప్రాంగణాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. దివ్యాంగులకు స్వల్పకాలిక శిక్షణ అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.385కోట్ల మహిళల సొమ్ము ఇచ్చేద్దాం!

» అభయహస్తం డబ్బులివ్వాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, జనవరి8(ఆంధ్రజ్యోతి): అభయహస్తం ద్వారా మహిళలు జమచేసిన రూ.385 కోట్లు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ హయాంలో 2009లో ప్రారంభమైన అభయహస్తం పథకానికి సంబంధించి కాంట్రిబ్యూటరీ పెన్షన్, ఇతర సౌకర్యాల కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు ఆరేళ్లపాటు రోజుకు రూపాయి చొప్పున చెల్లించారు. ఏడాదికి రూ.365కడితే.. ప్రభుత్వం తన వంతుగా.. అంతే మొత్తం జమ చేస్తుండేది. ఇలా రాష్ట్రంలో జమ అయిన డబ్బులు ఎల్ఐసీ వద్ద ఉన్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీఆర్ఎస్ సర్కార్ 2016లో ఈ పథకాన్ని రద్దు చేసింది. అయితే ఎల్ఐసీ వద్ద ఉన్న ఆ డబ్బులను క్లెయిమ్‌చేసిన ప్రభుత్వం ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై బీఆర్ఎస్ ప్రభుత్వం స్పష్టతనివ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా 21లక్షల మంది ఎస్‌హెచ్‌జీ చెల్లించిన డబ్బులు వడ్డీతో కలుపుకొని 2022 మార్చి నాటికే రూ.545 కోట్లయింది. ఆ మొత్తాన్ని మహిళలకు డబ్బులు తిరిగి చెల్లిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా కాకుండా కేవలం సిద్దిపేట జిల్లాకు చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యులకు మాత్రమే ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయంలో ఇతర జిల్లాల మహిళలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణకు విత్తన చట్టం అవసరం

» నమోదు కమిటీని ఏర్పాటు చేయాలి: కోదండరెడ్డి

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో విత్తన చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయిలో విత్తన నమోదు కమిటీని ఏర్పాటు చేయాలని, నమోదు చేసిన విత్తన రకాలను రద్దు చేసే అధికారం కూడా ఆ కమిటీకి ఉండాలని అన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో 'విత్తన సమస్యలు.. రైతు ప్రయోజనాలు' అంశంపై బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రైతులు ఉత్పత్తి చేసే విత్తన రకాలు, సంప్రదాయ విత్తనాలు, సహజ విత్తన జన్యు సంపదకు రక్షణ నిబంధనలు ఈ చట్టంలో ఉండాలని అన్నారు. జన్యు మార్పిడి విత్తనాలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి నియంత్రణ కమిటీలు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో విత్తన చట్టం అనివార్యతతోపాటు 21 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు.

పాలమూరు-రంగారెడ్డిలో ప్రతిబంధకాలు తొలగించాలి

» నార్లాపూర్-ఏదుల పనులు చేయించాలి

» పుట్టంగండి లీకేజీలు అరికట్టాలి: సీఎం



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్-ఏదుల ప్రధాన కాలువ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్యాకేజీ-3 కింద నార్లాపూర్ నుంచి ఏదుల దాకా 8.235 కి.మీ మేర కాలువ తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. దీని సవరణ అంచనాలను రూ.416 కోట్ల నుంచి రూ.784 కోట్లకు పెంచుతూ, ఆమోదించాలని ఇటీవలే మంత్రివర్గ సమావేశం ఎజెండాలో చేర్చారు. సరిగ్గా లేకపోవడంతో ప్రతిపాదనలను మంత్రివర్గం పక్కనపెట్టింది. ఈ పనులను 2015-16 ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ ఆఫ్ రేట్) ప్రకారం చేయలేనని, అంచనాలను సవరించాల్సిందేనని నిర్మాణ సంస్థ ఇదివరకే తేల్చిచెప్పింది. సవరణ అంచనాలను పద్ధతి ప్రకారం పంపించడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదిగా పనులు ముందుకు సాగడం లేదు. ఈ పనులు చేపడితేనే నార్లాపూర్ నుంచి ఏదులకు, అక్కడి నుంచి వట్టెం రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలించే అవకాశాలుంటాయి. దీనిపై బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు ఇతర అధికారులతో సీఎం చర్చించారు. ప్యాకేజీ-3 పనులను చేయించే బాధ్యత అధికారులదేనని సీఎం స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన ప్రతిబంధకాలు తొలగించే బాధ్యత అధికారులదేనని నిర్దేశించారు. ఇక హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు నల్లగొండ జిల్లాకు సాగునీటిని అందించే పుట్టంగండి రిజర్వాయర్‌లో లీకేజీలున్నాయని, అరికట్టకపోతే రిజర్వాయర్ దెబ్బతిని.. నీళ్లన్నీ పంప్‌హౌస్‌ను ముంచే ప్రమాదం ఉందని, దీనివల్ల హైదరాబాద్ జంటనగరాలకు తాగునీటి సరఫరా ఆగిపోయే అవకాశం ఉందని, అంతేకాకుండా నల్లగొండ జిల్లాలో సాగునీటికి ఇబ్బందులు వస్తాయని సీఎంకు అధికారులు నివేదించారు. రిజర్వాయర్ మరమ్మతులతో పాటు పుట్టంగండి నీటిని తరలించేందుకు 10 కి.మీ మేర గ్రావిటీ కెనాల్ లైనింగ్ చేపట్టాల్సి ఉందని సీఎంకు అధికారులు చెప్పారు. స్పందించిన సీఎం, వెంటనే ఈ అంశంపై వాటర్‌బోర్డు ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి, సంయుక్త సర్వే చేయాలని ఆదేశించారు. సర్వే అనంతరం పుట్టంగండి రిజర్వాయర్ లీకేజీతో పాటు 10 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ లైనింగ్ చేపట్టాలని నిర్దేశించారు. మరమ్మతులు చేసే క్రమంలో జంటనగరాల తాగునీటి అవసరాలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ వేయాల్సి ఉంటుందని అధికారులు గుర్తు చేయగా సంయుక్త సర్వే చేసి, తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. హైదరాబాద్ జంటనగరాలకు తాగునీటితో పాటు నల్లగొండ జిల్లాలో సాగునీటికి ఇబ్బందులు రాకుండా మరమ్మతులకు ఉపక్రమించాలని అధికారులకు సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోండి!



కేసీ వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్, తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. గాంధీభవన్‌లో వారానికోసారి నిర్వహిస్తున్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమాన్ని జిల్లాల్లోనూ నెలకోసారి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు, కార్యకర్తలకు దగ్గర కావాలన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి, పీఏసీ సభ్యులు వివరించగా.. వాటి అమలుతీరుపై వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లడంలేదని, పార్టీ సోషల్ మీడియా వింగ్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణను అమలు చేయాల్సిందిగా పీసీసీకి సూచించారు. ఇక 2025 సంవత్సరాన్ని పార్టీ సంస్థాగత నిర్మాణ సంవత్సరంగా తీసుకోవాలని వేణుగోపాల్ అన్నారు. బ్లాక్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన సూచన మేరకు నెల రోజుల్లో ఈ కమిటీలను వేయాలని, త్వరితగతిన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని పీఏసీ నిర్ణయించింది. ప్రతి నెలా పీఏసీ సమావేశం నిర్వహించాలన్న నిర్ణయమూ జరిగింది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, లేదంటే ఆ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పీఏసీ సమావేశంలో అభిప్రాయపడ్డారు. కాగా, ఏడాదిపాటు సంవిధాన్ బచావ్ కార్యక్రమాలు తీసుకోవాలని ఇటీవల సీడబ్ల్యూసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కేసీ వేణుగోపాల్.. పీఏసీలో వివరించారు. దీనికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అయితే ఈ నెల 26 నుంచి 28 మధ్యలో హైదరాబాద్‌లో సంవిధాన్ బచావ్ ర్యాలీని నిర్వహిస్తామని, దానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ సమయం ఇవ్వాలని పీఏసీ సభ్యులు కోరారు. దీనిపై వారిని సంప్రదిస్తానని వేణుగోపాల్ చెప్పారు.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

» సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

» కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అందువల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి అధ్యక్షతన గాంధీభవన్‌లో బుధవారం జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) భేటీలో సీఎం పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 26 నుంచి రైతు భరోసా అందించబోతున్నామని, వ్యవసాయ కూలీల కుటుంబాలకు రూ. 12 వేల చొప్పున ఇవ్వనున్నామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులూ ఇవ్వనున్నామన్నారు. అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, రైతులకు రూ.21 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేశామని తెలిపారు. రైతు సంక్షేమానికి రూ.54వేల కోట్ల మేర ఖర్చు చేశామన్నారు. గృహలక్ష్మి, మహాలక్ష్మి తదితర పథకాలను ప్రస్తావించారు. ఆయా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇక, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని పేర్కొన్నారు. ప్రియాంక గాంధీపై బీజేపీ నేత చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనలు తెలియజేశామని తెలిపారు. కాగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పీఏసీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు పీఏసీ నివాళి

సమావేశం ప్రారంభానికి ముందు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సీఎం రేవంత్ తదితరులు నివాళి అర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి మన్మోహన్‌కు సంతాపం తెలిపామని, భారత రత్న ఇవ్వాలని తీర్మానం చేశామని గుర్తు చేశారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

1000 ఆలస్య రుసుముతో 22 చివరి తేదీ

ఈ సంవత్సరం మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల ఫీజు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. రూ.1000 అపరాధ రుసుముతో కలిపి ఈ నెల 22 లోపు రెగ్యులర్/ప్రైవేటు విద్యార్థులు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇదే చివరిదని, ఇక మీదట పొడిగింపు ఉండదని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఫీజు చెల్లించిన విద్యార్థుల జాబితాలను 24లోపు ప్రధానోపాధ్యాయులు డీఈవో కార్యాలయాల్లో సమర్పించాలని, వాటిని 25 లోపు డీఈవోలు తమ కార్యాలయానికి పంపించాలని డైరెక్టర్ ఆదేశించారు.

8 నెలలైనా పదవీవిరమణ ప్రయోజనాలు ఇవ్వడంలేదు

» ఆత్మహత్యే శరణ్యం..

రిటైర్డ్ ఏఎస్సై వీడియో వైరల్

మహబూబ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ చేసి ఎనిమిది నెలలు అవుతున్నా ఆ ప్రయోజనాలు రావడం లేదని, వాటికోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదని, చివరకు తనకు ఆత్మహత్యే శరణ్యమని ఓ రిటైర్డ్ ఏఎస్సై వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎండీ సాదిక్ ఎనిమిది నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. పదవీవిరమణ ప్రయోజనాలు వస్తాయని అప్పులు చేశాడు. అవి రాక పోవడంతో అప్పుల వారు తన ఇంటి చుట్టూ తిరుగుతున్నారని, తనకు ఇక ఆత్మహత్యే దిక్కని ఓ వీడియోలో పేర్కొన్నారు. చనిపోయాక తన కొడుకు అప్పులు ఇస్తే తీసుకోవాలని లేదంటే తనను క్షమించాలని అప్పులు ఇచ్చిన వారికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఏఈఈల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో ఈఎన్‌సీ అనిల్‌కుమార్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

నెలాఖరులోగా పదోన్నతులు, బదిలీలు

» నీటి పారుదల శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

» కలకాలం గుర్తుండే ప్రాజెక్టులు కట్టాలి

» ఇంజనీర్లతో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్/పంజాగుట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖ గాడి తప్పిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఏడాదిగా దాన్ని సరి చేసే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. నెలాఖరులోగా అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించి, బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పోస్టింగ్ ఇచ్చిన చోటే విధులు నిర్వర్తించాలని, పోస్టింగ్‌ల కోసం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరగరాదని ఇంజనీర్లకు సూచించారు. కలకాలం గుర్తుండే ప్రాజెక్టులను కట్టేందుకు కృషి చేయాలని ఉద్బోధించారు. జలసౌధలో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంజనీర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి... ఉపశమనం కల్పించే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులున్నా తనను సంప్రదించాలని, 24 గంటలూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం అనాలోచితంగా స్వల్పకాలిక వ్యవధిలో తీర్చేలా అధిక వడ్డీతో ప్రాజెక్టులకు రుణాలు తెచ్చిందని గుర్తు చేశారు. స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చుకుని, రుణ చెల్లింపు భారం తగ్గించుకుంటున్నామని తెలిపారు. కాగా, నాలుగేళ్లుగా టీఏ బిల్లులు విడుదల కావడం లేదని, తక్షణమే చెల్లింపులు జరిగేలా చూడాలని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కోరారు.

ఆ ఇంజనీర్లకు జీతాలు ఇప్పించండి

పోస్టింగ్ వచ్చినప్పటి నుంచి తమకు జీతాలు రావడం లేదని, తమ సమస్యను పరిష్కరించాలని 130 మంది ఏఈఈలు బుధవారం మంత్రి ఉత్తమ్‌ను కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి.. సీఎస్ శాంతికుమారికి ఫోన్ చేసి, ఆ 130 మంది ఇంజనీర్ల వేతనాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా, రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా పోస్టింగ్‌లు పొందారన్న ఆరోపణల నేపథ్యంలో వీరికి జీతాలను నిలిపివేశారు.

హైదరాబాద్-డిండి.. గ్రీన్‌ఫీల్డ్ హైవే!

» 85 కి.మీ, 4 లేన్లు..1,525 కోట్ల వ్యయం

» ప్రస్తుత రోడ్డుకు ప్రత్యామ్నాయంగా రెండు అలైన్‌మెంట్లు సిద్ధం చేసిన ఎన్‌హెచ్ఏఐ

» త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేత



చిత్రంలో నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉన్నది గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రెండు కొత్త అలైన్‌మెంట్లు, ఎరుపు రంగులో ఉన్నది ప్రస్తుత రోడ్డు

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి డిండి, మన్ననూరు, శ్రీశైలం మీదుగా ఆంధ్రప్రదేశ్ వెళ్లే ప్రయాణికులకు శుభవార్త. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)పై నుంచి తుక్కుగూడ దగ్గర దిగిన తరువాత నుంచి డిండి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే ఏపీకి వెళ్లడానికి ప్రయాణ సమయంతో పాటు, కొంత దూరం కూడా తగ్గుతుంది. ప్రస్తుతం తుక్కుగూడ నుంచి డిండి వరకు ఉన్న (జాతీయ రహదారి 765) 2 లేన్ల రహదారికి ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) మరో రెండు కొత్త అలైన్‌మెంట్లను సిద్ధం చేసింది. దాని ప్రకారం ఈ రహదారిని 85 కిలోమీటర్ల మేర 4లేన్లతో నిర్మించనున్నారు. అందుకు రూ.1,525కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. రహదారి నమూనాలు, భూ సేకరణ తదితర వివరాలతో 18పేజీల నివేదికను ఎన్‌హెచ్ఏఐ త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనుంది. రెండు అలైన్‌మెంట్లలో ఒకదానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేయగానే మిగిలిన పనులు మొదలు కానున్నాయి. తాజాగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఈ రోడ్డు హైదరాబాద్, తుక్కుగూడ దగ్గర ప్రారంభమై కందుకూరు, కడ్తాల్, మైసిగండి, విఠాయిపల్లి, ఆమనగల్, వెల్దండ మీదుగా డిండి వరకు ఉంటుంది. హైదరాబాద్ నుంచి డిండి వరకు రోజుకు సగటున 10వేలకు పైగా వాహనాలు ప్రయాణిస్తున్నట్లు సర్వే నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతమున్న రోడ్డునే 4 లేన్లగా విస్తరించడం లేదా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం... దేని వల్ల లాభనష్టాలు ఏంటనే వివరాలను పొందుపర్చారు. డిండి తరువాత మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించతలపెట్టిన విషయాన్ని నివేదికలో పొందుపర్చారు.

13 జంక్షన్లు..

హైదరాబాద్ నుంచి డిండి వరకు ప్రస్తుత రహదారినే 4 లేన్లుగా విస్తరించాలంటే చాలా ఇబ్బందులు ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు. దాని ప్రకారం.. ఇరువైపులా ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ల మార్పునకు కనీసం రూ.220 కోట్లు, విద్యుత్ లైన్ల మార్పునకు రూ.62కోట్లు అవసరమని తెలిపారు. "కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాలనుకుంటే పైపులైన్ల అడ్డంకి ఉండదు. విద్యుత్ లైన్ల మార్పునకు రూ.30కోట్ల వరకు ఖర్చవుతుంది. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ లైన్‌ను కూడా ఒక చోట మార్చాల్సి వస్తుంది. ప్రస్తుత రోడ్డును విస్తరించాలంటే రూ.1,552కోట్లు, అదే కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికైతే రూ.1,525కోట్లు ఖర్చవుతుంది. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు 365హెక్టార్లు అవసరమవుతుండగా.. ఇందులో 3.6 హెక్టార్ల అటవీ భూమి ఉంది. మార్గ మధ్యలో 7అండర్‌పాస్‌లు, 13 జంక్షన్లు, ఒక మేజర్ బ్రిడ్జి, 8 మైనర్ బ్రిడ్జిలు, 90 చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంటుంది" అని పేర్కొన్నారు. ప్రస్తుత రోడ్డును విస్తరించడం కంటే కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించడమే మంచిదని పేర్కొన్నారు.

గ్రూప్-3 పరీక్ష ప్రాథమిక కీ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

బుర్రా వెంకటేశం తెలిపారు. రాష్ట్రంలో మే1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఇక నుంచి ప్రతి ఏటా అన్ని శాఖల్లోని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. మార్చి 31 వరకూ అన్ని శాఖల ఖాళీల వివరాలను సేకరిస్తామని, ఇదే విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ నెలలో రోస్టర్ పాయింట్లను పరిశీలించి, మే నెలలో నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఇక నుంచి ప్రతి ఏటా ఇదే విధానం అమలు చేస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ నోటిఫికేషన్ల ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని, ఆ తర్వాతే కొత్త నోటిఫికేషన్లు ఇస్తామని తెలిపారు. ఏ నోటిఫికేషన్ ఇచ్చినా మూడు నెలల నుంచి ఏడాది లోపే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. గ్రూప్స్ పరీక్షలు ఆరు నెలల నుంచి ఏడాది లోపు.. చిన్న చిన్న పరీక్షలు అయితే నెల నుంచి మూడు నెలల్లోనే ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. ఇక నుంచి ఫలితాల కోసం అభ్యర్థులు ఏండ్లకు ఏండ్లు ఎదురు చూసే అవకాశముండదన్నారు. అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేలా టీజీపీఎస్సీ పనిచేస్తోందని ఆయన తెలిపారు.

లీకేజీకి ఆస్కారం లేకుండా ఒకరోజు ముందే ప్రశ్నపత్రాల కూర్పు

ప్రశ్నపత్రాల లీకేజీకి ఆస్కారం ఇవ్వకుండా పరీక్షకు ఒకరోజు ముందే ప్రశ్నాపత్రాలను కూర్పు చేసేలా క్వశ్చన్ బ్యాంక్ సిద్ధం చేయాలన్న ఆలోచనతో ఉన్నామని టీజీపీఎస్సీ చైర్మన్ తెలిపారు. పేపర్ సెటింగ్ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై దృష్టి పెడతామని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని, ఇటీవలే ప్రభుత్వం పలు పోస్టులను మంజూరు చేసిందని తెలిపారు. కొత్తవాళ్లు వచ్చే దాకా 87 మందిని డిప్యుటేషన్‌పై తీసుకుంటున్నామని చెప్పారు. ఉద్యోగ పరీక్షల నియామకాల ప్రక్రియను పరిశీలించేందుకు ఇటీవలే ఢిల్లీలోని యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ కార్యాలయాలను సందర్శించామని తెలిపారు. ఈ నెల 11, 12న బెంగళూరులో అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఆలిండియా కాన్ఫరెన్స్ ఉందని, తద్వారా వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రిలిమినరీ కీ, ఫైనల్ కీ లాంటి వాటిపై పునరాలోచన చేస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ ఎనాడూ కీ లను విడుదల చేయదన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఉద్యోగం వచ్చాక ఆయా శాఖలు చూసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సిలబస్ తగ్గింపు, గ్రూప్-2, 3 లో పరీక్షల సంఖ్య తగ్గింపుపై ఆలోచన చేస్తామన్నారు. ఇటీవల గ్రూప్స్ పరీక్షల్లో ఏపీకి చెందిన అంశాలు ఎక్కువగా రావడానికి ఆ పేపర్‌లో ఉన్న సిలబస్సే కారణమని ఆయన వివరించారు.

గ్రూప్-3 కీపై అభ్యంతరాలకు 12వరకు గడువు

గ్రూప్-3 ప్రాథమిక కీపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు సమయమిచ్చారు. గ్రూప్-3 పరీక్షను మూడు సెట్ల ప్రశ్నాపత్రాలతో నిర్వహించారు. ఈ మూడు సెట్ల ప్రాథమిక కీలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమ అభ్యంతరాలను కమిషన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే తెలపాలి. ఆంగ్ల భాషలోనే అభ్యంతరాలను వివరించాల్సి ఉంటుంది. అభ్యర్థులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి ఆధారాలతో కూడిన పత్రాలను జత చేయాలి. ఈ మెయిల్ ద్వారా, వ్యక్తిగతంగా పంపిన అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశీలించబోమని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికొలస్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

- భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వుల సస్పెన్షన్ మరో రెండు వారాల పొడిగింపు

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులపై మరోసారి ఊరట లభించింది. ఆ ఉత్తర్వులపై సస్పెన్షన్‌ను మరో రెండు వారాలు పొడిగిస్తూ హైకోర్టు బుధవారం ఆదేశాలు ఇచ్చింది. మేడిగడ్డ కుంగుబాటులో అవినీతి జరిగిందని దాఖలైన ప్రైవేటు ఫిర్యాదులో కోర్టుకు హాజరు కావాలని భూపాలపల్లి జిల్లా కోర్టు మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు తదితరులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను హైకోర్టు గత డిసెంబరులో సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వాటి గడువు ముగియడంతో భూపాలపల్లి జిల్లా కోర్టు ఆదేశాలను కొట్టేయాలని కేసీఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ బుధవారం మరోసారి జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. మధ్యంతర ఉత్తర్వుల గడువు ముగిసిపోవడంతో వాటిని పొడిగించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. దీంతో జనవరి 22 వరకు మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి వరకు దిగువ కోర్టుకు కేసీఆర్, హరీశ్‌రావు హాజరుకాకుండా రక్షణ కల్పించింది. మేడిగడ్డ కుంగుబాటుకు కేసీఆర్, హరీశ్‌రావు సహా ఇతరుల అవినీతే కారణమని పేర్కొంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

కాంగ్రెస్, బీజేపీ బాహాబాహీ.. నలుగురికి రిమాండ్

అఫ్జల్‌గంజ్/మంగళ్‌హాట్, ములుగు, నిజామాబాద్ అర్బన్, హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల వద్ద మంగళవారం జరిగిన దాడులకు సంబంధించి పోలీసులు 11 మంది నిందితులను బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరిలో ఆబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసిన రహమత్ బాబా, హాజీ, మహ్మద్ ఫయాజ్, మంజునాథ్ అనే నలుగురిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఏడుగురికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఘటన జరిగిన ప్రదేశంలోని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు మరో 30 మంది నిందితులను కూడా గుర్తించారు. వాళ్లని కూడా అదుపులోకి తీసుకునే అవకాశముంది. కాగా, బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసనగా ములుగు, నిజామాబాద్‌లో బీజేపీ శ్రేణులు బుధవారం ఆందోళనలు చేశాయి. ములుగులో రాస్తారోకో చేసిన బీజేపీ శ్రేణులు.. మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయం ముట్టడికి చేసిన యత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ప్రతిగా కాంగ్రెస్ శ్రేణులు బీజేవైఎం నేత నాగరాజుకు చెందిన దుకాణాన్ని ధ్వంసం చేశాయి.

ప్రభుత్వాన్ని నివేదిక అడగండి..గవర్నర్‌కు కిషన్‌రెడ్డి లేఖ

రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ నిష్పక్షపాతంగా జరిగేలా జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బుధవారం లేఖ రాశారు. బీజేపీ కార్యాలయంపై దాడి ఘటనపై ప్రభుత్వం నుంచి నివేదిక కోరాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ యువనేతలు చేసిన దాడిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, దళిత మోర్చా నాయకుడు నందు గాయపడ్డారని వివరించారు. పోలీసులు అక్కడే ఉన్నా ప్రేక్షకపాత్ర పోషించారని, దాడికి ముందు 200 మంది యువకులు సమావేశం అయిన విషయం తెలిసి కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి పోయే కాలమొచ్చింది

- మాపై దాడులకు మూల్యం చెల్లించక తప్పదు
- మేం తలుచుకుంటే ఎవ్వరూ మిగలరు: ఈటల



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన రాజకీయ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీకి పోయేకాలం వచ్చింది' అంటూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక పథకం ప్రకారం ఒక పార్టీ నాయకులు ఇంకొక పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలు లేవన్నారు. నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, దాడి చేయడం సరికాదని హితవు పలికారు. 'రేవంత్ చేతిలో అధికారం ఉండొచ్చు.. కానీ మేం తలుచుకుంటే ఎవ్వరూ మిగలరు. దాడి చేయడం బీజేపీ సిద్ధాంతం కాదు, కానీ మాపై దాడి చేసిన వారిపై ప్రతి దాడి చేస్తాం' అని హెచ్చరించారు. దాడులకు పాల్పడే వారు చిల్లర నాయకులు అవుతారు తప్ప పెద్ద నాయకులు కాలేరన్నారు. దాడికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామికంగా చేస్తున్న దాడులకు మూల్యం చెల్లించక తప్పదన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి ప్రశ్నించారు. తాము రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటున్నామని, కాంగ్రెస్ నాయకులు మాత్రం కేవలం రాజకీయాల కోసం రాజ్యాంగ పుస్తకాన్ని చూపిస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లు చేసేది రౌడీయిజమన్నారు. పోలీసుల వైఫల్యంతోనే కాంగ్రెస్ కార్యకర్తలు, గూండాల దాడి జరిగిందన్నారు.

కందుల సేకరణకు 100 కొనుగోలు కేంద్రాలు!

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కందులు కొనుగోలు చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా 100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొక్యూర్మెంట్ మేనేజర్ పొన్నం చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రం నుంచి 1,69,140 మెట్రిక్ టన్నుల కందుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. మూడు నెలల్లో కందుల సేకరణ పూర్తి చేస్తామని తెలిపారు.

ఐదుగురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ఒక స్పెషల్ గ్రేడ్, నలుగురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. బదిలీ అయిన వారిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అమరేందర్.. ప్రస్తుతం నల్గొండ జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేస్తుండగా ఆయన్ను నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ చేశారు. సిరిసిల్ల ఆర్డీవోగా పని చేస్తున్న కె. వెంకట ఉపేందర్ రెడ్డిని కీసర ఆర్డీవోగా, కీసర ఆర్డీవోగా పని చేస్తున్న పి. సైదులును సిరిసిల్ల ఆర్డీవోగా బదిలీ చేశారు. వరంగల్ భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న ఎన్.రవిని భూపాలపల్లి ఆర్డీవోగా, భూపాలపల్లి ఆర్డీవోగా ఉన్న ఎం.మంగీలాల్‌ను వరంగల్ భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.


పెరిగిన ఖైదీల సంఖ్య..!

- 2023తో పోలిస్తే 2024లో జైళ్లలో 10 వేలు అధికం
- జైళ్ల శాఖ-2024 నివేదిక వెల్లడించిన డీజీ సౌమ్యా మిశ్రా

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి జైళ్లకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. 2023తో పోలిస్తే 2024లో రాష్ట్రవ్యాప్తంగా జైళ్లల్లో వివిధ నేరాల్లో నిందితులుగా జైళ్లకు వచ్చిన వారి సంఖ్య సుమారు 10 వేలు పెరిగింది. 2023లో మొత్తం 31,428 మంది జైళ్లకు వస్తే.. 2024లో ఆ సంఖ్య 41,138కి చేరింది. పురుషులతోపాటు మహిళా నిందితుల సంఖ్యలోనూ పెరుగుదల నమోదు కావడం విశేషం. అయితే జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగేందుకు మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడమే ప్రధాన కారణమని, మిగతా నేరాలతో పోలిస్తే ఈ ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితులుగా వస్తున్న వారే ఎక్కువగా ఉన్నారని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వివరించారు. బుధవారం చంచల్‌గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో కలిసి జైళ్ల శాఖ-2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023లో ఎన్‌డీపీఎస్ కేసులు 3,688 నమోదవ్వగా.. 2024లో 6,311 రికార్డయ్యాయన్నారు. ఇక పోక్సో, హత్య కేసులు కూడా కొంత పెరిగినట్లు తెలిపారు. 2023లో పోక్సో కేసులు 2,905, హత్య కేసులు 2,511 నమోదవ్వగా.. 2024లో పోక్సో కేసులు 3,750, హత్య కేసులు 2,754కు పెరిగినట్లు వెల్లడించారు. జైలుకొస్తున్న ఖైదీల్లో 30 ఏళ్లలోపు వారే ఎక్కువ ఉన్నారన్నారని చెప్పారు.

విచారణ గదిలోకి న్యాయవాదిని అనుమతించం!

- థర్డ్ డిగ్రీ వాడతారని కేటీఆర్ భయపడుతున్నారేమో..
- కనుచూపు మేరలో న్యాయవాదిని కూర్చోనివ్వండి: హైకోర్టు



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఏసీబీ అధికారులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారని భయపడుతున్నారేమోనని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఏదేమైనా కేటీఆర్‌కు కనుచూపు మేరలో న్యాయవాది ఉండేలా అనుమతించాలని ఏసీబీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే విచారణ జరిగే గదిలోకి ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని.. విచారణ గదిలో మాటలు వినడానికి కూడా అనుమతి లేదని తెలిపింది. ఈ నెల 9న విచారణకు రావాలని ఏసీబీ అధికారులు నోటీసులు ఇచ్చారని, విచారణకు న్యాయవాదిని అనుమతించడం లేదని.. న్యాయవాదిని తీసుకెళ్లేందుకు అనుమతిచ్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కేటీఆర్ బుధవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం అనుమతించింది. భోజనం తర్వాత పిటిషనర్ తరఫున న్యాయవాదులు ఎ.ప్రభాకర్‌రావు, టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ.. విచారణకు లాయర్‌ను తీసుకెళ్లడం పిటిషనర్ హక్కు అని చెప్పారు. ఈ మేరకు పలు సుప్రీంకోర్టు తీర్పులతోపాటు ఇదే హైకోర్టు 'వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి' కేసులో ఇచ్చిన తీర్పు ఉందని పేర్కొన్నారు. అలాగే ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఏసీబీ తరఫున ఏఏజీ తేరా రజినీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. విచారణ గదిలోకి న్యాయవాదిని అనుమతించాలని ఎక్కడా లేదని తెలిపారు. ఏసీబీ కార్యాలయంలో పిటిషనర్ కేటీఆర్‌కు కనిపించేలా న్యాయవాదిని అనుమతిస్తామన్నారు. అనంతరం ఏసీబీ కార్యాలయంలో గదుల మ్యాప్‌ను కోర్టుకు సమర్పించారు. న్యాయవాది లైబ్రరీలో కూర్చొని విచారణ గదిలో ఉన్న కేటీఆర్‌ను అద్దంలోంచి చూడవచ్చని చెప్పారు. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేసిన పిటిషనర్ న్యాయవాదులు లాయర్‌ను అనుమతించడంతోపాటు ఆడియో, వీడియో రికార్డుకూ ఆదేశించాలని కోరారు. జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 'వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి' కేసులో ఉన్న ఆరోపణలు వేరని పేర్కొంది. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు అధికారి అయిన సీబీఐ ఎస్పీ స్టేట్‌మెంట్ తప్పుగా రికార్డు చేస్తున్నారన్న ఆరోపణ ఉండడంతోనే న్యాయవాదిని అనుమతించడంతోపాటు ఆడియో, వీడియో రికార్డు చేయాలని తీర్పు ఇచ్చామని తెలిపింది. ప్రస్తుత కేసులో ఏదో ఒక్కదానికే అనుమతిస్తామంది. కేటీఆర్‌తో వెళ్లడానికి ముగ్గురు లాయర్ల పేర్లు సూచించాలని పేర్కొంది. సోమ భరత్‌కుమార్, జె.రామచంద్రరావు, ఎ.ప్రభాకర్‌రావు పేర్లను చెప్పగా.. రామచంద్రరావు పేరును ఖరారు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో అదనపు అడ్వొకేట్ జనరల్‌గా పనిచేసిన సీనియర్ న్యాయవాది జె.రామచంద్రరావును కేటీఆర్‌తోపాటు అనుమతించాలని హైకోర్టు పేర్కొంది. మనిషి కనపడేలా, మాటలు వినిపించనంత దూరంలో లాయర్ కూర్చోవాలని స్పష్టంచేసింది.

అంతా కేటీఆరే చేశారు

(మొదటిపేజీ తరువాయి)


ఏసీబీ కార్యాలయం వద్ద అర్విందకుమార్

విచారించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఏసీబీ అధికారుల ప్రశ్నలకు అర్వింద్‌కుమార్ సమాధానమిస్తూ.. హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ కారు రేసు 9, 10, 11, 12 సెషన్లు నిర్వహించడానికి సంబంధించి ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో)తో 2022లో చర్చలు మొదలయ్యాయని తెలిపారు. రేసు నిర్వహించడానికి ఒక స్పాన్సరర్ అవసరం కావడంతో నాటి మంత్రి కేటీఆర్.. తన మిత్రుడైన గ్రీన్‌కో కంపెనీ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను రంగంలో దించారు. త్రైపాక్షిక ఒప్పందానికి ముందు ఏం జరిగింది? ఎవరెవరు ఎన్నిసార్లు పురపాలక శాఖ అధికారులతో, మంత్రితో సమావేశమయ్యారు? అని ఏసీబీ ప్రశ్నించగా.. ఒప్పందానికి ముందు, తర్వాత జరిగిన విషయాలను అర్వింద్‌కుమార్ పూసగుచ్చినట్లు వివరించారు.

సమస్యలు వస్తాయని చెప్పినా..

త్రైపాక్షిక ఒప్పందం అమల్లో ఉన్నపుడు తాము ఒప్పందం నుంచి వైదొలుగుతున్నామని ఏస్ నెక్స్‌జెన్ రాత పూర్వకంగా పురపాలకశాఖకు తెలియజేసిందా? అని ఏసీబీ అధికారులు ప్రశ్నించగా.. అంతా మంత్రి కేటీఆరే మాట్లాడారని అర్వింద్‌కుమార్ చెప్పారు. స్పాన్సరర్ కంపెనీ తమకు నష్టం వచ్చినట్లు చెబుతున్నందున.. పురపాలక శాఖే స్పాన్సరర్‌గా ముందుకు రావాలని చెప్పడంతో తాను ఫైల్ తయారుచేసి మంత్రికి పంపించానన్నారు. ఆ సమయంలో లీగల్ సమస్యల గురించి వివరించానని, అయితే 'డోంట్ వర్రీ.. మళ్లీ మనమే వస్తున్నాం.. ప్రొసీడ్' అంటూ అంతా తానే చూసుకుంటానని కేటీఆర్ చెప్పారని తెలిపారు. ఎఫ్‌ఈవో నుంచి రూ.54.88 కోట్లకు వచ్చిన రెండు ఇన్‌వాయి‌స్‌లకు హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయాలని మంత్రి ఆదేశించారని చెప్పారు. క్యాబినెట్ ఆమోదం లేకపోవడం, ఆర్థికశాఖ అనుమతి తీసుకోకపోవడం, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, విదేశీ కరెన్సీ చెల్లింపులు, ఆర్‌బీఐ అనుమతికి సంబంధించి ఏసీబీ అధికారులు సంధించిన పలు ప్రశ్నలకు అర్వింద్‌కుమార్ సూటిగా జవాబిచ్చినట్లు తెలిసింది. కొన్ని కీలక డాక్యుమెంట్లతోపాటు కేటీఆర్‌తో జరిపిన వాట్సాప్ చాట్ మెసేజ్‌లను కూడా అధికారులకు అందజేశారని సమాచారం.

పురపాలక శాఖను బలవంతంగా లాగారు..

ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలోకి పురపాలక శాఖ బలవంతంగా లాగబడిందని, ఆ శాఖ మంత్రి ఆదేశాలను ధిక్కరించే పరిస్థితిలో తాము లేమని అర్వింద్‌కుమార్ ఏసీబీ ఎదుట తన నిస్సహాయతను అంగీకరించినట్లు తెలుస్తోంది. విచారణకు సహకరిస్తానని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరవుతానని చెప్పినట్లు సమాచారం. కాగా, విచారణ సమయంలో ఏసీబీ అధికారులు పలుమార్లు అర్వింద్‌కుమార్‌కు తగినంత సమయం ఇచ్చి ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఆయన చెప్పిన అంశాల ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించవచ్చని సమాచారం. విచారణ క్రమంలో అర్వింద్‌కుమార్‌కు మధ్యాహ్నం భోజనం చేయడానికి ఏసీబీ అధికారులు అనుమతించినా.. కేవలం ఆయన స్నాక్స్ మాత్రమే తీసుకున్నారని తెలుస్తోంది. అవసరమైతే మళ్లీ పిలుస్తామని చెప్పి సాయంత్రం 4.30 గంటలకు విచారణ ముగించారు. ఆయన వాహనాన్ని కార్యాలయం రెండో గేటు నుంచి పంపించివేశారు.

నేను నిమిత్తమాత్రుడినే!

కేటీఆర్, అర్వింద్‌కుమార్ చెప్పినట్లు చేశాను

- ఈడీ విచారణలో బీఎల్ఎన్ రెడ్డి వెల్లడి!
- హెచ్ఎండీఏ మాజీ సీఈకి ప్రశ్నల వర్షం


ఈడీ కార్యాలయంలో బీఎల్ఎన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో)కు నిధుల చెల్లింపు విషయంలో తాను నిమిత్తమాత్రుడినేనని హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులతో అన్నట్లు తెలిసింది. ఈ విషయంలో అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్ చెప్పినట్లే నడచుకున్నానని చెప్పినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి బీఎల్ఎన్ రెడ్డి బుధవారం ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించిన ఈడీ అధికారులు, "హెచ్ఎండీఏలో చెక్‌పవర్ ఉన్న మీరు.. ఎవరి ఆదేశాల మేరకు ఎఫ్‌ఈవోకు సంబంధించిన రెండు ఇన్వాయి‌స్‌లకు రూ.46 కోట్లు విదేశీ కరెన్సీలో క్లియర్ చేశారు? రూ.10 కోట్లు దాటితే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉండగా.. ఎందుకు తీసుకోలేదు? విదేశీ కరెన్సీలో చెల్లింపులు జరిపే క్రమంలో రిజర్వ్ బ్యాంక్ అనుమతి తీసుకున్నారా?" అంటూ వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. వీటికి బీఎల్ఎన్ రెడ్డి సమాధానమిస్తూ.. నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి, హెచ్ఎండీఏ చైర్మన్ ఆదేశాల మేరకే తాను క్లియర్ చేశానని చెప్పినట్లు సమాచారం. తనకు వచ్చిన రాతపూర్వక ఆదేశాలు, వాట్సాప్ మెసేజ్‌లకు సంబంధించిన వివరాలను ఈడీ అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. దీంతో.. హెచ్ఎండీఏలో బిల్లుల చెల్లింపు విధానం ఎలా ఉంటుంది? గతంలో ఇంకెవరికైనా విదేశీ కరెన్సీలో చెల్లింపులు చేశారా? చేస్తే ఆ వివరాలేంటి? బ్యాంకు అధికారులకు మీరు ఏ విధమైన క్లియరెన్స్ మెసేజ్ ఇచ్చారు? అనే విషయాలపై కూడా ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాగా, విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పిన విషయాల ఆధారంగా.. గురువారం విచారణకు హాజరవుతున్న నాటి పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించవచ్చని సమాచారం.

కేటీఆర్ ఇంటికా..? జైలుకా..?

నేడు ఏసీబీ విచారణకు మాజీ మంత్రి

- అర్వింద్‌కుమార్ విచారణ పూర్తవడంతో కేటీఆర్‌కు కీలక ప్రశ్నలు సంధించే అవకాశం!
- పూర్తిస్థాయిలో సన్నద్ధమైన ఏసీబీ

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా-ఈ కారు రేసు కేసులో విచారణకు గురువారం ఏసీబీ కార్యాలయానికి వెళ్తున్నారు. విచారణ తర్వాత కేటీఆర్ ఇంటికి వెళతారా? లేక అరెస్టవుతారా? అనే అంశం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఇదే కేసులో నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను బుధవారం ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. పలు కీలక అంశాలకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఈ క్రమంలో కేటీఆర్ విచారణకు వచ్చిన తర్వాత ఆయన్ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి, ఆయన జవాబులకు కౌంటర్‌గా ఎలాంటి ఆధారాలను చూపించాలనే విషయమై ఏసీబీ పక్కా వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో ఎఫ్‌ఈవో, ఏస్ నెక్స్‌జెన్, పురపాలక శాఖ మధ్య జరిగిన తొలి త్రైపాక్షిక ఒప్పందం సమయంలో జరిగిన కమ్యూనికేషన్ వివరాలను ఏసీబీ అధికారులు ఇప్పటికే పూర్తిస్థాయిలో సేకరించారు. ఏస్ నెక్స్‌జెన్ సంస్థకు చెందిన చలమలశెట్టి అనిల్‌కుమార్‌కు నాటి మంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యానికి సంబంధించిన కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. 'స్పాన్సరర్ కంపెనీ ఎందుకు తప్పుకొంది? వారి నుంచి మీకు ఎలాంటి సమాచారం అందింది? పురపాలక శాఖను ఎందుకు రెండో ఒప్పందంలోకి లాగారు? హెచ్ఎండీఏ జనరల్ ఖాతా నిధులను విదేశీ కరెన్సీ రూపంలో ఎందుకు చెల్లించాలని ఆదేశించారు? ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఇవన్నీ చేయకూడదనే విషయం మీకు తెలియదా?' అనే కోణంలో కేటీఆర్‌ను ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. ఒక మంత్రిగా ప్రభుత్వ ధనాన్ని కాపాడాల్సిన మీరు విదేశీ కంపెనీతో ఒప్పందం ఎలా చేసుకున్నారు? నిబంధనల ఉల్లంఘన కనిపిస్తున్నా ఎందుకు నివారించలేకపోయారు? అన్న విషయాలపై అర్వింద కుమార్ వాంగ్మూలం ఆధారంగా ప్రశ్నించడానికి ఏసీబీ సిద్ధమైనట్లు సమాచారం. విచారణకు సహకరించకపోతే కేటీఆర్ అరెస్టు తప్పదని సీనియర్ పోలీసు అధికారులు అంతర్గత సంభాషణల్లో స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ కేటీఆర్‌ను అరెస్టు చేయాల్సి వస్తే బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసనలు చేపట్టే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీలు, కమిషనర్లకు అలెర్ట్ వచ్చినట్లు తెలిసింది.

భారీ బందోబస్తు..

కేటీఆర్ విచారణకు హాజరవనున్న నేపథ్యంలో ఏసీబీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఏసీబీ ఆఫీసు వద్దకు వచ్చే అవకాశం ఉండడంతో అటువైపు వెళ్లే రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి మూసివేస్తున్నారు. బీఆర్‌ఎస్ కీలక నేతలు కొందరిని గృహ నిర్బంధంలో ఉంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఔటర్ టెండర్లలో అవినీతి!

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకు కాంట్రాక్టు పెద్ద స్కామ్


- బాండ్ల ద్వారా బీఆర్‌ఎస్ క్విడ్ ప్రోకో
- కైటెక్స్ కాంట్రాక్టులోనూ అక్రమాలు
- ఏసీబీకి బీసీ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదు
- కేసీఆర్, కేటీఆర్‌లపై చర్యలకు డిమాండ్

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు టెండర్లు, కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటులో అవినీతి, అక్రమాలు జరిగాయని బీసీ పొలిటికల్ జేఏసీ ఆరోపించింది. ఔటర్ టోల్ టెండర్ పొందిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ నుంచి, కైటెక్స్ గార్మెంట్స్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పెద్ద మొత్తంలో నిధులు అందాయని పేర్కొంది. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్.. క్విడ్ ప్రోకోకు పాల్పడటం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేశారని తెలిపారు. ఈ మేరకు వారితోపాటు బీఆర్‌ఎస్‌కు చెందిన ఇతర ముఖ్యనేతలపై కేసు నమోదు చేసి విచారణ జరపాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు బీసీ పొలిటికల్ జేఏసీ బుధవారం ఫిర్యాదు చేసింది. అనంతరం జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్ ఏసీబీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు 30 ఏళ్లపాటు ఔటర్ టోల్ వసూళ్లను అప్పగించడం పెద్ద కుంభకోణం అని, ఇందులో రూ.7,380 కోట్ల అవినీతి జరిగిందని అన్నారు. నిర్వహణ ఖర్చు ఎక్కువ అయ్యే ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిలో ఉంచి, ఆదాయం వచ్చే మార్గాన్ని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారని తెలిపారు. 2023 ఏప్రిల్ 27న ఐఆర్‌బీకి ఔటర్ టోల్ కాంట్రాక్ట్ దక్కితే.. 2023 జూలై 4న ఐఆర్‌బీ సంస్థ రూ.25 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీఆర్‌ఎస్‌కు ఇచ్చిందని, వారం రోజుల్లోనే ఆ డబ్బును బీఆర్‌ఎస్ విత్‌డ్రా చేసుకుందని వివరించారు. తద్వారా క్విడ్ ప్రోకో చోటుచేసుకుందని పేర్కొన్నారు. వరంగల్, రంగారెడ్డి జిల్లాలో కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటు విషయంలోనూ ఇలాగే క్విడ్ ప్రోకో జరిగిందన్నారు. 2023 జూన్ 16న వరంగల్ కైటెక్స్ కంపెనీ రూ.15 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొంటే.. మర్నాడే బీఆర్‌ఎస్ పార్టీ వాటిని ఎన్‌క్యాష్ చేసుకుందని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలోనూ కైటెక్స్ కంపెనీ 2023 సెప్టెంబరు 12న రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీఆర్‌ఎస్‌కు ఇవ్వగా, అక్టోబరు 16న ఆ పార్టీ వీటిని ఎన్‌క్యాష్ చేసుకుందని చెప్పారు.

హరీశ్‌రావుకు తెలియకుండా..!

బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన క్విడ్ ప్రోకో దందాలపై విచారణ జరపాల్సిందిగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఫిర్యాదు చేశామని, తాజాగా ఏసీబీకి ఫిర్యాదు చేశామని యుగంధర్ గౌడ్ తెలిపారు. అప్పటి ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావుకు తెలియకుండా ఈ దందా జరిగినట్లు తెలుస్తోందన్నారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసీఆర్, కేటీఆర్ ఇతర బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టాలని ఏసీబీని కోరినట్లు చెప్పారు. అలాగే హెచ్ఎండీఏ నిధులు, ఎలక్టోరల్ బాండ్ల లావాదేవీలు, ఐఆర్‌బీ, కైటెక్స్ గార్మెంట్‌లకు ఇచ్చిన కాంట్రాక్టులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్లు తీసుకోవచ్చునని, అయితే కొన్ని కంపెనీలు, లేదా వ్యక్తులకు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి టెండర్లు, స్థలాలు కట్టబెట్టి.. తిరిగి వారినుంచి ఎలక్టోరల్ బాండ్లు స్వీకరించడం స్పష్టమైన క్విడ్ ప్రోకో కిందకు వస్తుందని అన్నారు. కేటీఆర్, కేసీఆర్‌పై అవినీతి నిరోధకచట్టం సెక్షన్13(1)(ఏ), సెక్షన్13(2), ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్, ఐపీసీ 120బి, 406, 409 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాలని కోరారు. ఆయన వెంట సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ సాయిబాబా, జేఏసీ నాయకులు సంపత్‌కుమార్ రెడ్డి, గౌతమ్, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రేవంత్.. నన్నేం పీకలేవ్!



లొట్టపీసు కేసు.. లొట్టపీసు సీఎం.. పార్టీ శ్రేణులు నా గురించి ఆలోచించొద్దు

- రైతులు, ప్రజా సమస్యలపై పోరాడాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను నిలదీయాలి
- ఈ ఏడాదిని పోరాట నామసంవత్సరం చేద్దాం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నో ఎదుర్కొని ఇక్కడి దాకా వచ్చాం. రేవంత్ రెడ్డీ.. కుట్ర కేసులు, కక్షపూరిత చర్యలతో నన్నేం పీకలేవ్' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ పెట్టినప్పుడున్న పరిస్థితి, తెలంగాణ ఉద్యమకారులు పడిన ఇబ్బందులు, అమరవీరుల త్యాగాలతో పోల్చితే తనకొచ్చిందేమీ ఇబ్బంది కాదన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ 2025 డైరీని మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తనపై పెట్టిన కేసు గురించి పార్టీ శ్రేణులు ఆలోచించాల్సిన అవసరం లేదని, పార్టీ లీగల్ సెల్ ద్వారా న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. రైతులు, ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ శ్రేణులు పోరాడాలని, ఈ ఏడాదిని పోరాట నామ సంవత్సరం చేద్దామన్నారు. ఫార్ములా-ఈ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది ప్రతీకార ధోరణేనని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. ఫార్ములా-ఈ 'ఒక లొట్టపీసు కేసు.. ఆయనొక లొట్టపీసు ముఖ్యమంత్రి' అని విమర్శించారు. 'చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తయారుచేసిన సైనికుడిని.. కేసీఆర్ రక్తం పంచుకొని పుట్టిన కొడుకుని.. ఈ అక్రమ కేసులకు భయపడతానా?' అని అన్నారు. తమ భూమి గుంజుకోవద్దన్నందుకు లగచర్ల రైతులను 40 రోజులు అక్రమంగా జైల్లో పెట్టిన దానితో పోలిస్తే తనపై కేసు పెద్దదేం కాదన్నారు. రైతులు, ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. తెలంగాణలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నామని కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోనూ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఈ ఏడాదంతా రైతన్నలకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు గురించి, ప్రభుత్వం చేస్తున్న అప్పులు, తప్పులు, మోసాలు, సాగునీటి ప్రాజెక్టులపై చేస్తున్న దుష్ప్రచారం గురించి మాట్లాడదామన్నారు. అంతేకానీ తనపై పెట్టిన అక్రమ కేసు గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని చెప్పారు. కాగా, కేటీఆర్ ఫార్ములా-ఈ కేసులో విచారణ నిమిత్తం గురువారం ఉదయం 10 గంటలకు ఏసీబీ కార్యాలయానికి వెళ్లనున్నారు.

అక్రమ కేసులు తప్ప ఏం చేశావ్ రేవంత్?: హరీశ్

ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్న వారిపై సీఎం రేవంత్ రెడ్డి అక్రమ కేసులు బనాయిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 'అక్రమ కేసులు తప్ప రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే దేమైనా ఉందా? కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పరిస్థితి ఏమైంద'ని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సర్కార్ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతోందని, ప్రజల్లో మరింత బలహీనపడతానన్న భయంతో కేటీఆర్‌పై కుట్రపూరితంగా లొట్టపీసు కేసు బనాయించారని విమర్శించారు. పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయమంటే.. డబ్బుల్లేవంటున్న సీఎం తన కుటుంబ సభ్యుల భూములకు వేల కోట్లు ఖర్చుపెట్టి కల్వకుర్తి దాకా ఆరు లేన్ల రోడ్లు వేసుకుంటున్నారని ఆరోపించారు. ఆసరా పించన్లకు, రైతుబంధుకు మాత్రం పైసల్లేవంటున్నారని చెప్పారు.

బిర్యానీ బీర్ల కోసం కింగ్‌ఫిషర్ నిలిపేశారా?

తెలంగాణకు కింగ్‌ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరాను నిలిపివేయాలన్న యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) నిర్ణయం అనేక ప్రశ్నలకు తావిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బూమ్ బూబ్ బీర్, బిర్యానీ బీర్లను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందా, అందుకే యూబీఎల్‌కు తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ బకాయిలు చెల్లించలేదా అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.



గాయపడిన వారిని చికిత్స కోసం తరలిస్తున్న పోలీసులు



తొక్కిసలాటలో చనిపోయిన భక్తులు

ఆరుగురి దుర్మరణం

వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద ఈ దారుణం జరిగింది. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. మరీ ముఖ్యంగా... బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి.



వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం తరలివచ్చిన భక్తులు

మరణ మృదంగం

ప్రత్యక్షసాక్షులు, ఇతర వర్గాల కథనం ప్రకారం... బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ హైస్కూలు ఆవరణలో టోకెన్ల జారీకి పది కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడికి మధ్యాహ్నం నుంచే తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాలు, తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. హైస్కూలు వెనుకవైపు ఉన్న మునిసిపల్ పార్కులో కూర్చుని... క్యూలైన్లలోకి ప్రవేశించేందుకు ఎదురు చూస్తున్నారు. రాత్రి 8.50 సమయంలో క్యూలైన్లలోకి అనుమతించడంతో ఒక్కసారిగా అందరూ లేచి పరుగులు తీశారు. పార్కు నుంచి స్కూలులోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గేటుపై జనం పడటంతో అది ఒక్కసారిగా తెరుచుకుంది. ఒకేసారి పెద్ద సంఖ్యలో భక్తులు లోనికి వెళ్లేందుకు యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. భక్తుల్లో మహిళలు, వృద్ధులు కూడా ఉండడంతో చాలా మంది కిందపడిపోయారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు అదనపు బలగాలను రప్పించి అదుపు చేసేసరికే దారుణం జరిగిపోయింది. తొక్కిసలాటలో చిక్కుకున్న పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు, సీపీఆర్ వంటి చర్యలు చేపట్టారు. మరో కథనం ప్రకారం... బైరాగిపట్టెడ కేంద్రంలో ఒక మహిళ అస్వస్థతకు గురి కావడంతో ఆమెను బయటికి తీసుకొచ్చేందుకు అక్కడున్న పోలీసు అధికారి గేటును తెరిచారని, దీంతో భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడంతో తొక్కిసలాట జరిగిందని తెలుస్తోంది. క్షతగాత్రులను రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు.



తొక్కిసలాటలో మరణించిన ఓ మహిళ

తొక్కిసలాట ఘటనలో మృతులు

బుద్దేటి నాయుడుబాబు (51) నర్సీపట్నం, మల్లిక (47) తమిళనాడు, రజని (47) , శాంతి (40) విశాఖపట్నం , రాజేశ్వరి , నిర్మల తమిళనాడు,

ప్రత్యక్ష సాక్షుల వాయిస్

కౌంటర్ల వద్ద కనీసం సౌకర్యాలు కల్పించలేదు, పోలీసుల నిర్లక్ష్యం బాగా ఉంది. అర్ధగంట ముందుగా వచ్చిన రద్దీని కంట్రోల్ చేసుంటే కచ్చితంగా తొక్కిసలాట జరిగేది కాదు. అలాగే సకాలంలో స్పందించి వుంటే కూడా ఈ దారుణం చోటుచేసుకునేదికాదు.

- సీపీ రమణ (నర్సీపట్నం)

మా కళ్లముందే మావాళ్లను తొక్కేయడం చూసా. ఇది పూర్తిగా పోలీసుల వైఫల్యమే. బయట ఉన్నారే గాని పార్కు లోపలకువచ్చి కంట్రోల్ చేయలేకపోయారు. ప్రశ్నిస్తే పార్కులోపల తమకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా చెప్పారు.

- మునివెంకటప్ప(డీలపాడు)

అందరూ కలసి ఒక్కసారిగా గేటును నెట్టుతున్న సమయంలో పోలీసులు స్పందించి అదుపు చేసుంటే పరిస్థితి చక్కబడేది. అయినా జరిగిన సంఘటనలో నా భార్య, బిడ్డలు గాయపడ్డారు. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో బతికి బయటపడ్డారు. అంతా స్వామి కరుణ అనుకుంటున్నాం. మేము ఎంతో దూరం నుంచి వచ్చాం. స్వామి దర్శనం చేసుకోవాలనుకుంటే ఇలా జరుగుతుందని ఊహించలేదు.

-బి.అంజప్ప(నర్సాపురం)

తీవ్రంగా కలిచివేసింది: చంద్రబాబు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో చనిపోవడం పట్ల దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటన తనకు తీవ్ర బాధ కలిగించిందని అన్నారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై బుధవారం రాత్రి డీజీపీ, టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సీఎం సమీక్ష నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనలో గాయాలైన వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీసి.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ముగ్గురు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, అనిత తిరుపతికి హుటాహుటిన బయలుదేరారు. మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబు గురువారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి బయలుదేరి వెళ్లనున్నారు.

బాసర వర్సిటీలో అంతులేని అవినీతి!

- మెస్‌ల నిర్వహణ కాంట్రాక్టుల గడువు
- ముగిసి మూడేళ్లవుతున్నా.. కొనసాగింపు
- 'సెక్యూరిటీ సిబ్బంది' కాంట్రాక్టుదీ అదే తీరు
- టెండర్లు లేకుండా నడుస్తోన్న జనరల్ స్టోర్లు
- ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు



మెస్‌లలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

బాసర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ-ట్రిపుల్ ఐటీ) అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన వర్సిటీ అధికారులు.. కాంట్రాక్టర్ల మేలు కోసం కృషి చేస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే నజరానాలకు ఆశపడో.. లేదంటే వాళ్ల ఒత్తిడికి తలొగ్గో.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వర్సిటీలో పనుల నిర్వహణకు గడువు ప్రకారం టెండర్లు పిలవాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా సాగుతోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం, టెండర్లు నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. యూనివర్సిటీలో 9వేల మంది విద్యార్థులు ఉండగా.. వారి భోజన బాధ్యతలు, నిర్వహణను అధికారులు ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలకు అప్పగించారు. ఈ మూడు క్యాటరింగ్ సంస్థల కాంట్రాక్టు గడువు ముగిసి మూడేళ్లు అవుతోంది. కానీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు టెండర్లు పిలవడం లేదు. భోజనంలో పురుగులు, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకున్నా పాత వారినే కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. అలాగే, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ కాంట్రాక్టుల గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా.. పాత వారినే కొనసాగిస్తున్నారు. కాంట్రాక్టు సంస్థలు తమకు జీతాలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదంటూ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది అనేక సార్లు ఆందోళనలు చేసినా పట్టించుకున్న వారు లేరు. పరిపాలన అవసరాల కోసం మ్యాన్ పవర్‌ను అందించే సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లవుతున్నా.. టెండర్లు పిలవడం లేదు. వర్సిటీలో సూపర్ మార్కెట్, హాస్టళ్లలోని జనరల్ స్టోర్లను టెండరే లేకుండా అధికారుల బంధువులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ.. అధికారులు నోరు మెదపడం లేదు. కాంట్రాక్టు సంస్థలు, వర్సిటీకి మధ్య ఏటా రూ. 60కోట్ల నుంచి 90కోట్ల వరకు లావాదేవీలు జరుగుతుండగా.. కొత్తగా టెండర్లే పిలవకపోవడం వెనుక కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయన్న వాదన వినిపిస్తోంది.

గడువు ముగిసింది వాస్తవమే

క్యాంపస్‌లోని మూడు మెస్‌లు, హౌస్ కీపింగ్, సెక్యూరిటీతోపాటు ఇతర విభాగాల్లో కాంట్రాక్టుల గడువు ముగిసిన మాట వాస్తవమే. నేను బాధ్యతలు తీసుకోక ముందు నుంచీ అవి కొనసాగుతున్నాయి. కొత్తగా టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నాం.

- గోవర్ధన్, ట్రిపుల్ ఐటీ పీసీ

గేమ్ చేంజర్ సినిమా టికెట్ ధరల

పెంపునకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గేమ్ చేంజర్ సినిమా ఈనెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు, అదనపు ఆటలకు అవకాశం ఇస్తూ బుధవారం హోంశాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులిచ్చారు. రాత్రి 1 గంటకు వేసే ఒక్క బెనిఫిట్ షో మాత్రం రద్దు చేసిన ప్రభుత్వం.. ఈనెల 10వ తేదీ ఉదయం 4 గంటల షో తో కలిపి తొలిరోజు ఆరు షోలకు అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి మల్టీప్లెక్స్ థియేటర్లలో అదనంగా రూ.150, సింగిల్ స్క్రీన్‌లో రూ.100 పెంచుకునేందుకు అనుమతించింది. అలాగే 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 9రోజుల పాటు రోజుకు ఐదు షోల ప్రదర్శనకు సంబంధించి మల్టీప్లెక్స్ థియేటర్లలో టికెట్ మీద రూ.100, సింగిల్ స్క్రీన్‌కు సంబంధించి రూ.50 చొప్పున అదనంగా పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపుపై ప్రభుత్వం కఠినంగా ఉంటుందని ప్రచారం జరిగిన నేపథ్యంలో తాజాగా గేమ్ చేంజర్ సినిమాకు టికెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం కల్పించడం చర్చనీయాంశం అయింది. మరో వైపు.. గేమ్ చేంజర్, డాకు మహారాజ్ సినిమాల టికెట్ల రేటు పెంపును పదిరోజుల వరకే పరిమితం చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. సినిమా టికెట్ల రేటు పెంపు విషయంలో గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులను అమలుచేయాలని స్పష్టం చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.



తొక్కిసలాట బాధాకరం: ప్రధాని

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని, బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తోందని పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తిరుపతి ఘటన దిగ్భ్రాంతికరం..

- సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం తిరుపతిలోని విష్ణు నివాసం దగ్గర బుధవారం జరిగిన తొక్కిసలాటలో పలువురు భక్తులు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. తొక్కిసలాటలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా స్పందించారు. 'తిరుపతిలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతికరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఈ విషయంపై ఏపీ మంత్రి నారా లోకేశ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో మాట్లాడాను. క్షతగాత్రులకు మెరుగైన సేవలందించాలని కోరాను' అని తెలిపారు.

అడ్మినిస్ట్రేషన్ లోపం వల్లే: టీటీడీ చైర్మన్

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలకు టోకెన్ల జారీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు అడ్మినిస్ట్రేషన్ లోపమే కారణం కావచ్చని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తోపులాటల్లో భక్తులు చనిపోవడం దురదృష్టకరమని, జరగరానిది జరిగిందని విచారం వ్యక్తం చేశారు. 'టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత అడ్మినిస్ట్రేషన్ లోపం కారణంగా జరిగిందని నాకు అనుమానం ఉంది. ఘటనకు బాధ్యత అధికారులదే కదా. మంగళవారం కూడా నేను అధికారులతో సమావేశమై ఆషామాషీగా తీసుకోవద్దని చెప్పాను. గొడవలు జరుగుతాయని నాకు సమాచారముందని హెచ్చరించాను. టోకెన్లు జారీ చేసే ఒక సెంటర్‌లో ఓ మహిళ అస్వస్థతకు గురైన క్రమంలో ఆమెను బయటకు తీసుకువచ్చేందుకు అక్కడున్న డీఎస్పీ గేట్లు తెరవడంతో భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడంతో తోపులాట జరిగింది. అని బీఆర్ నాయుడు అన్నారు.

తీవ్ర ఆవేదన కలిగించింది: పవన్ కల్యాణ్

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన ఘటన తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్యశాఖకు సూచించారు. మృతులు, క్షతగాత్రుల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి కుటుంబీకులకు తగిన సమాచారం ఇవ్వడం, సహాయ సహకారాలు అందించడం కోసం సత్వరమే తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ అధికారులకు సూచించారు.

మృతుల కుటుంబాలకు సానుభూతి: రాహుల్

తిరుపతి తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి ఘటన జరగడం బాధాకరమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో బాధితులకు అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రాహుల్ పిలుపునిచ్చారు.

తెలంగాణలో కింగ్‌ఫిషర్ బీర్లు విక్రయించం!

(మొదటిపేజీ తరువాయి)



యూబీ గ్రూప్ బొంబాయి స్టాక్ ఎక్ఛేంజీ, సెబీకి తెలిపింది. తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) ధరలు పెంచడం లేదని, 2019-20 నుంచి పాత ధరనే కొనసాగిస్తోందని, రెండేళ్లకు సంబంధించిన బకాయిలు కూడా విడుదల చేయలేదని, నిర్వహణ భారం పెరిగినందున రాష్ట్రంలో అమ్మకాలు చేయలేమని వెల్లడించింది. కింగ్‌ఫిషర్ ప్రీమియం లాగర్, కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్, కింగ్‌ఫిషర్ అల్ట్రాతోపాటు హీనెకెన్ బీర్లను యూబీ సంస్థ సరఫరా చేస్తోంది. రాష్ట్రంలోని బీర్ల మార్కెట్‌లో ఈ సంస్థ వాటా 69 శాతంగా ఉంది. ప్రస్తుతం ఉన్న ధరను 33.1 శాతం పెంచాలని యూబీ గ్రూప్ ప్రభుత్వాన్ని కోరింది.

బకాయిలు రూ.658 కోట్లు

యూబీ సంస్థకు ఎక్సైజ్ శాఖ రూ.658.95 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో 2023-24లో 547.95 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరగ్గా అందులో యూబీ గ్రూప్ బీర్లు 382.73 లక్షల కేసులు. 2024-25లో ఇప్పటి వరకు 413.23 లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోగా.. యూబీ వాటా 275.22 లక్షల కేసులు. రాష్ట్రంలో బీర్లు, ఇతర మద్యం బ్రాండ్లకు సంబంధించిన మొత్తం బకాయిలు రూ.3600 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో యూబీ గ్రూప్ బీర్లకు టీజీబీసీఎల్ చెల్లించే ధరలు ఇలా ఉన్నాయి. కింగ్‌ఫిషర్ ప్రీమియం లాగర్ బీరు కేసుకు బేసిక్ ధర రూ.289గా ఉంది. కేసులో 12 సీసాలు ఉంటాయి. కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్ రూ.314గా ఉంది. కింగ్‌ఫిషర్ అల్ట్రా ధర రూ.408, హీనెకెన్ ధర రూ.490గా ఉంది. వీటికి పన్నులు కలిపి ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో విక్రయాలు చేస్తుంది. అయితే ఈ ధరలను 2019-20 నుంచి పెంచడం లేదని, దీని వల్ల సంస్థ నష్టాల్లో ఉందనేది యూబీ గ్రూప్ వాదన. పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ధరలు ఇవ్వాలని గ్రూప్ పట్టుబడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ధరల పెంపుపై ప్రభుత్వం స్పందించలేదన్న కారణంతో రాష్ట్రంలో అమ్మకాలు నిలిపివేస్తూ యూబీ గ్రూప్ నిర్ణయం తీసుకుంది.

ఒత్తిళ్లకు తలొగ్గం: మంత్రి జూపల్లి

గుత్తాధిపత్యం ఉండడంతో ఒత్తిడి చేస్తున్నారని, ఇలాంటి ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. యూబీ గ్రూప్ బీర్ల సరఫరా నిలిపివేయడంపై ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీర్ల ధరల పెంపుపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇవ్వకముందే టీజీబీసీఎల్‌పై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. బీర్ల ధరలు 33.1 శాతం పెంచాలని యూబీ సంస్థ కోరుతోందని, అంత మొత్తంలో ధరలు పెంచితే మద్యం ప్రియులపై భారం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. యూబీ కంపెనీకి కేవలం రూ.658.95 కోట్లే చెల్లించాల్సి ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం యూబీ సంస్థ బీర్లు 14 లక్షల కేసులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మద్యం ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ఆ అప్పులకు నెలకు రూ.6500 కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, ఇందులో ఎక్సైజ్ బకాయిలు రూ.2500 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు.

హెచ్‌ఎంపీవీ సోకితే ఇక్కడే నిర్ధారణ!

మన దగ్గరే మైక్రోబయాలజీ ల్యాబ్ ఉంది.. ఈ వైరస్‌తో అంత ప్రమాదం ఏమీ లేదు

- సాధారణ జలుబులాంటిదే.. భయం వద్దు
- ముందు జాగ్రత్తచర్యగా గాంధీ ఆస్పత్రిలో
- ఐసోలేషన్ వార్డు కూడా ఏర్పాటు చేశాం

'ఆంధ్రజ్యోతి'కి గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ప్రత్యేక ఇంటర్వ్యూ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరోనా వచ్చినప్పటి నుంచీ.. 'వైరస్' అనే మాట వినగానే ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. చైనాను వణికిస్తున్న 'హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్)' కేసులు మనదేశంలో కొన్ని వెలుగు చూసిన నేపథ్యంలో.. చాలా మంది భయపడుతున్నారు. కానీ.. ఆ వైరస్ గురించి భయపడాల్సిన పని లేదని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి భరోసా ఇచ్చారు. ఆ వైరస్ బారిన పడినవారికి చికిత్స చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని.. నిర్ధారణ పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

హెచ్‌ఎంపీవీ కేసులు పెరిగితే.. సమర్థంగా ఎదుర్కొవడానికి ఇక్కడ సన్నద్ధంగా ఉన్నారా?

ఆ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సింది ఏం లేదు. దాని బారిన పడినా.. సాధారణ వైరల్ ఫీవర్, ఫ్లూ తరహా లక్షణాలే ఉంటాయి. అది సాధారణ జలుబులాంటిది. ఇలాంటి వైరస్‌లు అప్పుడప్పుడూ వస్తూనే ఉంటాయి. గాంధీలో నిష్ణాతులైన వైద్యులు ఉన్నారు. సమర్థమైన చికిత్స అందించే ఏర్పాట్లున్నాయి.

ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఈ వైరస్‌కు ప్రత్యేక వార్డుల అవసరం పెద్దగా ఉండకపోవచ్చు. అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా 40 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. 20 మంది పెద్దలకు, మరో 20 పిల్లలకు పడకలు ఏర్పాటు చేశాం. అలాగే ఆస్పత్రిలో 600 ఆక్సిజన్ పడకలు ఉన్నాయి, 450 వరకు వెంటిలేటర్లు, 40 వేల కిలోలీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ సిలిండర్లు, పీడియాట్రిక్ వెంటిలేటర్లు ఉన్నాయి. ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంది.

పరీక్ష చేసి ఇక్కడే నిర్ధారిస్తారా?

గాంధీలో మైక్రోబయోలజీ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఏ వైరస్ వచ్చినా పరీక్ష చేసే సదుపాయం ఉంది. కొవిడ్ సమయంలో ఇక్కడే పరీక్షలు చేసి నిర్ధారించాం. ప్రస్తుతం ఎవరికైనా లక్షణాలు ఉండి, అనుమానం ఉంటే నమూనాలు సేకరించి పరీక్ష చేస్తాం. తర్వాత పుణేలోని సెంట్రల్ ల్యాబ్‌కు పరిశీలనకు పంపిస్తాం. అక్కడ మరోసారి పరీక్షలు చేసిన తర్వాత ఫలితాల ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటాం. పుణే నుంచి ఫలితాలు రావడానికి రెండు రోజులు పట్టొచ్చు. గాంధీలో ఉదయం పరీక్ష చేసి సాయంత్రానికి ఫలితాలు వెల్లడించే అవకాశముంది. కొవిడ్ సమయంలో ఇలాగే జరిగింది.

ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని కేటాయించారా?

ఇప్పటివరకూ అలాంటి నిర్ణయం ఏమీ తీసుకోలేదు. కానీ.. ఆస్పత్రిలో కొవిడ్ సమయంలో సమర్థమైన చికిత్స అందించిన నిష్ణాతులైన వైద్యులున్నారు. జనరల్ సర్జన్స్, మెడిసిన్, పల్మానాలజిస్టులు, పీడియాట్రిస్టులు చాలా మంది ఉన్నారు. హెచ్‌ఎంపీవీ కేసులు వచ్చినా.. లక్షణాల ఆధారంగా చికిత్స అందిస్తాం. ఇప్పటికైతే కేసుల తీవ్రత ఎక్కువగా లేదుగానీ.. ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ వైరస్‌కు ఎక్కువ మందికి సోకే గుణం ఉంది. కొంత మందికి సోకినా లక్షణాలు బయటపడకపోవచ్చు. వైరస్ వ్యాప్తి, తీవ్రత ప్రజలపైనే ఆధారపడి ఉంటుంది. అజాగ్రత్తగా ఉండొద్దు. వీలైనంతవరకూ రద్దీ ప్రాంతాల్లో తిరగకుండా ఉండడం మంచిది.

ఈ వైరస్ సోకితే ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం ఉంటుందా?

హెచ్‌ఎంపీవీ సోకితే ఔట్‌పేషెంట్లుగానే చికిత్స చేయవచ్చు. బాధితులు ఎవరి ఇంటిలో వారు విడిగా ఉంటే (ఐసోలేషన్) సరిపోతుంది. పెద్దగా ఇబ్బందులు ఏమీ రావు. జలుబు, దగ్గు ఉంటుంది కాబట్టి ఇతరులకు కాస్త దూరంగా ఉండాలి. మాస్కులు ధరించడం, చేతులను పరిశుభ్రంగా ఉంచడం, ఎవరి వస్తువులు, దుస్తులు వారే వినియోగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత జబ్బుల వంటివి ఉన్నవారికి వైరస్ సోకితే.. వారిని మాత్రం ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స చేస్తాం.

వైద్యాధికారులు ఆదేశిస్తే ప్రత్యేక వార్డు

కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్

హెచ్‌ఎంపీవీ బాధితులకు చికిత్స అందించడానికి తమ వద్ద అన్ని వసతులూ ఉన్నాయని కింగ్‌కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వైద్యాధికారుల నుంచి ఆదేశాలు, మార్గదర్శక నియమాలు వచ్చిన వెంటనే ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొవిడ్ సమయంలో తాము చాలా మందికి చికిత్సలు అందించామని, ఇక్కడే నమూనాలు సేకరించి పరీక్షలు చేసి నిర్ధారించామని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా హెచ్‌ఎంపీవీ నిర్ధారణ పరీక్షలూ తమ వద్ద చేస్తామని ఆయన వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.